# బ్రహ్మాండనాయకుని
# బాల్యలీలలు


*రచయిత*

**సి.బి. ఈరన్న**



**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

**2019**

# BRAHMANDA NAYAKUNI BALYA LEELALU

By

**C. B. Eeranna**

T.T.D. Religious Publication Series No: 1370
© All Rights Reserved

*First Edition : 2019*

Copies: 500

*Published by :*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అని గీతలో శ్రీకృష్ణుడు పేర్కొన్నట్లు దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనలకొరకు అనేక అవతారాలను ధరించాడు. వాటిలో దాదాపుగా అన్నీ అంశావతారాలు కాగా కేవలం శ్రీకృష్ణుడు మాత్రమే పూర్ణావతారం. 'కృష్ణస్తు భగవాన్ స్వయం" అని భాగవత ప్రథమస్కంధం పేర్కొన్నట్లు కృష్ణావతారం సాక్షాత్తుగా భగవంతుని పరిపూర్ణావతారం. భాగవత మహాపురాణంలో శ్రీకృష్ణావతార విశేషాలు సంపూర్తిగా దశమస్కంధంలో వర్ణింపబడ్డాయి.

అష్టాదశపురాణాలలో భాగవతానికి ఒక విశిష్టస్థానమున్నది. అందుకే శ్రీమద్భాగవతం భక్తులకు నిత్యపారాయణ గ్రంథంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఎవరైతే భగవంతుని ఈ అతిరహస్యమైనట్టి అవతారాలను ఉదయసంధ్యలలో భక్తితో కీర్తిస్తారో వారు సర్వదుఃఖాలనుండి విముక్తిని పొందుతారు. అంత్యకాలంలో దీన్ని శ్రవణం చేయడం ద్వారా మనిషి నారాయణుని దివ్యధామాన్ని చేరుకుంటాడు.

పన్నెండు స్కంధాల భాగవతంలో శ్రీకృష్ణభగవానుని చరిత్రను ఆద్యంతం వర్ణిస్తున్న భాగం దశమస్కంధం. అందుకే భాగవత దశమస్కంధాన్ని భగవంతుని అందమైన ముఖంగా పేర్కొంటారు. భాగవతం అంటే శ్రీకృష్ణభగవానుడికి మరియు అతని భక్తులకు సంబంధించినది.

శ్రీకృష్ణభగవానుని జీవితం ఆద్యంతం ఆశ్చర్యకరమే ఆనందకరమే. బాల్యమంటే శ్రీకృష్ణుని బాల్యమే అని రూఢి అయిపోయింది. శ్రీకృష్ణుని జననం మొదలు పూతనసంహారం కావచ్చు, వత్సాసుర సంహారం కావచ్చు, ధేనుకాసుర సంహారం కావచ్చు, కాళియమర్దనం కావచ్చు, కృష్ణుడు గోపికల ఇంట వెన్న దొంగిలించి స్నేహితులతో కలిసి ఆరగించడం కావచ్చు, ఇంకా అన్నీ...అన్నీ...ఆశ్చర్యప్రదాయకాలే ఆనందదాయకాలే.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే మన్నుతిన్న కృష్ణుని యశోద మందలించగా నోట బ్రహ్మాండాన్ని చూపిన ఆ లీలామానుష స్వరూపుని, ఆ బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు అమోఘం...అద్భుతం...ఆశ్చర్యకరం... ఆనందదాయకం.

ఈ విశేషాలను సమగ్రంగా సులభబోధకంగా అలతి అలతి పదాలతో చిన్న చిన్న కథలుగా "బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు" అనే పేరుతో అందిస్తున్నారు రచయిత శ్రీ ఈరన్న గారు.

బ్రహ్మాండనాయకుడైన శ్రీకృష్ణుని బాల్యవిశేషాలను క్షుణ్ణంగా వివరిస్తున్న ఈ గ్రంథాన్ని భగవద్భక్తులు ఆదరిస్తారని భావిస్తూ...

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

## నివేదన

**ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః ।**

అని ధర్మశాస్త్రం చెప్పింది. ధర్మానికి హాని కలిగిస్తే అది తిరిగి మనకు హాని కల్గిస్తుంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది అని పై వాక్యానికి తాత్పర్యం.

ధర్మమంటే ఏమిటి?

**ధారణాద్ధర్మ ఇత్యాహుః, ధర్మో ధారయతే ప్రజాః ॥**

అన్న నిర్వచనాన్ని బట్టి ఒక వ్యవస్థను విచ్ఛిన్నం కానీకుండా ఏది ధరించి వుంటుందో, అదే ధర్మం. ధర్మమే ప్రజానీకాన్ని ధరిస్తున్నది.

**'ధర్మస్య ప్రభు రచ్యుతః'** అన్నట్లు ధర్మానికి ప్రభువు అచ్యుతుడే. అందువల్ల ధర్మాన్ని రక్షించవలసిన బాధ్యత ఆ దేవుని మీదనే ఉన్నది. ఈ విషయాన్నే గీతాచార్యుడు కంఠోక్తిగా పేర్కొనియున్నాడు.

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత! ।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్ ॥**
**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ (గీత-4-7,8)**

దీని భావమిది -

"ఎప్పుడెపుడు ధర్మానికి హాని కలిగి అధర్మం పైకొస్తుందో, అప్పుడు నేను అవతరిస్తాను. శిష్ట రక్షణకూ, దుష్ట శిక్షణకూ ప్రతియుగంలోనూ నేను సంభవిస్తాను."

భగవంతుని అవతారాలు పది ప్రసిద్ధంగా పురాణాలలో పేర్కొనబడి వున్నాయి. ఆ అవతార చరిత్రలు గూడా అందులో విశదీకరింపబడ్డాయి. అవతారాలు ఇరువదినాల్గని కూడా చెప్పడం కద్దు.

అంశావతారాలు, పూర్ణావతారాలు, కళావతారాలు, లీలావతారాలు అని అవతారాలలో పలు భేదాలు ఉన్నాయి. లీలావతారాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయని శ్రీమద్భాగవతం చెబుతున్నది.

దశావతారాలలో ఒకటిగా పరిగణింపబడిన కృష్ణావతారం పరిపూర్ణావతారం. అవతరించిన నాటినుండీ అస్తమించే వరకూ ఈ దేవుడు చూపిన లీలలు అత్యద్భుతాలు. అవి ఊహల కందనివి. ఆ లీలలలో అంతర్భాగంగానే పలుసార్లు ఆ పరమాత్ముడు విశ్వరూపాన్ని ప్రదర్శించాడు.

ద్వాపరంలో జన్మించిన కృష్ణుడు కలియుగ ప్రారంభదినం వరకూ ఈ భారతావనిలో అనేకపర్యాయాలు తన లీలలు ప్రదర్శించాడు. అందులోనూ విశేషించి ఆ దేవుడు బాల్యంలో చూపిన లీలలు ఎంతో విశిష్టమైనవి. భాగవతాది గ్రంథాలు ఈ బాల్యలీలలను మనోజ్ఞంగా వర్ణించి వున్నాయి.

శ్రీకృష్ణుని అవతారకాలంలో అందరూ ఆయనను పరమాత్మగా విశ్వసించలేదు. ఇందుకు గీతలోని వచనమే ప్రమాణం –

**అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥ (గీత–9–11)**

శ్రీకృష్ణుని పరమభావమిట్టిదని తెలియని మూఢులు సకలప్రాణులకూ ప్రభువైన ఆ దేవుని సామాన్య మానవునిగా భావించి అవమానించారు. కాని తత్త్వం తెలిసినవారు మాత్రం ఆయనను పరిపూర్ణావతారంగా, సకల

దేవతాస్వరూపునిగా తలచి ఉపాసించారు. తన జన్మ, తన కర్మ దివ్యములని ఆ దేవుడే (జన్మ కర్మ చ మే దివ్యం) వచించాడు గదా!

శ్రీకృష్ణుని విభూతి, విశ్వరూపాల తీరుతెన్నులు గీతలోని 10, 11 అధ్యాయాలలో విశదంగా నిరూపితాలయ్యాయి.

**"బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు"** అన్న ప్రకృత గ్రంథంలో శ్రీకృష్ణుని బాల్యలీలలు రమణీయంగా, సరళ సుందరమైన భాషలో వర్ణింపబడినాయి. ఆ లీలలు భగవానుని మహిమనెలా ప్రకటించాయో, భక్తులనెలా ఉద్ధరించాయో, ఈ గ్రంథంలో శ్రీ సి.బి. ఈరన్న గారు వర్ణనాత్మకంగా, వివరించారు.

గ్రంథంలో ప్రతిపాదించిన విషయాలకు ప్రమాణంగా ఎడనెడా గీత, భాగవతం, గర్గసంహిత మున్నగు గ్రంథాలను చూపారు. మరొక ముఖ్యాంశమేమంటే ప్రాచీన పురాణాలలో ప్రతిపాదితాలైన వాసుదేవుని బాల్యలీలలను పదకవితా పితామహుడైన అన్నమయ్య ఎలా వర్ణించాడో, తెలుపుతూ పలు సంకీర్తనలను ఇందులో రచయిత ఉదాహరించారు. అప్రతిమప్రతిభతో ఆయన పాడిన పాటలు నేడు మిక్కిలి వ్యాప్తిలో ఉన్నాయి. బాల్యలీలా వర్ణనరూపమైన ఈ రచనలో అవి చక్కగా పొందుపరచబడినాయి.

కంసుని ప్రేరణతోనో, మరొక విధంగానో కృష్ణుణ్ణి హతమార్చడానికి వచ్చిన పూతన, శకటాసురుడు మున్నగు దుష్టశక్తుల పూర్వవృత్తాంతాలు 'గర్గసంహిత' మున్నగు గ్రంథాలనుండి ఇందులో ఉదాహరింపబడివున్నాయి. భాగవతాది గ్రంథాలలో ఆ వృత్తాంతాలు కనిపించవు. అందుచేత భాగవతాదులను చదివినందువల్ల గూడా కలగని సంతృప్తిని ఇందులో ఆ వృత్తాంతాలను చదివి మనం పొందవచ్చు.

ఈ దినాలలో పెద్దపెద్ద సంపుటాలు చదివే పాఠకులు అరుదయ్యారు. కాన లఘుగ్రంథాలతోనే భగవద్భక్తిని ప్రచారం చేయవలసిన అవసరం ఏర్పడింది. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం ద్వారా ఇట్టి గ్రంథాలను విరివిగా ప్రచురించి ప్రచారం చేస్తూ వుండడం అభినందనీయం.

ఈ పుస్తకం విస్తృతవ్యాప్తి పొంది పలుసార్లు ప్రచురింపబడి కృష్ణభక్తిని ప్రజల హృదయాలలో గాఢంగా నాటుకొనజేయుగాక! అని ఆశిస్తున్నాను.

ఈ నాల్గు మాటలు 'నివేదన' రూపంలో ఇక్కడ వ్రాయడానికి అవకాశమిచ్చిన ప్రచురణ విభాగ ప్రత్యేకాధికారి, సహృదయ శిరోమణి, డా॥ తాళ్ళూరి ఆంజనేయులుగారికి కృతజ్ఞుడను.

**– సముద్రాల లక్ష్మణయ్య**

తిరుపతి
27-1-2019

# అభినందన

**నరజన్మ బందాగె నాలిగె ఇరువాగె, కృష్ణా! యనబారదె?**
**కృష్ణా! ఎందరె కష్టపరిహార, కృష్ణా! యనబారదె!**

నరజన్మ కలిగినందుకు, నాలిక (మాట) ఉన్నందుకు కృష్ణా! అనరాదా. కష్టాలన్నీ తీరిపోతాయి కదా. అందుకే నోరారా కృష్ణ! కృష్ణ! అనమంటారు కన్నడ హరిదాసు పురందరదాసులవారు.

విష్ణుభగవానుని దశావతారాల్లో తొమ్మిదవది కృష్ణావతారం. పదవది కల్క్యవతారం. ఇది ఇంకా రానేలేదు. ఎప్పుడో కలియుగాంతంలో వస్తుందట. మరి కలియుగానికంటె ముందరిదీ, మనకు దగ్గరిదీ అయిన ద్వాపర యుగంలో శ్రీకృష్ణభగవానుడు అవతరించాడు.

అసలు కృష్ణయ్య పుట్టినప్పటినుండి అన్నీ అద్భుతాలే! అన్నీ ఆశ్చర్యాలే.

కొందరికయితే వ్రేపల్లెలోని యశోదకృష్ణుడంటే ఇష్టం! మరికొందరికి యమునాతీరంలో గొల్లపిల్లలతో చద్దన్నాలుతింటూ గోవులను కాచే గోపాలకృష్ణుడంటేనే ఇష్టం! ఇంకొందరికయితే బృందావనంలో రాసలీలల్లో మునిగితేలిన రాధాకృష్ణుడంటేనే వెర్రిప్రేమ! మరికొందరు రాయబారం నడపిన రాజకీయవేత్తగా కృష్ణుణ్ణి దర్శిస్తారు. మరి వేదాంతులు, జ్ఞానులు గీతోపదేశం చేసిన కృష్ణపరమాత్మను "వందే జగద్గురుం" అంటూ కీర్తిస్తారు.

ముఖ్యంగా నాకుమాత్రం, చిన్ని నల్లనయ్య అంటేనే ఇష్టం. చేత్తో వెన్నముద్దతింటూ మూతికి పూసుకొన్న వెన్నతో దోగాడుతున్న చిన్ని కృష్ణుడంటే ఎంతిష్టమో! ఇంకా దిగంబరంగా బంగారు మొలతాడుతో, ముత్యాల సిగ్గుబిళ్లతో, కాళ్లగజ్జలతో ఒళ్లంతా మట్టితో తప్పటడుగులతో పడుతూ లేస్తూ పారిపోతున్న కన్నయ్య అంటే ఎవరికిష్టం ఉండదు! "అమ్మా! పాలివ్వవే! అమ్మా! పాలే" అంటూ మారాం చేస్తూ గోముగా చీరకొంగును లాగుతూ యశోదకాళ్లకు అడ్డంపడుతున్న బుంగమూతి నల్లని కిట్టయ్యంటే

ఇష్టపడని పడుచులుంటారా? ఇందరు ఇన్నివిధాలుగా ఇష్టపడుతున్న కన్నయ్య, పొత్తిళ్లలోనే చనుబాలు తాపిన పూతన పాలతోపాటు, ప్రాణాల్ని తాగాడంట! ఒకనాడు మన్ను తిన్న కన్నయ్యను పట్టుకొని, "మన్ను తింటావా! ఏదీ నోరు తెరు." అంటూ కొట్టబోయిందట యశోదమ్మ, "అమ్మా! కొట్టకే! మన్ను తినలేదు, నా నోరు చూడు!" అంటూ నోరుతెరిచాడు. ఇంకేముంది ఆ చిన్ని కన్నయ్య నోట్లో గిరగిర తిరుగుతున్న బ్రహ్మాండాలన్నీ కనిపించాయి అంతే. బిత్తరపోయి చూసింది యశోద! ఇంతేనా! ఒకప్పుడు తన చిన్ని కాళ్లతో బండిరాక్షసుణ్ణీ, చేతులతో కొంగరాక్షసుణ్ణీ, కొండచిలువ రక్కసుణ్ణీ చంపి తిన్నగా వైకుంఠానికి సాగనంపాడు. ఇక కాళియుడనే విషసర్పాన్ని పాదాలతో మర్దించాడు.

ఇదిగో! చిన్ని కన్నయ్య చేసిన లీలల్నీ మహిమల్నీ ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇలాంటి ఆనందకరమైన మహిమల్ని ఎన్నింటినో గుదికుచ్చి పిల్లలూ, పెద్దలూ అందరూ చదువుకొనేందుకు వీలుగా **"బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు"** అనే పేరుతో చక్కని గ్రంథాన్ని సరళమైన వచనంలో అందించిన రచయిత శ్రీ సి.బి. ఈరన్నగారు అభినందనీయులు. ధన్యులు కూడ. ఆకర్షణీయమైన చిన్ని చిన్ని శీర్షికలతో చిన్ని కృష్ణుని కథలు వున్న ఈ పుస్తకం తి.తి.దేవస్థానంవారి ప్రచురణగా వెలువడడం ముదావహం.

రచయిత ఇలాంటి రచనలను మరెన్నింటినో అందిస్తారని ఆకాంక్షిస్తున్నాను.

***చిన్నికృష్ణ! నిన్ను చేరికొలుతు!!***

ఇట్లు

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

"కన్సల్టెంటు" ప్రచురణల విభాగం

తి.తి.దేవస్థానములు, తిరుపతి.

"రథసప్తమి"

12 ఫిబ్రవరి, 2019

# సత్యదర్శిని

**"భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః"**

**"అప్రమేయో హృషీకేశః పద్మనాభో౽మరప్రభుః"**

ఈ సృష్టి ఆవిర్భావాన్ని, పరమాత్మ తత్త్వాన్ని పూర్తిగా వివరించగల సత్తా వాక్కుకు, రాతకులేదు. సాధన ద్వారా మాత్రమే అనుభవయోగ్యం.

సృష్ట్యాదినుండి అనేక పరిణామాలను సంతరించుకున్న మానవాళిలో సత్యాన్వేషణ మాత్రం అనంతంగా కొనసాగుతూనే ఉంది. జీవులు తీసుకున్న వివిధ ఉపాధులలో ఉండే విశేషాలు పుట్టే, గిట్టే సమయం వంటివి. కాలభేదాలు నిర్ధారిస్తాయి. అలా సృష్టించబడిన ఈ విశ్వం తనకు ఆధారభూతమైన పరమాత్మతో నిత్యం సంబంధాన్ని కల్గి ఉంటుంది. అనేక జీవులు ఆవిర్భవిస్తూ – లయమవుతూ ఉంటాయి. ఈ కాలచక్రగమనంలో ప్రత్యేక జీవి అయిన మనిషిమాత్రం జ్ఞానం, అజ్ఞానం మధ్యలో కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. దీనికి కారణం ఈ ''బ్రహ్మాండంలోని బ్రహ్మాండనాయకుని" దర్శించకపోవడమే.

అలా అజ్ఞాన, అంధకారంలో చిక్కుకుని వలలో చిక్కిన పిట్టల్లా భౌతిక ప్రపంచపువ్యామోహంలోపడి రెపరెపలాడుతున్న మానవుడికి సత్యదర్శనం గావించే ఒక దిక్సూచి ఈ బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు.

బ్రహ్మాండం అంటే ఈ విశ్వం / సృష్టి . బ్రహ్మాండ నాయకుడు అంటే సృష్టి కర్త. ఈ సత్యం సత్యాన్వేషణ ద్వారానే అవగతమవుతుంది. క్షణికమైన జన్మపరంపరను అనుభవించే మనిషి ఎప్పుడూ ప్రకృతి చేతిలో పసిబిడ్డడే.

మనిషిది రక్తమాంసాలతో నిర్మితమైన శరీరం. ఇది అశాశ్వతం. అయితే మనిషిలో శాశ్వతమైనది ఆత్మ ఒక్కటే. ఇది క్షయం కాదు. దివ్యలోకాలనుండి దిగివచ్చే ఒకకాంతికణం. ఇదే బ్రహ్మాండనాయకుని సృష్టి. ప్రతి మనిషిలోనూ, ఆలోచనా దిశలు, ఆశలకు, ఆశయాలకు, భ్రమలకు అతీతంగా విశ్వవిహారం

చేస్తే ఈ సత్యం దర్శనమౌతుంది. ఆ బాధ్యతను ఈ గ్రంథం నెరవేరుస్తుందనడానికి సాక్ష్యాలే సృష్టికర్త బాల్యలీలలు. ఈ లీలలు చదవడం ద్వారా పూర్తిగా యాంత్రికతకు అలవాటైపోయిన మనసుకు ఒక దివ్యమైన అనుభూతి కల్గుతుంది. బ్రహ్మాండనాయకుని లీలాశక్తి (దైవశక్తి) ఒక సముద్రంలాగా మనలో ప్రవేశించి మన మనసులోని మాలిన్యాల్ని పరిశుద్ధం చేస్తుంది. తద్వారా భ్రమాజనితమైన సందేహం, భయం, మానసిక అశాంతి మొదలైన అడ్డంకులన్నీ తొలగి జ్ఞానార్జనవైపు మన దృష్టిని మరల్చుతుంది.

వాస్తవం ఏమంటే మనశరీరంలో ఉన్న ప్రాణశక్తే మన ప్రాణానికి (జీవనానికి) ఆధారం. అది ఉచితానుచిత జ్ఞానం ఉన్న శక్తి. అదే మన శరీరాన్ని నడిపిస్తుంది. మనం అనేక భౌతిక కార్యకలాపాల్లో పడి ఆ శక్తిని (ఇంధనాన్ని) ఎప్పుడూ ఖర్చుపెడ్తూనే ఉంటాం. ఎందుకంటే మన మనసంతా భౌతిక సంపాదనవైపే ఉంటుంది. ఆ ఇంధనాన్ని (ప్రాణశక్తిని) పెంపొందించుకోవడానికి తగినవిధంగా మనసు సంసిద్ధం కావడానికి ఈ లీలలు ఒక ఉపకరణాలుగా ఉండి మనోవికాసానికి తోడ్పడతాయి.

ఇదే భూదేవి ఆవేదనను ప్రస్తావించిన రచయిత ఆవేదన. శ్రీకృష్ణుని అవతరణాన్ని ఆవిష్కరించిన వైనం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. కలియుగంలోని భూమండలంపై అవిద్య, అజ్ఞానం, అధర్మం ప్రళయతాండవం చేస్తూ ధర్మానికి నిలువనీడలేని పరిస్థితులు, ఆకారణంగా లోకోద్ధరణకై భగవంతుని అవతారాలు అన్నీ ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి.

"భగవంతుడు వసుదేవునిహృదయంలో చేరి అచటనుండి దేవకి హృదయంలో చేరి అచటనుండి గర్భంలోకి ప్రవేశించాడు. భగవంతుడు ఉన్నకారణంగా గర్భవతి అయిన దేవకి ముఖం ప్రకాశిస్తున్నది. ఆ తేజస్సును చూసినంతనే కంసుడు కలత చెందాడు."

చూశారా! ప్రతిమనిషి సాధనతో భగవంతుని తన హృదయంలో నిలుపుకుంటే జీవితం ఎంత అద్భుతంగా ఉంటుంది? ఆ దైవశక్తి (జ్ఞానం, వెలుగు) ఉన్నచోట చీకటి (అజ్ఞానం) ఎలా ఉండగల్గుతుంది. అందుకే మనిషి జీవంతో ఉండాలి, జీవించాలి. నిరంతరం తన హృదయాన్ని త్రికరణశుద్ధిగా బ్రహ్మాండనాయకునికి సమర్పించాలి. అదే సర్వసమర్పణ.

రచయిత ఈ ఘట్టంలో చెప్పిన తేజస్సును (దైవాన్ని) మన దేహంలో నింపుకోవాలి. అందుకే "దైవం మానుషరూపేణ, ఆత్మ పరబ్రహ్మం, దేహమే దేవాలయం."

ఆ తేజస్సే రాక్షస శక్తుల్ని కలతకు గురిచేసింది. అంటే రాక్షస శక్తులు ఎంత బలీయమైనా, ఎన్ని కుట్రలు పన్నినా అవి తాత్కాలికాలే. దైవశక్తిముందు రాక్షస శక్తులు వీగిపోవాల్సిందే. చివరకు ధర్మమే జయిస్తుంది. అదే ప్రకృతి ధర్మం. ఈ సత్యం మనకు ఈ గ్రంథంలోని పాలుతాపిన పుణ్యవనిత పూతనసంహారం, తృణావర్త – వత్సాసుర సంహారం, ప్రలంబాసుర వధ, కాళియమదహరణం, కేశిసంహారం, అరిష్టాసుర అంతం మొదలైన ఘట్టాలు చాలా స్పష్టంగా దర్శింపజేస్తాయి. ఈ సత్యదర్శనం నేటి సమాజానికి అత్యంత అవశ్యకం.

అపారమైన జ్ఞానవిజ్ఞానాలకు, సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలమైనది. మన భారతదేశం. అలాంటి భారతీయతకు నిలయమైన గ్రంథం. గర్భధారణం, శిశుజన్మ, సీమంతం, శిశుజననం తర్వాత నామకరణమహోత్సవం, తలనీలాలు సమర్పించడం చెవులు కుట్టడంలాంటి ఘట్టాలనుకూడా కూర్చడం ద్వారా మన సంస్కృతి పునాదులు మరింత పటిష్టమవుతాయని చెప్పవచ్చు.

అంతేకాక సర్వసాధారణమైన మానవుని పుట్టుకకు – దైవ అవతరణకు గల తేడాలు, పునర్జన్మ సిద్ధాంతం, కర్మసిద్ధాంతం ప్రతిమనిషి పుట్టుకకుగల

కార్యకారణ సంబంధాలులాంటి అనేక విషయాలు ఈ గ్రంథంలో తేట తెల్లమౌతాయి. ఇంద్రుడు సైతం స్తుతించిన శ్రీకృష్ణతత్త్వం సుందరిగా మారిన గూనివనిత, గోవిందుని వేలిపై గోవర్ధనంలాంటి శీర్షికలద్వారా పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా రచయిత ఆవిష్కరించిన తీరు అభినందనీయం.

"భావశుద్ధియే జ్ఞానసిద్ధి" అన్నట్లు మన భావనలో ఎంతటి పరిశుద్ధత ఉండాలనే విషయం కూడా రచయిత ఉటంకించిన దివ్యమైనలీలల్లో స్పష్టంగా గోచరిస్తుంది. అనేక ఘట్టాల్లో ఆయాపాత్రలు భగవంతుని స్పర్శతో, దర్శనంతో, జ్ఞానోదయం కలగటం, అలాగే చేసిన తప్పును తెలుసుకొని తిరిగి ఉన్నతమైన జన్మకోసం అపారంగా తపస్సు చేయడం, ఆ తపశ్శక్తితో భగవంతుడ్ని ప్రసన్నం చేసుకోవడంలాంటి అనేక విషయాలు మనిషి జీవనవికాసానికి దోహదం చేస్తాయి.

**"ఆత్మశుద్ధి లేనిఆచార మది యేల**
**భాండశుద్ధి లేనిపాక మేల**
**చిత్తశుద్ధి లేనిశివపూజ లేలరా"** అన్నట్లు పరిశుద్ధమైన మనస్సుతో, సరియైన సంకల్పంతో దైవసాధన చెయ్యాలనే విషయం "గుప్పెడు గింజలకు గంపెడు రత్నాలు"లోని దైవస్పర్శ, అనుగ్రహం ద్వారా స్పష్టమౌతుంది. ఆ దైవస్పర్శకోసమే మనం సాధనచెయ్యాలి. అప్పుడే మోదులకు లాగ మనకు కూడా మోక్షమార్గం సుగమం అవుతుంది. మానవుని అంతిమ లక్ష్యం ఇదే. బాలునితత్త్వమే బ్రహ్మతత్త్వం. బాలుని నోట్లో బ్రహ్మాండాన్ని దర్శింపజేసే "సత్యదర్శిని" పై మన దృష్టిని సారిస్తే...

**దృష్టి నిలిపె నేని దేవుడు దిగివచ్చు**
**దృష్టి నిలప దేని నష్టపడును**
**దృష్టిలోనె సర్వసృష్టి పుష్ట మౌను**

సదా విశ్వవ్యాపకుడైన బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు పాఠకుల హృదయాల్ని వికసింపజేసి ఉన్నత స్థితికి తీసుకెళ్తాయని ఆశిస్తున్నాను.

**"అసతో మా సద్గమయ**
**తమసో మా జ్యోతిర్గమయ**
**మృత్యో ర్మా అమృతం గమయ"**

***ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః***

ఇట్లు
**డా॥ పి. వరలక్ష్మి**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ, పి.జి.కళాశాల
పుత్తూరు.
చరవాణి : 90008 74713

# విషయసూచిక


| | | పుటలు |
|---|---|---|
| 1. | శ్రీకృష్ణుని అవతరణం | 1 |
| 2. | పాలుతాపిన పుణ్యవనిత | 10 |
| 3. | శకటాసుర వధ | 15 |
| 4. | తృణావర్త - వత్సాసుర సంహారం | 17 |
| 5. | గుప్పెడు గింజలకు గంపెడు రత్నాలా! | 21 |
| 6. | మోదులకు మోక్షం | 28 |
| 7. | బాలుని నోట్లో బ్రహ్మాండాలా! | 33 |
| 8. | దావాగ్నిని మింగిన దేవుడు! | 38 |
| 9. | ప్రలంబాసుర వధ | 43 |
| 10. | బ్రహ్మకు తొలగిన భ్రమ | 46 |
| 11. | కాళియ మదహారి | 51 |
| 12. | కేశి, వ్యోమాసురుల సంహారం | 56 |
| 13. | అరిష్టాసుర సంహారం | 58 |
| 14. | ముక్తిపొందిన ముదితలు | 60 |
| 15. | గోవిందుని వేలిపై గోవర్ధనం! | 65 |
| 16. | బక-అఘాసురాంతకుడు | 72 |
| 17. | ధేనుకాసుర దమనం | 75 |
| 18. | కంసుని చంపిన కన్నయ్య | 79 |

# బ్రహ్మాండనాయకుని బాల్యలీలలు

## 1. శ్రీకృష్ణుని అవతరణం

ఒకప్పుడు రాజుల రూపంలో ఉన్న రాక్షసులయొక్క సేనాభారం సమస్త ప్రపంచానికి మోయరాని బరువైంది. అప్పుడు భూదేవి గోరూపం దాల్చి బ్రహ్మదేవుని శరణువేడింది. భూదేవిదుఃఖం చూసి కనికరంతో బ్రహ్మదేవుడు శివాది దేవతలతోపాటు గోరూపంలో ఉన్న భూదేవితో సహా క్షీరసాగరంలో శయనించి ఉన్న విష్ణువును చేరి ప్రార్థన చేశాడు. అపుడు శ్రీ మహావిష్ణువు రాక్షసులు కలుగజేసిన భారాన్ని తొలగించేందుకు తాను భూమిపై అవతరిస్తానని, ఆదిశేషుడు బలరాముడిగా మొదట పుడతాడని కృష్ణునియొక్క శక్తిస్వరూపిణియైన యోగమాయ కూడ పుట్ట గలదని పలికాడు.

దేవకిని వివాహమాడిన పిమ్మట వసుదేవుడు రథంలో ఆమెతోపాటు ఇంటికి వస్తున్నాడు. దేవకి అన్న కంసుడు రథం నడుపుతున్నాడు. అపుడు అశరీరవాణి కంసుణ్ణి ఉద్దేశించి దేవకి ఎనిమిదో సంతానం నిన్ను చంపుతాడని చెప్పింది. ఆ దుర్వార్త వినిన వెంటనే కంసుడు దేవకిని చంపేందుకు సిద్ధమయ్యాడు. భార్యను రక్షించుకోవడం భర్త ధర్మం కాబట్టి వసుదేవుడు సోదరిని చంపడం, ముఖ్యంగా ఆమె వివాహ సమయంలో అట్టి పని చేయడం మంచిదికాదని చెప్పాడు. కాని కంసుడు అంగీకరించలేదు. వసుదేవుడు తెలివిగా ఒక ఉపాయం చెప్పాడు. నీకు ప్రమాదం దేవకి వల్ల కాదు కదా! కేవలం ఆమె సంతానం వల్ల మాత్రమే. కాబట్టి ఆమెకు పుట్టిన ప్రతి బిడ్డను నీకు ఇచ్చి వేస్తాము. ఈమెను మాత్రం దయచేసి వదిలిపెట్టు అని బ్రతిమాలాడు.

కొంతకాలానికి దేవకికి సంతానం కలిగింది. ఆ శిశువును వసుదేవుడు మాట ప్రకారం కంసునికి అప్పగించాడు. వసుదేవుని నిజాయితీ చూసి కంసుడు ఆశ్చర్యపడ్డాడు. కాని తాను చావబొయ్యేది ఎనిమిదో సంతానంచేత

కదా! ఈ మొదటి బిడ్డను చంపడం ఎందుకు అనుకొన్నాడు. వసుదేవుడు కంసుని మాటలను నమ్మలేదు. ఎందుకంటే కంసుడు నిలకడ లేనివాడని అతనికి తెలుసు.

ఆ సమయంలో నారదమహర్షి కంసుని వద్దకు వచ్చాడు. కంసుడు వసుదేవుని తొలి బిడ్డను తిరిగి ఇచ్చివేశాడని తెలిసికొన్నాడు. కృష్ణుని అవతారం సాధ్యమైనంతవరకు ముందుగా జరిగేట్లు చేయాలని నారదుడు అనుకున్నాడు. నారదముని అనుగ్రహం వల్ల కంసునికి తన పూర్వజన్మ జ్ఞానం కలిగింది. అతడు పూర్వజన్మంలో కాలనేమి అనే రాక్షసుడనీ, విష్ణువుచే తాను చంపబడ్డానని తెలిసికొన్నాడు. విష్ణువు కృష్ణుడుగా పుట్టబోతున్నాడు. కనుక తాను గత జన్మలో చంపబడినట్లే కృష్ణునిచే చంపబడతానని భయపడ్డాడు.

అతడు మొట్టమొదట యదు భోజాంధకవంశాల రాజైన తన తండ్రి ఉగ్రసేనుణ్ణి చెరసాలలో బంధించాడు. వసుదేవుని తండ్రి శూరసేనుణ్ణి బంధించి, అతని రాజ్యాన్ని ఆక్రమించాడు. ఆ ప్రాంతాల కన్నింటికీ తానే రాజునని ప్రకటించుకొన్నాడు.

కంసుడు దేవకి ఆరుగురు పుత్రుల్ని చంపిన తర్వాత, ఆదిశేషుడు ఆమె గర్భంలో ప్రవేశించాడు. అప్పుడు అతడు యోగమాయ ద్వారా గోకులంలో నందమహారాజు సంరక్షణలో ఉన్న వసుదేవుని మరో భార్య రోహిణి గర్భంలోకి చేర్చాడు. అందరూ దేవకీదేవికి గర్భస్రావం జరిగింది అనుకున్నారు.

వసుదేవుడు, నందమహారాజు ఒకే తండ్రికి జన్మించారు. అతని భార్యలలో ఒకరు క్షత్రియ వంశంవారు. మరొకరు వైశ్యవంశానికి చెందినవారు. క్షత్రియ కన్యకు వసుదేవుడు జన్మించగా, వైశ్యకన్యకు నందమహారాజు జన్మించాడు. వసుదేవుడు క్షత్రియకన్యను, నందుడు

వైశ్యకన్యను వివాహమాడారు. వసుదేవుడు కంసుని దురాగతాలకు భయపడి తన భార్య రోహిణిని నందుని ఇంట ఉంచాడు.

దేవకి ఏడవ గర్భాన్ని యోగమాయ రోహిణి గర్భానికి మార్చిన తరువాత, భగవంతుడు వసుదేవుని హృదయంలో చేరి అచటనుండి దేవకి హృదయంలోకి ప్రవేశించాడు. భగవంతుడు హృదయంలో నిలిచియున్న కారణంగా గర్భవతియైన దేవకి ముఖం ప్రకాశిస్తున్నది. ఆ తేజస్సును చూచినంతనే కంసుడు కలత చెందాడు. అయినా బంధుత్వం వల్ల అతడు ఆమెకెట్టి అపకారం చేయలేకపోయాడు.

దేవకి గర్భంలో సాక్షాత్తు భగవంతుడు నిలిచి ఉన్న కారణంగా దేవతలందరూ అతనిని స్తుతించారు. భగవంతుడు స్వయంగా భగవద్గీత (4.7–8) లో తన అవతరణానికి కారణం వివరించాడు.

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహమ్ ॥**

"ఓ భరతవంశీయుడా! ఎప్పుడెప్పుడు, ఎచ్చటెచ్చట ధర్మానికి హానికలుగుతుందో అధర్మం వృద్ధినొందుతుందో ఆ సమయంలో నేను అవతరిస్తాను."

శ్రీకృష్ణుడు భగవద్గీత అధ్యాయం 4 శ్లోకం 9లో తన జననం, లీలలు అన్నీ దివ్యములని తెలుపుతున్నాడు.

**జన్మ కర్మ చ మే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున ॥**

"ఓ అర్జునా! నా జన్మం కర్మల దివ్యత్వం ఎరిగినవాడు శరీరత్యాగం పిమ్మట తిరిగి ఈ భౌతిక జగంలో జన్మింపక నా శాశ్వతమైన ధామాన్నే పొందుతాడు."

అటువంటి అద్భుతమైన పుట్టుకను శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారు తన సంకీర్తనలో ఈ విధంగా తెలియజేశారు.

**సతులాలచూడరే**

**ప. సతులాలా చూడరే శ్రావణ బహుళాష్టమి**
**కతలాయ నడురేయి కలిగె శ్రీకృష్ణుడు ॥**

**చ. పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖుచక్రాలు**
**ఎట్టు దరియించెనే యీ కృష్ణుడు**
**అట్టే కిరీటము ఆభరణాలు ధరించి**
**ఎట్ట ఎదుట వున్నాడు ఈ కృష్ణుడు ॥**

**చ. వచ్చి బ్రహ్మయురుద్రుడు వాకిట నుతియించగాను**
**ఇచ్చగించి వినుచున్నాడీ కృష్ణుడు**
**ముచ్చటాడీ దేవకితో ముంచి వసుదేవునితో**
**హెచ్చిన మహిమలతో ఈ కృష్ణుడు ॥**

**చ. కొదదీర మరి నందగోపునకు యశోదకు**
**ఇదివో తా బిడ్డడాయె నీ కృష్ణుడు**
**అదన శ్రీ వేంకటేశుడై అలమేల్మంగగూడి**
**ఎదుటనే (నిలుచున్నాడీ కృష్ణుడు) వున్నాడు ఈ కృష్ణుడు ॥**

శ్రీకృష్ణుని అవతారం, సామాన్య మానవుని పుట్టుక వంటిదికాదు. స్వామి అవతారానికి కాలం పరిపక్వమైనప్పుడు గ్రహనక్షత్రమండలాలు కూడా చాలా శుభకరంగా వుంటాయి. రోహిణీ నక్షత్రం ఆనాడు మహోజ్జ్వలంగా ప్రకాశిస్తూ ఉంది. రోహిణీ నక్షత్రంపై స్వయంగా బ్రహ్మ పర్యవేక్షణ జరుపుతున్నాడు.

చతుర్బాహువు, శంఖ చక్ర గదా పద్మపాణి, శ్రీవత్సలాంఛనుడు, కౌస్తుభధారి, పీతాంబరధరుడు, ఉజ్జ్వల నీలకుండలుడు అయిన అద్భుత

శిశువు జన్మించాడు. వసుదేవుడు ఈ అసాధారణ లక్షణాలు గల శిశువును చూసి అబ్బురపడ్డాడు. ఏ శిశువు కూడా ఇలా అద్భుతంగా జన్మింపడు. వసుదేవుడు ఆ శిశువును మరల మరల దర్శించాడు. సర్వవ్యాపకుడగు విష్ణువు తన ఇంట జన్మించాడని ఆనందించాడు.

సాధారణంగా జనులు మగశిశువు పుట్టగానే పండుగ జరుపుకుంటారు. నేను కారాగారంలో వున్నాను. నేను ఏ విధంగా పండుగ జరుపుకోవాలి అని వసుదేవుడు బాధపడ్డాడు. వైదిక పద్ధతి ప్రకారం రాజులు వారి ఇంటిలో శుభకార్యం జరిగే రోజు అనేకరకమైన వస్తువులను దానమిస్తూ ఉంటారు. బంగారు ఆభరణాలతో అలంకరింపబడిన గోవులను బ్రాహ్మణులకు, ఋషులకు దానమిస్తారు. వసుదేవుడు కారాగారంలో వున్నందున, అది సాధ్యంకాదు కాబట్టి, దానికి బదులుగా వేలకొలది గోవులను బ్రాహ్మణులకు దానం చేస్తానని మనస్సులో అనుకొన్నాడు.

ఆ తరువాత వసుదేవుడు స్వామిని ఈ విధంగా ప్రార్థించాడు. "ఓ స్వామీ! నీవెవరివో నేను తెలిసికొనగలను. నీవే సకల జీవులలో వుండు పరమాత్ముడవు. నీవు నీ నిజ స్వరూపంతో అవతరించితివి. దానిని నేను ప్రత్యక్షంగా దర్శించాను. కానీ కంసుని వలన నేను భయపడుతున్నాను." వసుదేవుని ప్రార్థనల అనంతరం దేవకి కృష్ణుని స్తుతించి తనను ఉగ్రసేన పుత్రుడగు కంసుని బారినుండి రక్షింపుమని ప్రార్థించింది.

**దేవకి – వసుదేవులు ఎవరు!**

దేవకి ప్రార్థనలను విని స్వామి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "అమ్మా! పూర్వం స్వాయంభువ మన్వంతరంలో నా తండ్రి వసుదేవుడు ప్రజాపతులలో ఒకడు. అతని పేరు "సుతపుడు", నీవు అతని భార్యవు. నీ పేరు పృశ్ని. బ్రహ్మదేవుడి ఆజ్ఞమేరకు మీరు సంతానాన్ని పొందగోరి దేవమానం ప్రకారం 12,000 సం॥ ఇంద్రియాలను నిగ్రహించి ఘోరమగు తపస్సు చేశారు.

ఆ సమయంలో మీ మనస్సు నాయందు లగ్నమై వుండడంవల్ల మీరు పవిత్రులయ్యారు. మీరు నన్ను మీ పుత్రునిగా జన్మించాలని కోరారు. ఆ అవతారంలో నేను పృశ్నిగర్భుడు అనే పేరుతో మీకు పుత్రుడిగా జన్మించాను.

ఆ తర్వాత మన్వంతరమున మీరు అదితి కశ్యపులుగా జన్మించారు. నేను మీకు ఉపేంద్రుడను పేరుతో వామనరూపం ధరించాను. మూడవసారి దేవకీ వసుదేవులనబడు మీకు కృష్ణుడిగా జన్మించాను. నా ప్రియమైన జననీజనకులారా! మీరు నన్ను పెక్కుసార్లు కని ఎంతో ప్రేమతో పెంచినారు. మీ కర్తవ్యం పూర్తి అయింది, కనుక మీరు ఈ జన్మలోనే నా సన్నిధిని చేరుకుంటారు. మీరు నా విషయమై చాలా ఆందోళన పడుతున్నారు. నన్ను ఇప్పుడే గోకులానికి తీసుకుని వెళ్లి అక్కడ యశోదకు ఇప్పుడే పుట్టిన యోగమాయను ఇక్కడకు తీసికొని రండి!"

శ్రీకృష్ణుడు ఈ విధంగా తన తల్లిదండ్రులకు తెలిపి వెంటనే సామాన్యశిశువు వలె మారిపోయాడు. శ్రీమద్భాగవతంలో కుంతీదేవి స్వామి అవతరణం గూర్చి ఈ విధంగా పలికింది.

**జన్మ కర్మ చ విశ్వాత్మ న్నజ స్యాకర్తు రాత్మనః ।**
**తిర్యఙ్ నృషు యాదస్సు తదత్యన్తవిడంబనమ్ ॥**

**శ్రీమద్భాగవతము (శ్లో.01-08-30)**

ఓ విశ్వాత్మా! నీవు అకర్ముడవైనా కర్మ చేయుట, పరమాత్ముడవు అజుడవైనా పుట్టుట అన్నవి పరమ ఆశ్చర్యకరంగా ఉన్నవి. జంతువులు, నరులు, ఋషులు, జలచరరూపాలలో నీవు స్వయంగా అవతరిస్తుంటావు. ఇది నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది.

**అపరే వసుదేవస్య దేవక్యాం యాచితోఽ భ్యగాత్ ।**
**అజస్త్వమస్య క్షేమాయ వధాయ చ సురద్విషామ్ ॥**

**శ్రీమద్భాగవతము (శ్లో.01-08-33)**

దేవకీ, వసుదేవులు నిన్ను ప్రార్థించినందున నీవు వారి పుత్రునిగా జన్మించావని కొందరు పలుకుతారు. నీవు నిస్సందేహంగా జన్మరహితుడవే అయినా భక్తులైన వారి క్షేమం కోసం, సురద్వేషులను సంహరించేందుకు జన్మిస్తుంటావు.

వసుదేవుడు స్వామి ఆజ్ఞమేరకు తన కుమారుణ్ణి తీసుకుని బయలు దేరాడు. ద్వారపాలకులు గాఢనిద్రలో ఉన్నారు. ఇనుపసంకెళ్ళు బిగించిన తలుపులు వాటంతట అవే తెరచుకొన్నాయి. వసుదేవుడు ఆ చిన్న బిడ్డను తీసుకుని యమునానది తీరం చేరాడు. ఆకాశం ఉరుమసాగింది. ధారాపాతంగా వర్షం కురుస్తున్నది. ఆదిశేషుడు తన పడగతో కృష్ణుడికి గొడుగు పట్టాడు. యమునానది వసుదేవునికి దారిచ్చింది. వసుదేవుడు సులభంగా యమునా నదిని దాటి గోకులంలో ఉన్న నందమహారాజు భవనం చేరాడు. అక్కడ అందరూ గాఢనిద్రలో ఉన్నారు. అదను చూచుకుని నిశ్శబ్దంగా యశోద గృహంలో ప్రవేశించి తన కుమారుణ్ణి అక్కడ ఉంచి, యశోదకు అప్పుడే జన్మించిన బాలికను తీసికొని వెనుతిరిగాడు. తిరిగి మథురకు వచ్చి ఆ ఆడబిడ్డను దేవకి ఒడిలో వుంచాడు. జరిగిన ఈ సంఘటనలన్నీ కంసునికి తెలియకుండుటకై అతడు ఇనుప సంకెళ్ళను తిరిగి తన చేతులకు తగిలించుకొన్నాడు.

ద్వారపాలకులు  శిశువు అరుపులకు నిద్రలేచి ఆ వార్త కంసునికి చెప్పారు. కంసుడు వెంటనే శిశువు జన్మించిన స్థలానికి బయలుదేరాడు. కంసుని చూచి దేవకి భయపడి ఈ విధంగా ప్రార్థించింది. "ప్రియసోదరా! జన్మించింది ఆడబిడ్డ. నీకు మగబిడ్డవల్ల కదా ప్రాణభయం. ఈ ఆడబిడ్డను చంపవద్దు. ఈ బిడ్డ నీ కుమారునికి భార్య కాగలదు. దయచేసి ఈ పసిపాపను వధించవద్దు. నా కుమార్తెగా ఈమెను బ్రతకనివ్వు".

కంసుడు చాలా క్రూరుడగుటవలన దేవకీ దీనప్రార్థనలను వినిపించుకోలేదు. ఆ శిశువును ఆమెనుండి బలవంతంగా లాగుకొని రాతిపై

విసిరికొట్టాడు. కానీ ఆ శిశువు వెంటనే ఆకాశమునకు ఎగిరి అష్టబాహువులతో ప్రత్యక్షమైంది. ఆ దేవి కంసునితో ఇలా అంది. "ఓరీ దుర్మార్గుడా! నీవు నన్నెట్లు చంపగలవు? నిన్ను చంపే శిశువు నాకన్న ముందుగానే ఈ ప్రపంచంలో జన్మించాడు. దీనురాలగు నీ సోదరి ఎడ నీవు కఠినంగా ప్రవర్తించవద్దు." ఈ విధంగా పలికిన పిమ్మట ఆమె అదృశ్యమైంది. శ్రీకృష్ణుని చెల్లెలుగా ఆమె ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో వివిధ నామాలతో దుర్గ, చండి, భద్రకాళిగా విఖ్యాతి పొందింది.

ఈ మాటలు విన్న తరువాత కంసుడు భయపడ్డాడు. వెంటనే వసుదేవుని, దేవకిని జైలునుంచి విడుదల చేశాడు.

కంసుని సలహాదారులు దేవతలకు బద్ధశత్రువులగు రాక్షసులు. వారు కంసునికి ఇలా బోధ చేశారు. "మహారాజా! గడిచిన పది దినాలలో వివిధ పట్టణాలలోను, మండలాలలోను, గ్రామాలలోను జన్మించిన పసిపిల్లలనందరిని చంపేందుకు ఏర్పాట్లు చేయండి."

గోకులంలో నందమహారాజు పుత్రునియొక్క పుట్టినరోజు పండుగకు ఏర్పాట్లు చేస్తున్నాడు. యశోదకు మగబిడ్డ పుట్టినాడనే వార్త తెలిసిన యాదవులు ఆనందపరవశులయ్యారు. గోపికలు అందరూ పలు రకాల కానుకలు చేతబట్టి నందమహారాజు భవనానికి చేరారు. నందమహారాజు ఎంతో ఆనందంతో వస్త్రాభరణాలతో అలంకరించిన రెండు లక్షల గోవులను బ్రాహ్మణులకు దానమిచ్చాడు. ఆతడు ఆవులనే గాక, ధాన్యరాశులను, బంగారు జరీ అంచులుగల వస్త్రములను, పెక్కు ఆభరణములను కూడ దానమిచ్చాడు. బ్రాహ్మణులకు దానం చేయడంవల్ల క్రొత్తగా పుట్టిన శిశువు పవిత్రుడగును. బృందావనవాసులు కేవలం గోపోషణంలోనే ఇంతటి ఐశ్వర్యాన్ని ఆర్జించారనే విషయం మనం గుర్తించాలి.

కృష్ణజన్మోత్సవం తరువాత నందమహారాజు కంసుని ప్రభుత్వానికి పన్ను చెల్లించేందుకు మథురా నగరానికి వెళ్లాడు. అచ్చట తన మిత్రుడగు

వసుదేవుని కలిసికొన్నాడు. వసుదేవుడు ఎంతో ఆత్రుతతో కృష్ణ, బలరాముల యోగక్షేమాలను గూర్చి ప్రశ్నించాడు. కృష్ణ బలరాములు ఇరువురు కూడా వసుదేవుని కుమారులు. నందమహారాజు రక్షణలో వున్న వసుదేవుని భార్యయగు రోహిణి గర్భానికి బలరాముడు మార్చబడ్డాడు. యశోద కుమార్తె స్థానంలో కృష్ణుడు చేర్చబడ్డాడు. బలరాముడు వసుదేవుని కుమారుడు అని నందమహారాజుకు తెలిసినా, కృష్ణుడు కూడ వసుదేవుని కుమారుడే అని తెలియదు. దేవకికి జన్మించిన పుత్రులను రక్షించుకోలేక పోయినందులకు వసుదేవుడు విచారించాడు.

వసుదేవుడు నందమహారాజును ఇలా హెచ్చరించాడు. "మిత్రమా! నందా! ప్రభుత్వపు పన్నులు త్వరగా చెల్లించి వెంటనే మరలిపో. అక్కడ గోకులంలో ఏదో కలవరం ఏర్పడినట్లు నాకు తోస్తున్నది."

*నందనందనా గోవిందా! వసుదేవ తనయా గోవిందా!*

## 2. పాలుతాపిన పుణ్య వనిత

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్!**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!! (భగవద్గీత4.8)**

సాధువులను రక్షించడం, దుర్మార్గులను శిక్షించడం తన కార్యమని, ఆ కార్యార్థమే తాను యుగయుగాలలో అవతరిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీత అధ్యాయము 4, శ్లోకం 8లో చెప్పాడు.

కృష్ణుడు ఎప్పుడు వచ్చి తనను చంపుతాడోనని కంసుడికి రోజు రోజుకీ భయం ఎక్కువైంది. తన మంత్రులతో సంప్రదించాడు. పూతన అనే రాక్షసిని పిలిపించాడు. చుట్టు ప్రక్కల గ్రామాలలో వున్న పిల్లలను చంపమని ఆజ్ఞాపించాడు. ఆమెకు ఆకాశంలో ఎగిరే "ఖేచరి" విద్య తెలుసు. పిల్లలను ఘోరమైన పద్ధతుల ద్వారా చంపడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య.

నందుడు కంసునికి పన్ను కట్టడానికి మథురకు వెళ్లాడు. యశోదమ్మ చిన్నికృష్ణున్ని ఊయలలో పడుకోబెట్టింది. తాను ఇంటి పనిలో నిమగ్నమైంది. ఇంతలో ఒక అందమైన స్త్రీ నందుని ఇంటిలో ప్రవేశించింది. ఆమె అందచందాలకు అందరూ ఆకర్షితులయ్యారు. సాక్షాత్తు లక్ష్మీదేవియే గోకులంలో అడుగుపెట్టిందని గోపవనితలు భావించారు.

ఆమెను ఎవ్వరూ అడ్డగించలేకపోయారు. యశోదమ్మ, రోహిణి కూడా ఆమె అందచందాలను చూస్తూ నిల్చుండిపోయారు. ఆమె నేరుగా చిన్నపిల్లవాడి దగ్గరికి వెళ్లింది. ఆ బాలుణ్ణి ఎత్తుకుంది. చిన్నికృష్ణుడు కళ్లుమూసుకున్నాడు. ఎందుకంటే తాను మొట్ట మొదట స్త్రీరాక్షసిని చంపవలసి వచ్చినందుకు. వేదాల ప్రకారం స్త్రీని, బాలుని, బ్రాహ్మణుని, గోవులను చంపకూడదు. అయినా ఇపుడు పూతనను చంపవలసిన పరిస్థితి ఏర్పడింది. పూతనకు శ్రీకృష్ణుడు తల్లిస్థానం ఇచ్చాడు. కనుక కళ్లు మూసికొన్నాడని మరికొందరి వివరణం. మనిషికి ఏడుగురు తల్లులు

ఉన్నారని వేదాలు చెబుతున్నాయి. కన్న తల్లి, గురువు భార్య, రాజు భార్య, బ్రాహ్మణుని భార్య, గోవు, దాది, భూదేవి.

ఆ స్త్రీ చిన్ని కృష్ణుణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుంది. బిడ్డకు పాలివ్వసాగింది. ఆమె తన రొమ్ములకు విషం పూసుకుని వచ్చింది. పాలతోపాటు విషాన్ని త్రాగించి బాలుణ్ణి చంపాలని ఆమె పన్నాగం. చిన్ని కృష్ణుడు ఆమెపాలు త్రాగుతున్నట్లు నటిస్తూ ఆమె ప్రాణాలను కూడా లాగేశాడు. దానితో ఆమెకు తీవ్రమైన బాధ కల్గింది. "నన్ను వదిలిపెట్టు, పాలుత్రాగకు, నన్నువదులు" అని గట్టిగా అరుస్తూ బయటకు పరుగుదీసింది. చెమటలు కారసాగాయి. కాళ్ళు, చేతులు కొట్టుకోసాగాయి. ఆ రాక్షసి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రాణంపోగానే దాని నిజరూపం బయటపడింది. పెద్ద ఆకారంతో నేలపై పడింది. పన్నెండు మైళ్ళ దూరం వరకు వున్న చెట్లన్నీ ఆమె శరీరం క్రిందపడి నలిగిపోయాయి. అమ్మో! ఎంత పెద్ద రాక్షసి అనుకున్నారు వ్రజవాసులందరూ.

ఆ రక్కసి నోరు పెద్దగా వుంది. దాని నాసికారంధ్రాలు కొండగుహల లాగా వున్నాయి. దాని రొమ్ములు పెద్ద పెద్ద రాళ్ళవలె వున్నాయి. దాని పొట్ట ఎండిన చెరువువలె వుంది. అమ్మో! ఎంత పెద్ద రాక్షసి! అంత భయంకరమైన రూపంమీద బాలకృష్ణుడు ఆడుకుంటూ కనిపించాడు. గోపికలు ఆనందంతో పరుగెత్తుకుంటూ వచ్చి కన్నయ్యను ఎత్తుకున్నారు. రక్షణకోసం ఆవుతోకతో చుట్టూ తిప్పారు. భగవంతుని వివిధ నామాలను ఉచ్చరించారు. "హృషీకేశుడు నీ ఇంద్రియాలను, నారాయణుడు నీ ప్రాణాలను, శ్వేతద్వీపపతి నీ కోరికను, యోగేశ్వరుడు నీ మనస్సును రక్షించుగాక" అంటూ సమస్త రక్షణను తమ బాలునికి కల్పించారు. యశోద పిల్లవాడికి పాలిచ్చి పడుకోబెట్టింది. ఇంతలో మథుర నుండి గోకులానికి వస్తున్న నందుడు మిగిలినవారు ఆ మృత శరీరాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆ పూతన శరీరాన్ని గొడ్డళ్ళతో ముక్కలు ముక్కలుగా నరికి దగ్ధం చేశారు.

శ్రీకృష్ణుడు పాలుత్రాగడం వలన పూతన పవిత్రురాలైంది. ఆమె పాపరాశి పూర్తిగా నశించింది. ఆమె శరీరం నుంచి మంచి సుగంధం వాసన వెలువడింది. పూతనకు కృష్ణుడు గోలోక బృందావనంలో తల్లి స్థానం ఇచ్చాడు.

కృష్ణుణ్ణి చంపడానికి వచ్చిన ఆమెకే ఇంత దివ్యవరం లభిస్తే!, ఇక అత్యంత ప్రేమను చూపే యశోద గోపికలకు కల్గే భాగ్యం ఏమని వర్ణించగలం!

**అన్నమాచార్యుని కీర్తన**

**ఈతడే హరుడు**

ప. **ఈతడే హరుడు యీతడే యజుడు**
**ఈతనికి నీ చేతలెంత ఘనమటుగాన ॥**

చ. **కడు పెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన**
**కడుపులో నిడుకొన్నఘనుడు.**
**వెడలి పూతన చంటి విషము తాగిన యంత**
**వడిఁదనకు నేమాయ వట్టిబూమెలుగాక ॥**

**భావం :** ఈ కృష్ణుడే శివుడు, ఈతడే బ్రహ్మ. ఇతనికి సృష్టి, సంహారం మున్నగు పనులు ఏమంత కష్టమైనవి?

అనేకములైన బ్రహ్మాండాలనే కటకాలు కదానితో ఒకటి ముడివడియుండగా వాటిని తన కడుపులో నిల్పుకొన్న ఘనుడు ఈ కృష్ణుడు. ఇతడు పూతన అనే రాక్షసి స్తనాలలోని విషం త్రాగినంత మాత్రాన ఏమైనది? ఇవన్నీ వట్టి మాయలే కదా!

తనకు అమ్మలాగ పాలిచ్చి ప్రేమగా నటించింది కాబట్టి పూతనకు శ్రీకృష్ణుడు తల్లిస్థానం (మాతృత్వము) ఇచ్చాడు. ఈ విషయమును ఉద్ధవుడు శ్రీమద్భాగవతంలో –

“అహో! విశ్వాసహీనురాలై తన స్తనంనుంచి భయంకరవిషాన్ని త్రాగించేందుకు సిద్ధపడినప్పటికీ (పూతనకు) తల్లి స్థానం ఎవరు ఇచ్చారో అట్టివానికి మించిన దయాపూర్ణుడు వేరొక్కని నేనెట్లు ఆశ్రయించేది?” అని వర్ణించాడు.

**ఎవరు ఈ పూతన!**

“గర్గసంహిత’ ప్రకారం పూతన పూర్వజన్మలో బలిచక్రవర్తి కూతురు. పేరు ‘రత్నమాల’. బాలుడైన వామనమూర్తిగా విష్ణువు, బలిచక్రవర్తి నర్మదానదీతీరంలో చేస్తున్న అశ్వమేధ యజ్ఞశాలకు దానమడగడానికి రాగా, ఆ బాలుని రూపురేఖలను చూచి రత్నమాల, ఆ బాలునివంటి కుమారుడు తనకు కల్గితే బాగుంటుంది కదా అని మాతృత్వకాంక్షతో భావించింది. అంతేకాదు, మాతృవాత్సల్య భావన పొంగి పొరలగా, తల్లిగా తన స్తనద్వయాన్నిచ్చి ఆ బాలుని పోషించాలని ఆశపడింది.

ఇదిలా ఉండగా వెంటనే, ఆ యజ్ఞశాలలో సన్నివేశం మారింది. వామనమూర్తి త్రివిక్రముడై బలిచక్రవర్తి శిరస్సుపై పాదాన్ని మోపి పాతాళానికి తొక్కి వేస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూచిన రత్నమాల కోపంతో వెంటనే ఆ దుష్టాత్ముని సంహరించాలని పగబట్టింది. ఇది ‘మాతృత్వభావన’కు విరుద్ధమైన ‘రాక్షస భావన’.

భగవంతుడైన వామనమూర్తి ఆమెలో కల్గిన పరస్పరవిరుద్ధాలైన రెండు భావాలను గుర్తించాడు. ‘తథాస్తు’ అని ఆశీర్వదించాడు.

ఈ విధంగా విరుద్ధ భావాలను గల్గిన రత్నమాల మరుజన్మలో ద్వాపరయుగంలో ‘పూతన’గా పుట్టింది. పసిబిడ్డకు పాలివ్వడానికి ‘దాది’ వలె వచ్చి, తన ‘కసి’ని తీర్చుకోవాలనుకుంది. పాలు విషపూరితం చేసుకొని

వచ్చిన పూతన కైంకర్యాన్ని స్వామి తోసివేయలేదు. ఆ విషపుపాలు త్రాగుతూనే ఆమె పంచప్రాణాలను లాగివేశాడు. పూతనకోరిక సంపూర్ణంగా నెరవేరలేదు. కాని, భగవంతుడు ఆమె తనకు చేసిన చిన్న సేవను స్వీకరించాడు. ఫలితంగా ఆమెకు గొప్ప తల్లి స్థానాన్ని అనుగ్రహించాడు.

***పూతన సంహార గోవిందా!***

## 3. శకటాసుర వధ

వైదిక నాగరికతలో శిశుజన్మంగాని, గర్భధారణంగాని భారంగా భావింపబడలేదు. పైగా వాటికి కొన్ని సంస్కారాలు ఏర్పాటుచేయబడ్డాయి. అవే గర్భధారణ సంస్కారం, సీమంతం, శిశుజననం తర్వాత నామకరణ మహోత్సవం, తలనీలాలు సమర్పించుట, చెవులు కుట్టుట, ఉపనయనం మొదలగునవి. కానీ దీనికి విరుద్ధంగా నేటి కలియుగ జనులు గర్భధారణకు లేదా శిశుజన్మకు ఇష్టపడడంలేదు. వారు భ్రూణహత్యకైనను వెనుకాడడం లేదు.

నెలలు రోజులుగా గడిచిపోతున్నాయి. చిన్ని కన్నయ్య పుట్టి అప్పుడే మూడు నెలలు గడచిపోయాయి. బాలుడు మొదటిసారి ప్రక్కకు తిరిగాడు. యశోదమ్మ ఆనందంతో పండుగ జరుపుకోవాలని అనుకున్నది. ఆ రోజు రోహిణీ నక్షత్రం. బ్రాహ్మణులు వేదమంత్రాలు చదువుతున్నారు. వాద్యకారులు సంగీత వాద్యాలను మ్రోగిస్తున్నారు. పండుగ సందడి ఆరంభమైంది. యశోదమ్మ కృష్ణునికి స్నానం చేయించింది. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు చక్కగా అలంకరించింది. ఇంతలో కన్నయ్యకు కళ్లుమూతలు పడ్డాయి. యశోదమ్మ అక్కడే వున్న బండికి ఉయ్యాల కట్టింది. అందులో పిల్లవాణ్ణి పడుకోబెట్టింది. తను ఉత్సవానికి వచ్చిన బంధుమిత్రులను పలకరించడంలో మునిగిపోయింది. కొద్దిసమయం గడిచిన తర్వాత కన్నయ్య ఏడవడం మొదలుపెట్టాడు. ఆ ఏడుపు యశోదమ్మకు వినబడలేదు. ఇంతలో కంసుడు పంపిన ఒక రాక్షసుడు వచ్చాడు. అతని పేరు శకటుడు. ఒక దయ్యం. దయ్యానికి ఏదో ఒక ఆశ్రయం కావాలి కదా! అందుకే శకటాసురుడు బండిని ఆశ్రయించి ఉన్నాడు. అతను కృష్ణుడికి తప్ప ఇంకెవ్వరికీ కనబడడం లేదు. అతను ఆ బాలుణ్ణి చంపాలని అనుకున్నాడు. అతను అటూ ఇటూ చూశాడు. అందరూ ఎవరి పనుల్లో వారు ఉన్నారు. ఆ రాక్షసుడు ఇదే సరైన సమయం అనుకున్నాడు. కన్నయ్య ఆ రాక్షసుడ్ని చూసి నవ్వుకున్నాడు. కన్నయ్య చిన్ని పాదాలు లేత ఆకులవలె అతిమెత్తగా ఉంటాయి. తన కాలిబొటనవ్రేలితో బండిని తన్నాడు. అది తలక్రిందులై

విరిగిపడింది. పెద్ద శబ్ధం వచ్చింది. దయ్యం వెంటనే నేలపై పడింది. బండి చక్రాలు ఇరుసునుంచి ఊడిపోయాయి. సామాన్లు అన్నీ చెల్లా చెదురైపోయినాయి. అందరూ అచ్చటికి పరుగెత్తుకుని వచ్చారు. యశోదమ్మ భయపడి గబగబా పిల్లవాణ్ణి ఎత్తుకుంది. బండి విరిగిపడినపుడు ఆ శబ్దానికి సాధారణంగా దెబ్బలు తగులుతాయి. పిల్లలు ఏడుస్తారు. కానీ శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడు కనుక అతనికి చిన్న దెబ్బకూడ తగలలేదు. పైగా సంతోషంగా నవ్వుతున్నాడు. అతడేది చేసినా దివ్యానంద పూర్ణమై ఉంటుంది. అందరూ ఆశ్చర్యపోయారు. ఇదేమైనా రాక్షస మాయయా! అసలు బండి ఎలా విరిగింది! ఆశ్చర్యం! ఎవ్వరికీ అర్థం కావడంలేదు. కానీ అక్కడ ఆడుకుంటున్న పిల్లలు చెప్పారు. కన్నయ్య బండిని తన్నాడు అని. కానీ అవి పిల్లల మాటలు అని ఎవరూ పట్టించుకోలేదు. పిల్లవాడిని గురించి గ్రహశాంతికోసం బ్రాహ్మణులు హోమం చేశారు. నందుడు బ్రాహ్మణులకు బంగారు ఆభరణాలతో, వస్త్రములతో, పూమాలతో అలంకరింపబడిన మంచి ఆవులను దానమిచ్చాడు. దానాలు స్వీకరించి బ్రాహ్మణులు బాలుడ్ని దీవించారు.

**శకటాసురుడికి శాపం**

శకటాసురుడు పూర్వజన్మలో హిరణ్యాక్షుడి కొడుకు, రాక్షసుడు. అతని పేరు ఉత్కచ. ఇతని శరీరం గాలితో తయారు చేయబడింది. ఇతను ఒకసారి లోమసముని ఆశ్రమంలో చెట్లను విరిచి వేస్తున్నాడు. ముని అందుకు కోపించి నీకు శరీరం లేకుండుగాక! అని శపించాడు. వెంటనే అతను దయ్యంగా మారిపోయాడు.

రాక్షసుడు ముని పాదాలపై పడి క్షమించమని వేడుకొన్నాడు. “కృష్ణునియొక్క పాదస్పర్శ ద్వారా నీవు ముక్తిని పొందగలవు” అని ముని ఆశీర్వదించాడు. ఆ రాక్షసుడు శరీరం లేకుండా వైవస్వత మన్వంతరం వరకు వేచి ఉన్నాడు. తరువాత కృష్ణునియొక్క పాద స్పర్శ ద్వారా మోక్షాన్ని పొందాడు.

*శకట సంహార గోవిందా!*

## 4. తృణావర్త - వత్సాసుర సంహారం

కృష్ణుడు బాలుడి రూపంలో అందరినీ ఆనందింపజేస్తున్నాడు. రోజులు, నెలలు గడిచాయి. ఒక్క సంవత్సరకాలం గడిచింది. ఒకరోజు యశోదమ్మ కన్నయ్యను తన ఒడిలో కూర్చోబెట్టుకుని ప్రేమతో లాలిస్తోంది. అతని అందమైన ముఖాన్ని మరలా మరలా చూస్తున్నది. ఇంతలో పిల్లవాడు బరువు పెరిగినట్లైంది. పెరుగుతున్నాడు, పెరుగుతున్నాడు. యశోదమ్మ ఆ పిల్లవాడ్ని మోయలేక క్రింద కూర్చోబెట్టింది. భయంతో నారాయణ స్మరణ చేస్తూ ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఇంతలో ఒక పెద్ద సుడిగాలి వచ్చింది. దుమ్ము, ధూళి వల్ల ఏమీ కనిపించడం లేదు. యశోదమ్మకు భయంవేసి పరుగెత్తుకొచ్చింది. చూస్తే పిల్లవాడు అక్కడ లేడు! ఆమె అతి దీనంగా ఏడవసాగింది. కంసుడి అనుచరుడైన తృణావర్తుడనే రాక్షసుడు సుడిగాలి రూపంలో వచ్చాడు. కన్నయ్యను అవలీలగా ఆకాశంలోకి ఎత్తుకుపోయాడు. కొంతసేపటికి కన్నయ్య తిరిగి బరువెక్కాడు. రాక్షసుని వేగం తగ్గింది. ఎగరలేకపోయాడు. ఆశ్చర్యం. చిన్నికృష్ణుడు మహాపర్వతంలాగా ఉన్నాడు. మోయలేక విడిచిపెట్టేద్దాం అనుకున్నాడు రాక్షసుడు. బాలుడు రాక్షసుడి గొంతు గట్టిగా పట్టుకుని ఉన్నాడు. రాక్షసుడు విడిపించుకోలేక పోతున్నాడు. బాలకృష్ణుడు సామాన్యబాలుడు కాడని తెలుసుకున్నాడు. రాక్షసులు యోగసిద్ధులను కొంతవరకే ప్రదర్శించగలరు. కానీ, కన్నయ్య యోగీశ్వరుడు. యోగసిద్ధులను సమగ్రంగా సంపూర్ణంగా ప్రదర్శించగలడు. ఇక్కడ భగవంతుడు మహిమా సిద్ధిని ప్రదర్శించాడు. ఆ రాక్షసుడు ఆ బరువు మోయలేక క్రిందికి పడిపోతున్నాడు. కానీ కృష్ణుని పట్టునుండి విడిపించుకోవడం సాధ్యపడలేదు. తృణావర్తుడికి భయంవేసింది. గొంతు పెగలలేదు. కాళ్ళు, చేతులు కదిలించలేకపోయాడు. కళ్ళు ఉబ్బిపోయాయి. ప్రాణాలను కోల్పోయి నేలమీద పడ్డాడు. బాలుడు మాత్రం ఆ రాక్షసుని శరీరంపై ఆడుకుంటూ కనిపించాడు. గోపికలు పిల్లవాడ్ని ఎత్తుకుని

యశోదమ్మకు ఇచ్చారు. కృష్ణుడు క్షేమంగా ఉండడం చూసి నందయశోదలు, గోకులవాసులు ఆనందించారు.

**ఇట్టిముద్దులాడి**

**ప. ఇట్టి ముద్దులాడి బాలు దేడవాడు వాని**
**పట్టితెచ్చి పొట్టనింద పాలువోయరే ॥**

**చ. గామిడై పారితెంచి కాగెడి వెన్నలలోన**
**చేమపూవు కడియాల చేయిపెట్టి**
**చీమ కుట్టెనని తన చెక్కిట కన్నీరు జార**
**వేమరువాపోవు వాని వెద్దు వెట్టరే ॥**

**చ. ముచ్చువలెవచ్చి తన ముంగమురువులుచేయి**
**తచ్చెడి పెరుగులోన తగబెట్టి**
**నొచ్చెనని చేయితీసి నోరనెల్లఁజొల్లుగార**
**వొచ్చెలి వాపోవువాని నూరడించరే ॥**

**చ. ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోని**
**చెప్పరాని వుంగరాల చేయిపెట్టి**
**అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన**
**తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే ॥**

**భావం :** ఇలాంటి ముద్దులొలికే పిల్లవాడు ఎక్కడివాడు? వాణ్ణి పట్టుకొని తీసుకువచ్చి కడుపు నిండేటట్లు పాలుబోయండి!

ధూర్తుడై వచ్చి ఈ బాలుడు పొయ్యిమీద కాగుతూ ఉండే వెన్నలలో చేమపూలతో చేసిన కడియాలు ధరించిన చేయిపెట్టాడు. వెంటనే చీమ కుట్టిందంటూ చెక్కిట కన్నీరు జారుతుండగా మాటిమాటికీ ఏడుస్తున్నాడు. వీణ్ణి బుజ్జగించండి!

దొంగలాగా సద్దుచేయకుండా మాయింటికి వచ్చాడు. కంకణం దాల్చిన ముంజేతిని కవ్వంతో చిలికే పెరుగులో పెట్టాడు. మరల నొప్పి పుట్టిందని చేయి వెలుపలికి తీసి నోట జొల్లు గారగా దుఃఖిస్తున్నాడు. ఓ చెలీ! వీణ్ణి ఓదార్చండి!

ఈ బాలుడు ఎప్పుడు వచ్చాడో కాని మా యింటిలో ప్రవేశించాడు. మాటలకందని (వర్ణింపవీలుగాని) ఉంగరాలు దాల్చిన చేయిని పెట్టెలో పెట్టినాడు. అందరికీ తండ్రియైన వేంకటాచలాధిపతి, శక్తిగలవాడు. కాబట్టి ఈ పెట్టెను తప్పక ఇతని తలమీదనే పెట్టండి!

## పూర్వజన్మ వృత్తాంతం

బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం తృణావర్తుడు అనే రాక్షసుడు ముందు జన్మలో పాండ్య దేశానికి రాజు. అతని పేరు సహస్రాక్షుడు. అతడు భగవంతుని భక్తుడు. ధర్మపరుడు. ఒకరోజు అతడు గంధమాదన పర్వతంలో ఉన్న నదిలో వెయ్యిమంది భార్యలతో కూడి జలకాలాడుతున్నాడు. వాళ్ల వస్త్రాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అప్పుడు దుర్వాసముని శిష్యసమేతంగా ఆ దారిలో ప్రయాణిస్తున్నాడు. మహర్షిని చూసినా కూడా మదోన్మత్తుడైన పాండ్యరాజు బయటికి రాలేదు. ప్రణామాలు అర్పించలేదు. కోపించిన దుర్వాసముని రాక్షసుడివి కమ్మని శపించాడు. రాజు వెంటనే మునిని శరణువేడాడు. దుర్వాసముని కరుణించి శ్రీకృష్ణుని స్పర్శించడంవల్ల ముక్తిని పొందుతావు అని చెప్పాడు. ఆ విధంగా అతను తృణావర్తుడను రాక్షసుడిగా మారాడు. చివరకు బాలకృష్ణుడి స్పర్శ ద్వారా ముక్తిని పొందాడు.

## వత్సాసుర వధ

ఒకరోజు కృష్ణబలరాములు గోవులను మేపుతూ యమునాతీరంలో తిరుగుతున్నారు. ఇదే మంచి సమయం అనుకుని ఒక రాక్షసుడు దూడ రూపాన్ని ధరించి మందలో కలిశాడు. అతడే వత్సాసురుడు. రాక్షసులు

కోరిన రూపాన్ని వారు ధరించగలరు. కృష్ణునికి దగ్గరగా వెళ్ళాలంటే దూడరూపంలోనే సాధ్యమని తలచి ఆ రాక్షసుడు ఆ పని చేశాడు. అయినా యోగీశ్వరుడైన శ్రీకృష్ణునికి అది వెంటనే అర్థమైంది. "అదిగో రాక్షసుడు, దూడ రూపంలో ఉన్నాడు" అని శ్రీకృష్ణుడు బలరామునికి చూపించాడు. వెంటనే శ్రీకృష్ణుడు ఆ దూడ వెనుక కాళ్ళను పట్టుకొని గాలిలో తిప్పడం మొదలుపెట్టాడు. గాలిలో చక్రం లాగా తిప్పడం వలన అసురుని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. శ్రీకృష్ణుడు వాడిని ఆ విధంగా త్రిప్పుతూనే వెలగచెట్టు పైకి విసిరివేశాడు. అపుడు ఆ రక్కసి అసలు రూపం బయటపడింది. వాడి బరువుకు చెట్టు నేలకూలింది. పిల్లలు ఆ దృశ్యం చూసి ఆనందంతో చప్పట్లుకొట్టారు. "కృష్ణా! బాగుంది, బాగుంది. మంచిపని చేశావు. నీక ధన్యవాదాలు" అని గోపబాలురు శ్రీకృష్ణుని పొగిడారు. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

*దుష్టసంహార గోవిందా! దురితనివారణ గోవిందా!*

## 5. గుప్పెడు గింజలకు గంపెడు రత్నాలా!

ఒకనాడు నందమహారాజు భవనానికి ఒక పండ్లు అమ్ముకొను స్త్రీ వచ్చింది. ఆమెకు చిన్ని కృష్ణుని దర్శించాలని అతనిని ఆలింగనం చేసుకోవాలని చిరకాల వాంఛ. ఆ రోజులలో వస్తువులు కొనాలంటే ఇంకొక వస్తువు ఇచ్చి కొనుక్కునేవారు. తన తల్లిదండ్రులు ధాన్యమిచ్చి వస్తువులు కొనుటను చూసిన చిన్ని కృష్ణుడు వారిని అనుకరించాడు. ఇంటిలోనుండి కొంత ధాన్యం తెచ్చి పండ్లు కొనాలని కృష్ణుడు అనుకున్నాడు. అప్పుడు కన్నయ్య తన చిన్ని దోసిలితో ధాన్యపు గింజలను తీసుకొని ఇంటి బయటకు వచ్చాడు. కాని పండ్లమ్ముకునే స్త్రీ వద్దకు బుడి బుడి నడకతో వచ్చేసరికి చిన్ని దోసిట్లో నుండి గింజలు చాలావరకూ క్రిందకు జారిపోయాయి. చివరకు కొన్నిగింజలు మాత్రమే చేతిలో మిగిలాయి. అయితే పండ్లమ్ముకునే స్త్రీ చిన్ని కృష్ణుని సౌందర్యానికి ముగ్ధురాలై, అతని చేతిలోని గింజలను చూసి "ఓ చిన్ని కృష్ణా! ఈ పండ్లు కొనేందుకు నీ వద్దనున్న గింజలు చాలవు. కాబట్టి నువ్వు నా ఒడిలో కూర్చొని, నన్ను ఆలింగనం చేసుకొని, నన్ను 'అమ్మా!' అని ఒక్కసారి పిలువు. అప్పుడు నీకు ఈ పండ్లన్నీ ఊరికినే ఇచ్చేస్తాను" అంది. అప్పుడు కన్నయ్య అటూఇటూ చూసి యశోదామాతలేదని తెలుసుకొని, వెంటనే ఆ స్త్రీ ఒడిలో కూర్చొని ఆమెను ఆలింగనం చేసుకొని 'అమ్మా' అని పిలిచాడు. ఆమె ఆనందానికి అంతులేకుండా పోయింది. సంతోషంతో తన గంపలోని పండ్లన్నింటినీ కృష్ణునికి ఇచ్చేసింది. ఆ తరువాత తిరిగి చూడగా ఆమె గంపంతా రత్నాలతో, మణులు, మాణిక్యాలతో నిండి ఉంది. చూశారా! శ్రీకృష్ణుడు సకలాభీష్టప్రదాత. ఎవరైనా భగవంతునికి ఏమైనా భక్తితో, ప్రేమతో సమర్పిస్తే వారు తిరిగి ఎన్నోరెట్లు లాభం పొందుతారు.

ఆ చిన్ని కృష్ణుని అందచందాలను అన్నమయ్య తన కీర్తనలో ఎంత అందంగా వర్ణించాడో చూద్దాం!

## చిన్ని శిశువు

ప. చిన్ని శిశువు చిన్ని శిశువు
ఎన్నడు చూడమమ్మ ఇటువంటి శిశువు ॥

చ. తోయంపు కురులతోడ తూగేటిశిరసు, చింత
కాయలవంటి జడల గములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పాయక యశోద వెంట పారాడు శిశువు

చ. ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపు చేతుల పైడి బొద్దుల తోడ
అద్దపు చెక్కులతోడ అప్పలప్పలనినంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువు ॥

చ. బలుపైన పొట్టమీది పాలచారలతోడ
నులివేడి వెన్నతిన్న నోరితోడ
చెలగి నేడిదే వచ్చి శ్రీ వేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువు ॥

**భావం :** ఇతడు చిన్న శిశువు. ఎప్పుడూ ఇట్టి శిశువును చూచినది లేదు.

అందమై దట్టమైన వెంట్రుకలతో తూగే శిరస్సు, చింతకాయలను బోలిన జడలు, శబ్దంచేసే బంగారు మువ్వలుగల పాదాలుగలవాడై ఈ శిశువు విడువకుండా యశోదవెనుక తిరుగుతున్నాడు.

ముద్దుగొలిపే వ్రేళ్ళు, వంకలు దిరిగిన ఉంగరాలు, అందమైన చేతులపై బంగారు ఆభరణాలు అద్దములవంటి చెక్కిళ్ళు కలిగినవాడై, 'అప్పలూ', 'అప్పలూ' అనగానే ఈ శిశువు యశోద శరీరాన్ని కౌగిలించుకొంటున్నాడు.

పెద్ద పొట్టమీద పాలచారలున్నవి. అప్పుడే తీసిన నులివెచ్చని వెన్న తిన్న నోరు గలవాడు. ఇట్టి వీడు ఇపుడు ఈ వెంకటాచలంపై నిల్చి లోకాలను భరిస్తున్నాడు.

*కృపాసాగరా గోవిందా!*

## నవనీత చోరుడు

చిన్నారులారా! చిన్ని కృష్ణుడిని 'వెన్నదొంగ' అని కూడా పిలుస్తారు. ఎందుకో తెలుసా! బృందావనం లోని ప్రతి ఇంటిలోను తన మిత్రులతో కలిసి దొంగతనంగా ప్రవేశించి వెన్న దొంగిలించి, కడుపారా ఆరగించి మిగిలినది కోతులకిచ్చేవాడు. ఒకవేళ వెన్న దొరకకపోతే ఇంట్లోని వస్తువులను చిందరవందర చేయడమో లేక పసిపాపలను గిల్లి ఏడిపించడమో చేసేవాడు. ఒకసారి కృష్ణుడి ఆట కట్టించేందుకు గోపికలు ఒక పథకం పన్ని కృష్ణుడు వస్తే తెలుసుకోవడానికి వీలుగా ఇళ్ళ తలుపులకు, కిటికీలకు గంటలుకట్టారు. ఇది గమనించిన కృష్ణుడు ఆ గంటలతో "బుల్లి గంటల్లారా! దేవదేవుడైన కృష్ణుడు చెప్పుతున్నాడు వినండి! నేను దొంగతనం పూర్తిచేసుకుని బయటకొచ్చేవరకు మీరు చిన్న చప్పుడు కూడా చేయరాదు'' అని ఆదేశించాడు. గంటలు "అలాగే" అన్నాయి. కృష్ణుడు యథావిధిగా ఇంటిలోకి ప్రవేశించి వెన్నను తినబోతుండగా గంటలన్నీ ఒక్కసారిగా మ్రోగినాయి. కృష్ణుడు "గంటలారా! నా ఆజ్ఞను ధిక్కరిస్తున్నారేమి?" అన్నాడు. గంటలు "స్వామి! శాస్త్రముల నిచ్చిన వాడవు నీవే. నీవు ఆహారం స్వీకరించునపుడు గంటలు మ్రోగవలెననునది శాస్త్రనియమం. కావున మ్రోగితిమి" అన్నవి.

ఆ శబ్దం విన్న గోపికలు కృష్ణుడిని బంధించాలని పరుగు పరుగున వచ్చారు. కృష్ణుడు మిత్రులతో కలిసి కిటికీనుంచి బయటకు దూకి తప్పించుకున్నాడు. కాని మధుమంగళ అను మిత్రుడు చాలా లావుగా ఉండడం చేత పరుగెత్తలేక గోపికల చేతికి చిక్కాడు. గోపికలు అతన్ని

బంధించి కొట్టసాగారు. మిత్రుణ్ణి ఎలా రక్షించాలని ఆలోచిస్తూ కృష్ణుడు పరుగున వచ్చి "ఆపండి! బ్రాహ్మణుడిని శిక్షిస్తే మీరు, మీ పరివారం అందరూ నరకం అనుభవిస్తారు" అని గట్టిగా అరిచాడు. అదివిన్న గోపికలు మధుమంగళను విడిచిపెట్టారు. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం ఏమని అడిగారు. అపుడు కృష్ణుడు "ఈ బ్రాహ్మణ బాలుడికి బాగా ఇష్టమైన లడ్డులను ఇస్తే చాలు" అన్నాడు. గోపికలు తమ ఇళ్ళలో ఉన్న తీపి తిను బండారాలన్నింటిని తెచ్చి కృష్ణుడికి, ఆయన మిత్రులందరికి పంచిపెట్టారు. ఇదండి! కృష్ణుడంటె. తెలిసిందా!

కృష్ణుడు చేసిన దొంగ పనులను, అతని లీలల్ని అన్నమయ్య తన కీర్తనలో ఎంత రమణీయంగా వర్ణించాడో చూద్దాం..

**జ్యో అచ్యుతానంద**

**ప. జో అచ్యుతానంద జోజో ముకుంద**
**రావె పరమానంద రామ గోవింద ॥**

**చ. నందు నింటను జేరి నయము మీఱంగ**
**చంద్రవదనలు నీకు సేవ చేయంగ**
**వందముగ వారిండ్ల నాడుచుండంగ**
**మందలకు దొంగ మా ముద్దురంగ ॥**

**చ. పాలవారాశిలో పవళించినావు**
**బాలుగా మునుల కభయమిచ్చినావు**
**మేలుగా వసుదేవు కుదయించినావు**
**బాలుడై యుండి గోపాలుడైనావు ॥**

**చ. అట్టుగట్టిన మీగ డట్టె తిన్నాడే**
**పట్టి కోడలు మూతిపై రాసినాడే**

అట్టె తినెనని యత్త యడుగ విన్నాఁడే
గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే ॥

చ. గొల్లవారిండ్లకు గొబ్బుననుబోయి
కొల్లలుగా త్రావి కుండలను నేయు
చెల్లునా మగనాంధ్ర జెలిగి యీశా యీ
చిల్లతనములు సేయ జెల్లునటవోయి ॥

చ. రేపల్లె పతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మా యిండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
నా పాపడే చెఱిచె నేమందుమమ్మ

చ. ఒకని యాలినిదెచ్చి నొకని కడబెట్టి
జగడములు కలిపించి సతిపతులబెట్టి
పగలు నలుజాములును బాలుడై నట్టి
మగనాంధ్ర చేపట్టి మదనుడై నట్టి ॥

చ. అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకార ॥

చ. గోవర్ధనంబెల్ల గొడుగుగా పట్టి
కావరమ్మున నున్న కంసుపడగొట్టి
నీవు మధురాపురము నేలచేపట్టి
ఠీవితో నేలిన దేవకీపట్టి ॥

**చ. అంగుగా తాళ్లపాకన్నయ్య చాల**
**శృంగార రచనగా చెప్పె నీజోల**
**సంగతిగ సకల సంపదల నీవేళ**
**మంగళము తిరుపట్ల మదనగోపాల ॥**

**భావం :** అచ్యుతా! ఆనందా! మోక్షమిచ్చేవాడా, పరమానంద స్వరూపా! రామా! గోవిందా! ఇటు రా నీకు జోల పాడుతున్నాను.

నీవు నందుని యింట జేరగా గోపికలు నీకు సేవలు చేయగా అందంగా వారి యిండ్లలో క్రీడిస్తున్నావు. మా ముద్దులరంగా! నీవు మందలలో దొంగవు.

నీవు క్షీరసాగరంలో పడుకొన్నావు. మునులకు అభయమిచ్చినావు. వసుదేవుని కొడుకై పుట్టావు బాలుడవై యుండి గోపాలుడవైనావు.

అట్టు గట్టిన మీగడ తిన్నాడు. కొంత ఆ యింటి కోడలి మూతిపై రాశాడు, "ఏమే మీగడ తిన్నావా?" అని అత్త కోడలినడుగగా విన్నాడు. "ఇది దొంగ కొట్టు" అన్నాడు.

గొల్లవారి యిండ్లకు త్వరగా పోయి కుండలలో నెయ్యికొల్లలుగా త్రాగి ఆ కుండలను విసరివేశాడు. ఓ కృష్ణా! మగనాండ్రపట్ల ఇలా చిలిపిపనులు చేయడం నీకు తగునా?

రేపల్లెలోని స్త్రీలు కోపంగా యశోదతో – "గోపమ్మా! నీ కొడుకు మా యిండ్లలో మాపటి వేళవచ్చి మా మానాలను చెఱుస్తున్నాడు. దీనికి మేమేమి అనగలము?

ఒకని భార్యను దెచ్చి ఇంకొకని వద్ద ఉంచి సతిపతుల మధ్య కలహాలు కల్గిస్తున్నాడు. పగలు నలుజాములా బాలుడైనవాడు, రాత్రివేళల్లో ఇల్లాండ్రను చేపట్టి మన్మథుడవుతున్నాడు.

అప్పుడు యశోద కృష్ణునితో ఇలా అన్నది –

మన్మథుని తండ్రివైన మా అన్నా! ఇలా రారా! నీకు బంగారు గిన్నెలో పాలుపోసి యిస్తాను. ఈ గోపికలు నీవు దొంగవని అలజడి చేస్తున్నారు. నా ముందర ఆడుకోరా! ఓ మోహనమైన ఆకారంకల కృష్ణా!

గోవర్ధనగిరిని గొడుగుగా పట్టినావు, మదించిన కంసుణ్ణి హతమార్చినావు. నీవు మధురానగరాన్ని చేపట్టి ఠీవితో పాలించిన దేవకీ సుతుడవు.

అందంగా తాళ్ళపాక అన్నమయ్య మంచి శృంగారరచనగా ఈ జోలపాట చెప్పాడు. సకల సంపదలతో ఈ వేళ నీకు మంగళం! తిరుపట్లలోని ఓ మదన గోపాలస్వామీ! నీకు మంగళం!

***నవనీతచోరా గోవిందా! గోవిందా!***

## 6. మోడులకు మోక్షం

నందమహారాజుయొక్క గోశాలలో 9,00,000 ఆవులు ఉండేవి. అందులో కొన్ని ప్రధానమైన సురభి జాతికి చెందినవి. వాటిని ప్రత్యేకంగా పోషిస్తారు. వాటి పాలు ఎంతో మధురంగా ఉండేవి. ఆ పాలను కృష్ణుడి కోసం మాత్రమే ప్రత్యేకంగా కాచి, పెరుగుచేసి ఆ పెరుగును యశోదమ్మ స్వయంగా చిలికి వెన్న తయారుచేసేది.

బృందావనంలో గోపికలు ఏ పని చేస్తున్నా శ్రీకృష్ణుని బాల్యలీలలను పాటలుగా గానం చేస్తూ ఆనందంగా చేసేవారు. అందుకే పెద్దలు పనిలో పరమాత్మణ్ణి చూడమంటారు. పని చేసేటప్పుడు భగవంతుని పాటలు పాడుకుంటూ ఇష్టంగా చేయాలి. కష్టంగా చేయకూడదు. ఆ గోపికల గానమే విష్ణుకథగా పుట్టుకొచ్చిందని అన్నమయ్య ఈ క్రింది సంకీర్తన ద్వారా తెలియజేశాడు.

**గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ**
**వెల్లివిరియాయె విష్ణుకథ**
**యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము**
**వెల్లిగొలిపె నీవిష్ణుకథ!**
**వినరో భాగ్యము విష్ణుకథ**
**వెనుబల మిదివో విష్ణుకథ!!**

**భావం :** విష్ణుకథ వినండి! మీ అదృష్టమిది. గోపస్త్రీలు చల్లలు చిలుకగా విష్ణుని చరిత్ర విస్తృతంగా వ్యాపించింది. ఇదిగో, శ్రీ వేంకటేశ్వరుని పేరును ఈ విష్ణుకథ నలువైపులా విస్తరింపజేసినది. ఇది మీ భాగ్యము, ఈ విష్ణుకథను వినండి! ఇది చాలబలమైనది.

దాసీజనులు ఎంతమంది ఉన్నా యశోద ప్రతిరోజూ తానే కృష్ణుని కొరకు స్వయంగా వెన్న తీసేది. ఆ రోజు దీపావళి పండుగ. యశోద కన్నయ్య లీలలు గానం చేస్తూ పెరుగును చిలుకుతుండగా, కృష్ణుడు తల్లిదగ్గర పాలు త్రాగడానికి ఆమె దగ్గరకు వచ్చాడు. కవ్వాన్ని గట్టిగా పట్టేశాడు.

వెంటనే యశోద కృష్ణుని ఒడిలోకి తీసుకుంది. పాలిస్తూ కన్నయ్య అందమైన ముఖాన్ని మరలా మరలా చూస్తూ ఉంది.

యశోదమ్మ అన్ని లోకాలను పాలించే లోకపాలకుడికి పాలిస్తున్నదంటే ఆమె ఎంత పుణ్యం చేసి వుంటే అంత అదృష్టం కల్గిందో?

ఇంతలో పొయ్యిమీద పాలు పొంగిపోవడం చూచి కన్నయ్యను అక్కడే దింపి, వంటగదికి వెళ్లింది యశోదమ్మ. కన్నయ్యకు కోపం వచ్చింది. వెంటనే దొంగ ఏడుపు ఏడుస్తూ దంతాలతో ఎర్రని పెదవిని కొరుకుతూ రాయితో కుండను బ్రద్దలుకొట్టాడు. ప్రక్క గదిలోనికి వెళ్లి అక్కడ వెన్నను రహస్యంగా తింటూ ఉండినాడు.

ఇంతలో పొయ్యిమీద పాలు పొర్లినాయి. యశోదమ్మ పొయ్యి ఆర్పడానికి వెళ్లింది. కిట్టయ్యకు కోపం వచ్చింది. అక్కడ వున్న కుండలను పగలగొట్టాడు. యశోదమ్మ వచ్చింది. ఈ అల్లరి ఎవరు చేశారో ఆమెకు అర్థమైంది. దొంగ ఎక్కడ దాక్కున్నాడో కూడా తెలిసిపోయింది. ఎలాగ! ఎలాగంటే పెరుగు అంటుకున్న పాదముద్రలు బట్టి అక్కడ కృష్ణయ్య తలక్రిందులుగా వున్న రోలుపై కూర్చుని పెరుగు, వెన్నలను తాను తింటూ, కోతులకు పెడుతున్నాడు. తల్లి వచ్చి దండించునేమో యని భయంతో అటు ఇటు చూస్తున్నాడు. ఇంతలో యశోద చేతిలో కర్ర పట్టుకుని అక్కడకు చేరింది. కృష్ణుడు ఆమెను చూసిన వెంటనే రోటిపై నుండి దుమికి భయంతో పరుగెత్తాడు.

నిజానికి శ్రీకృష్ణుడు భయానికే భయం కల్గించేవాడు. అయినప్పటికి తనను సాధారణరీతిలో శిక్షింపగోరిన తన తల్లిని చూచి భయపడ్డాడు. కనుకనే యశోదస్థితి కుంతీదేవి కన్నా ఉన్నతమై ఉంది. యశోద భగవంతుణ్ణే తన పుత్రునిగా పొందగలిగింది. కాని తన పుత్రుడే భగవంతుడు అనే విషయం యశోద మరచునట్లుగా శ్రీకృష్ణుడు చేశాడు. ఒకవేళ ఆమె కృష్ణుణ్ణి భగవంతునిగా గుర్తిస్తే అతన్ని ఏ విధంగా శిక్షించగలదు? కనుకనే శ్రీకృష్ణుడు ఆమెతో బాల్యలీలలు ద్వారా వాత్సల్య రసాన్ని అనుభవింపగోరి తాను

భగవంతుడు అను విషయాన్ని యశోద మరచునట్లు చేయడానికి, ప్రతిలీల తర్వాత తన యోగమాయ అనే పొరతో కప్పివేస్తాడు.

సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణణ్ణి తన ప్రియపుత్రునిగా అదుపులో ఉంచగలిగిన యశోద తల్లిప్రేమ చాలా చాలా గొప్పది.

కృష్ణుడు చాలా దూరం పరుగెత్తాడు, యశోదమ్మ కృష్ణుని వెంట పరుగెత్తి పరుగెత్తి అలసిపోయింది. కన్నయ్యను పట్టుకోలేకపోయింది. అమ్మ దీనావస్థ చూసి కృష్ణుడు ఆమెకు పట్టుబడిపోయాడు. చేసిన అపరాధానికి కృష్ణుడు ఏడుస్తున్నాడు. అతని అల్లరి పనులకు శిక్షవేయాలనుకుంది. అతణ్ణి రోటికి కట్టివేయదలచింది.

దాసీజనం చేత త్రాడును తెప్పించి కృష్ణుడిని రోటికి కట్టివేసే ప్రయత్నం చేసింది. ఆ ప్రయత్నంలో ఆమెకు ఎంతో ఆనందం కలిగింది, గోపికలు కూడ ఆ వినోదాన్ని ఆస్వాదించారు. అయితే దాసీలు తెచ్చిన త్రాళ్ళనన్నింటినీ కలిపి కట్టినా కన్నయ్యను బంధించడానికి త్రాడు రెండు అంగుళాలు తక్కువ పడింది. వారు ఎన్నెన్ని త్రాళ్ళు తెచ్చినా ప్రతిసారి రెండంగుళాలే త్రాడు తక్కువ పడింది. ఈ విషయం అందరికీ ఆశ్చర్యాన్ని కల్గించింది.

యశోదమ్మ పడే పాట్లకు ఆమె స్నేహితులు నవ్వడం మొదలుపెట్టారు. అది చూసి ఆమె కూడ నవ్వసాగింది. కన్నయ్య కూడ చిలిపిగా చూస్తూనే ఉన్నాడు. ఇదే భగవంతుని లీల. అంటే భగవంతుని అనుమతితోనే భక్తుని కృషి సఫలమౌతుంది. ఇపుడ సరిగ్గా అదే జరిగింది. కృష్ణుడు బందీ కావడానికి సమ్మతించగానే యశోద అతనిని బంధించింది. యశోదమ్మ కృష్ణణ్ణి త్రాడుతో కట్టివేసేందుకు కారణాలు ఏమంటే;

- కన్నయ్య గోపికల ఇండ్లకు వెళ్లి వెన్న కుండలను పగులగొట్టి అందులో ఉన్న వెన్నను దొంగిలించి, తాను తింటూ కోతులకు పంచిపెట్టుట వంటి కొంటె పనులు ఇకపై చేయవద్దని యశోద అతనికి చెప్పసాగింది.

- కృష్ణుడు ఇకమీదట ఇల్లు విడిచిపెట్టి పోకుండ ఉంటాడని తాడుతో బంధించాలనుకుంది.
- నీవు అల్లరి చేయకుండా ఉండేందుకు, స్నేహితులతో ఆడుకొనుటకు వీలులేకుండా ఇప్పుడు బంధిస్తున్నాను.

ఆశ్రితజనుల సంసారబంధనాలను తొలగించే భగవంతుడు తన తల్లిప్రేమకు బందీ అయ్యాడు. ఆ విధంగా త్రాడుతో కట్టివేయబడి శ్రీకృష్ణుడు "దామోదరుడుగా" (దామము – త్రాడు, ఉదరం – కడుపు) పిలువబడ్డాడు. అయితే ఈ సంఘటనలో త్రాడు రెండు అంగుళాలు మాత్రమే ఎందుకు తక్కువైంది. ఎందుకంటే జీవుడికి కృష్ణుని చేరుకోవాలనే తపన ఉండాలి. దానికి కృష్ణుని కృప కావాలి. ఆ రెండు లేనిదే ఏ పనీ జరగదు. అందుకే ప్రతీసారి రెండు అంగుళాలే త్రాడు తక్కువ పడింది. భగవంతుడు చేసే ప్రతీలీలకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. యశోదమ్మ చేతిలో బందీ కావడానికి భక్తియోగ ప్రభావాన్ని లోకంలో చాటడం ఒక కారణమైతే, తన భక్తుడైన నారదముని భవిష్యవాణిని సత్యం చేయడం మరొక కారణం.

పూతన, శకటాసుర, తృణావర్త సంహారం ద్వారా శ్రీకృష్ణుడు తన అపరిమిత శక్తిని ప్రదర్శించాడు. ఇపుడు వేరొక విభూతిని తన లీలద్వారా తెలియపరుస్తున్నాడు. "నేను సమ్మతించనిదే నీవు నన్ను బంధించలేవు", అని కృష్ణుడు తెలియజేశాడు.

శివుడు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలతో పాటు సమస్త విశ్వం ఆ దేవదేవుని అధీనంలో ఉంది. అయినా ఆభగవంతుడు విశుద్ధభక్తులకు వశం అవుతాడని ఈలీలద్వారా తెలియజేసినాడు. భక్తులు కేవలం ప్రేమానురాగాలతో మాత్రమే కృష్ణుని బంధిస్తారు. యశోదాదేవి చేసింది అదే.

చివరకు యశోద కృష్ణుణ్ణి రోటికి కట్టివేసి తాను ఇంటిపనులలో నిమగ్నమైంది. కృష్ణుడు రోలును ఈడ్చుకుంటూ తమ పెరట్లోకి దోగుతూ వెళ్లాడు. అక్కడే రెండు మద్దిచెట్లు ఉన్నాయి. శ్రీకృష్ణుడు రోటిని

ఈడ్చుకుంటూ ఆచెట్లమధ్య దూరాడు. రోలు వెళ్లలేక అడ్డం పడింది. రోటిని గట్టిగా లాగాడు. పెద్ద శబ్దంతో ఆ చెట్లు నేలకూలాయి. ఆ కూలిన చెట్ల నుంచి ఇద్దరు మహనీయులు బయటికి వచ్చి కృష్ణునికి ప్రణమిల్లారు. వారు కుబేర పుత్రులు నలకూబర మణిగ్రీవులు.

**చెట్లుగా ఎందుకు పుట్టారు?**

నలకూబర మణిగ్రీవులు గొప్ప శివభక్తులు. కాని ఐశ్వర్యమదం వల్ల వారు భోగలాలసులయ్యారు. వివేకహీనులైన వాళ్లు ఒకనాడు నగ్నంగా యువతులతో ఒక కొలనులో జలక్రీడలాడుతూండినారు. ఇంతలో నారదముని ఆ దారిలో వచ్చాడు. మదాంధులైన కుబేరాత్మజులు ఆ మునిని గమనించినప్పటికిని నగ్నంగానే ఉండినారు. వారెంత మాత్రం సిగ్గుపడలేదు. మిథ్యాగర్వం వల్ల శిష్టాచారాన్నే మరచారు. పదవి, ఐశ్వర్యం దృష్ట్యా మర్యాదను మరచి నారదముని వంటి మహనీయులనే అగౌరవపరిచారు. నారదముని కోపించి చెట్లుగా మారిపొండి అని శపించాడు. అంతట కుబేర పుత్రులు నారదమునిని వేడుకొన్నారు. నారదముని గొప్ప భక్తుడు, వైష్ణవుడు. ఆ నారదుని శాపం ఒక వరం వంటిది. నారదముని వారిని నందయశోదల ఇంట వృక్షాలు కమ్మని చెప్పాడు. దేవర్షి శాపముచే నలకూబర మణిగ్రీవులు నందయశోదల గృహప్రాంగణంలో రెండు అర్జునవృక్షాలుగా నిలిచి శ్రీకృష్ణుని దర్శన భాగ్యంకోసం వేచి ఉన్నారు. భక్తుని కోరిక మేరకు శ్రీకృష్ణుడు ఆ మద్ది చెట్లకు మోక్షం ప్రసాదించాడు. ఆ విధంగా నలకూబర మణిగ్రీవులు నూరు దేవతాసంవత్సరాల పిదప శ్రీకృష్ణునిచే ఉద్ధరింపబడ్డారు. శాపవిముక్తి పొంది వాళ్లు కృష్ణుని కీర్తించారు. శ్రీకృష్ణుని దర్శించే అవకాశాన్ని కల్పించిన నారదముని ఎంతటి దయామయుడో తెలిసికొని ఆయనకు ధన్యవాదాలు అర్పించారు. పిదప శ్రీకృష్ణునకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి వారు తమ లోకాలకు వెళ్లారు.

*పాపవిమోచన గోవిందా!*

## 7. బాలుని నోట్లో బ్రహ్మాండాలా!

బలరామ కృష్ణులు అతికొద్ది సమయంలోనే ప్రాకుట మొదలుపెట్టి ఆనందంగా విహరిస్తూ ఉన్నారు. తమ బాలురకు చిన్ని దంతాలు రావడం చూచి తల్లులు వాటిని లెక్కించి ఆనందించేవారు. ఈ విధంగా రోహిణీ – బలరాములు, యశోదా – కృష్ణులు నడుమ వాత్సల్యం కొనసాగెడిది.

కృష్ణ బలరాములు ఎంతో ఉత్సాహంగా ప్రాకుతూ ప్రాకుతూ వచ్చి చిన్నదూడల తోకలు పట్టుకొని లేచి నిలబడేవారు. ఆ దూడలు భయపడి అటు ఇటు పరగెత్తేవి. అప్పుడు గోపవనితలు వచ్చి బాలుర్ని విడిపించి హాయిగా నవ్వేవారు. అది వారికి వినోదంగా ఉండేది.

కృష్ణుని లీలలు భక్తులకు సదా పరమ ఆకర్షణీయంగా వినుటకు వీనుల విందుగా ఉండేవి. ఇరుగు పొరుగు గోపవనితలు తాము చూసిన లీలలను యశోదమ్మకు విన్నవించేందుకు వచ్చారు. యశోద తన ముద్దుల కుమారుని లీలలు వినేందుకు ఇంటి పనులను ఆపి వచ్చి కూర్చుంది.

కృష్ణుడు ఒకప్పుడు పొరుగింటికి వెళ్లి అక్కడ ఎవ్వరూ కనపడకపోతే ఆవుల నుండి పాలు పితకకముందే పాలు త్రాగడానికి దూడలను వదిలేసేవాడు. ఆ దూడలు పాలన్నీ త్రాగేసేవి. ఇంటి యజమాని అది చూసి కృష్ణుణ్ణి పట్టుకొందాం అని పరుగెడితే, అతడు పరుగెత్తి ఇంకొక ఇంటిలో దూరేస్తాడు. ఆ ఇంటిలోకి వెళ్లి ఊరుకుంటాడా, పెరుగు, వెన్నలను దొంగలిస్తాడు. అపుడు గోపవనితలు “ఇదిగో వెన్నదొంగ, పట్టుకోండి” అని అరచి తిరిగి అతనిని బంధించేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు కృష్ణుడు నవ్వగా వారు ఆ విషయంను మరచిపోయి ఆనందంలో మునిగిపోతారు.

ఇంకొకప్పుడు కృష్ణుడు వెన్నకుండలు పగులగొట్టి అందులోని పదార్థాలను కోతులకు పంచేవాడు.

ఇంకొక ఇంటిలోకి వెళతాడు. అక్కడ పెరుగు వెన్న కుండలు కనపడకపోతే, అతడు గదిలోకి వెళ్లి నిద్రపోతున్న పసిబాలురను గిల్లి

ఏడిపించేవాడు. ఆ పిల్లవాడు ఏడుస్తుంటే కృష్ణుడు పరుగుతీస్తాడు. ఈ విధంగా చిన్ని కృష్ణుడు ఎప్పుడూ ఏదో ఒక అల్లరి పని చేస్తూ ఉంటాడు. ఇక్కడ స్వయంగా కృష్ణుడు యశోద దగ్గరే ఉంటాడు. గోపికల ఇండ్లలో వెన్న దొంగిలించడానికి "ప్రకాశ వైభవం" అనే ఇంకొక కృష్ణుడు వెళతాడు.

పూర్వం ప్రతి ఇంట్లో అవసరం వచ్చినప్పుడు వాడుకొనేందుకు వీలుగా పెరుగు, వెన్నలను కుండలలో దాచేవారు. కృష్ణబలరాములు ఒకరిపైన ఒకరు ఎక్కి కుండలను అందుకుని పాలు, పెరుగు, వెన్నలను దొంగిలించి తినేవారు. ఒకవేళ ఆ గది చీకటిగా ఉంటే, తమ దేహాలపై ఉన్న విలువైన మణుల కాంతితో ప్రవేశించేవారు. ఈ విధంగా గోపికలు కృష్ణ లీలలను విని ఆనందిస్తారు. వారి సంతోషాన్ని చూసి శ్రీకృష్ణుడు కూడా ఆనందిస్తాడు. కనుక శ్రీకృష్ణునికి మరియొక నామం "గోపీజనవల్లభుడు" అని. గోపికలకు ఎల్లప్పుడూ ఆనందం కల్గించాలని కృష్ణయ్య అట్టిలీలలు చేసేవాడు.

ఒకరోజు కృష్ణుని స్నేహితులందరూ బలరామునితో కలిసి యశోదమ్మ దగ్గరికి వెళ్లి కృష్ణుడు మన్ను తింటున్నాడని ఫిర్యాదు చేశారు. బాలురు చెప్పింది విని యశోద కృష్ణుణ్ణి చెవి పట్టుకొని లేపి ఇలా అడిగింది. "కృష్ణా! నీవు ఎందుకు మట్టి తింటున్నావ్? ఇంటిలో మిఠాయిలు, పాలు, పెరుగు, వెన్న దండిగా ఉన్నాయి". దానికి సమాధానంగా కన్నయ్య "అమ్మా! వీరందరు కలిసి నాపై చాడీలు చెప్పి నీవు నన్ను దండించేటట్లు చేస్తున్నారు. నా అన్న బలరాముడు వీరితో కలిశాడు. నిజానికి నేను మట్టి తినలేదు. నా మాట నమ్ము, నాపై కోపం వద్దు, నన్ను దండించకు. కావాలంటే నీవే నా నోటిలోకి చూసి పరీక్షించు", అని పలికాడు. "నీవు మట్టిని తిననిచో నోటిని తెరువు" అని యశోద పలికింది. అంతట కృష్ణుడు యశోద ఆజ్ఞచే సామాన్య బాలునివలె నోటిని తెరచాడు. ఆశ్చర్యం! అపుడు అతని నోట్లో సమస్త జీవులను, అంతరిక్షములను, బ్రహ్మాండాల్ని, దిక్కులను, పర్వతములను, ద్వీపములను, సముద్రములను, భూగోళమును,

గ్రహమండలమును, ఆకాశమును, వివిధ దేహములను చూసింది. తనతోపాటు బృందావనాన్ని కూడా చూసి ఆమె నమ్మలేకపోయింది. తన పుత్రుని చూసి భయపడింది.

యశోదమ్మ తనలో ఇలా అనుకొన్నది. "ఇది కలా లేక వైష్ణవమాయా? ఇది నా పుత్రుని యొక్క యోగబలమా?" శ్రీకృష్ణుడు వెంటనే యోగమాయాప్రభావంతో ఆమె తాను చూసింది అంతా మరచిపోయేటట్లు చేశాడు. ఎందుకంటే యశోద కృష్ణుని భగవంతునిగా గుర్తిస్తే తాను పుత్రవాత్సల్యంలో ఆనందాన్ని అనుభవించలేదు. యశోదమ్మ తాను కల గన్నానేమో అనుకుంది.

భగవద్గీత (4.11) శ్రీకృష్ణుడు ఇలా వివరిస్తున్నాడు.

**యే యథా మాం ప్రపద్యన్తే తాం స్త థైవ భజామ్యహమ్!**
**మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః ॥**

"ఎవరు నన్ను ఏ రూపంలో శరణువేడెదరో వారిని నేను ఆ రూపంలో అనుగ్రహిస్తాను. ఓ పార్థా! ప్రతియొక్కరు అన్నివిధముల నా మార్గాన్నే అనుసరిస్తారు."

ఇచ్చట యశోదమ్మ భగవంతుని తన పుత్రునిగా పొందవలెనని కోరుకుంది. నందయశోదలు పూర్వజన్మలో ఎట్టి పుణ్యకర్మలను చేశారో కదా! నందయశోదలు శ్రీకృష్ణుని తల్లిదండ్రులేకానీ యశోద నందమహారాజుకన్నా మరింత భాగ్యవంతురాలు. ఎందుకంటే నందుడు ఒకప్పుడు కృష్ణుడికి దూరంగా ఉండెనేమోగాని, యశోద మాత్రం క్షణమైనా తన పుత్రునికి దూరం కాలేదు. కనుక యశోదమ్మ యొక్క మహద్భాగ్యం అసమానమైనది, వర్ణింపజాలనటువంటిది.

శ్రీకృష్ణుడు దేవకీ గర్భంలో జన్మించాడు. కాని జన్మించినంతనే అతడు యశోద ఇంటికి చేరాడు. దేవకీదేవి కృష్ణునికి పాలివ్వలేదు. కనుక దేవకీ

వసుదేవుల కన్నను యశోదానందులు పరమ భాగ్యవంతులు, ఎందుకనగా శ్రీకృష్ణుని యొక్క బాల్యలీలలను చూసి ఆనందించే అదృష్టం వీరికి కల్గింది. ఆ అదృష్టాన్ని ఈ క్రింది కీర్తన ద్వారా విని ఆనందించమని అన్నమాచార్యులు తెలుపుతున్నారు.

**చూడవమ్మా యశోదమ్మా! యశోదమ్మా!**

**ప. చూడవమ్మ యశోదమ్మ ఓయశోదమ్మ**
**వాడలవాడల వరదలివిగో ॥**

**చ. పొంచి పులిపాలు పెరుగులు**
**మించు మించు మీగడలు**
**వంచివారలు వట్టీన**
**కంచుపుటుట్ల కాగులివిగో**

**చ. పేరీపేరని నేతులు**
**చూరలు వెన్నలు జున్నులును**
**ఆరగించి ఆట సగపాళ్ళు**
**పారవేసిన బానలివిగో**

**చ. తెల్లనీ కనుతీగల సోగల**
**చల్లలమ్మేటి జవ్వనుల**
**చెల్లినట్లనే శ్రీ వేంకటాపతి**
**కొల్లలాడిన గురుతులివిగో**

**భావం :** ఓ యశోదమ్మా! చూడవమ్మా! వీథివీథులలో ఇవిగో వరదలు ప్రవహిస్తున్నాయి, చూడు.

పులిసిన పాలు, పెరుగులు, అతిశయించిన మీగడలు, ఉట్లమీద కాగులు (పాత్రలు) ఇవిగో, చూడవమ్మా!

పేరీపేరని నెయ్యి, కొల్లలైన వెన్నలు, జున్నులు, తిని మిగిలిన సగం భాగాలు వీథులలో పారవేసిన బానలివిగో చూడు.

తెల్లని కన్నులనే తీగల సొబగుతో చల్లలు అమ్మే యువతులను తనకు చెల్లుబాటు ఉన్నట్లు కొల్లలాడిన గుర్తులివిగో! చూడు!

శ్రీకృష్ణుడు మన్ను తిన్నాడని ఇతర బాలురు చెప్పగా 'మన్నెందుకు దింటివి?' అని తల్లి వానిని శిక్షింపబోయెను.

అప్పుడతడు –

**"అమ్మా! మన్ను దినంగ నే శిశువునో ఆకొంటినో వెఱ్ఱినో**
**నమ్మం జాడకు వీరి మాటలు, మది న్ననీవు కొట్టంగ వీ**
**రిమ్మార్గంబు ఘటించి చెప్పదురు, కాదేనిన్ మదీయాస్య గం**
**ధ మ్మాఘ్రాణము సేసి నావచనముల్ తప్పైన దండింపవే"**

అని పలికి నోరుదెరిచి చూపెను. అంతట –

**ఆ లలితాంగి కనుంగొనె**
**బాలుని ముఖమందు జలధి పర్వత వనభూ**
**గోళ శిఖి తరణి శశి ది**
**క్పాలాదికరండమైన బ్రహ్మాండంబున్"**

*బ్రహ్మాండనాయకా గోవిందా! గోవిందా!*

## 8. దావాగ్నిని మింగిన దేవుడు!

ఒకరోజు కృష్ణ బలరాములు, గోపబాలురు రకరకాల ఆటలు ఆడుతూ ఆనందిస్తూ ఉన్నారు. ఆవులు పచ్చిగడ్డి కోసం అడవిలో చాలా దూరం పోయినాయి. అవి పచ్చిగడ్డి మేస్తూ చివరకు “ఇషికాటవి” అను పేరుగల అడవిలో ప్రవేశించాయి. ఆ అడవిలో పచ్చిగడ్డి చాలా ఎక్కువగా ఉంటుంది. అందువలన పశువులు అంతదూరం వెళ్లినాయి.

ఆవులు ఎంతో ఆత్రంగా గడ్డి మేస్తుండగా, ఉన్నట్లుండి అగ్ని ప్రవేశించింది. దానిని చూచి ఆవులు గట్టిగా అరవసాగాయి. ఆటలలో నిమగ్నమైన కృష్ణ-బలరాములు, గోపబాలురు పశువులు కనబడక ఆందోళన పడసాగారు. చాలాదూరం వెతికారు. కనబడలేదు. ఆవులు మరణించినవి అనుకుని భయపడ్డారు. కానీ అంతలోనే ఆవులు అరుపులు వినిపించాయి. కృష్ణుడు గట్టిగా ఆవులను వాటి పేర్లతో పిలిచాడు. అవి కన్నయ్య గొంతువిని “అంబా” అని అరిచాయి. కానీ అంతలోనే దావాగ్ని గాలితీవ్రతవలన వాతావరణం భయంకరంగా మారింది.

గోపబాలురు ఆపద్బాంధవులైన కృష్ణ - బలరాములను చూస్తూ “ఓ కృష్ణా! బలరామా! మేము ఈ మంటల వేడికి తట్టుకోలేక పోతున్నాం. దయచేసి మమ్మల్ని ఈ ఆపదనుంచి రక్షించండి. మీరే మాకు రక్షకులు. మీ పాదపద్మములే మాకు శరణు.” అని ప్రార్థించారు.

కృష్ణుడు తన మిత్రుల ప్రార్థనలను విని భయపడవలసిన అవసరంలేదని, ధైర్యం చెప్పాడు. వారిని కన్నులు మూసుకోమని, ఆజ్ఞాపించాడు. అప్పుడు మహా యోగీశ్వరుడగు శ్రీకృష్ణభగవానుడు వెంటనే ఆ దావాగ్ని జ్వాలలను ఒక్కపెట్టున మ్రింగేశాడు. ఆవులును, గోపబాలురును ఆ ఉపద్రవం నుండి ఆ విధంగా కృష్ణునిచే రక్షింపబడ్డారు. వారికి ఆశ్చర్యం వేసింది. మనం ఏ విధంగా రక్షింపబడ్డాం అని. కృష్ణుడు సామాన్య మానవుడు

కాదు, ఎవరో దేవుడు అయివుంటాడు, ఈ రూపంలో మనల్ని రక్షిస్తున్నాడు అనుకున్నారు.

ఈ కథల ద్వారా మనం తెలుసుకోదగ్గ నీతి ఏమిటో చూద్దాం.

సత్యయుగంలో రాక్షసులు, దేవతలు వేరే వేరే గ్రహాలలో నివసించేవారు. త్రేతాయుగంలో వేరే ఖండంలో రాక్షసులు, దేవతలు నివసించేవారు. ద్వాపరయుగంలో ఒకే ప్రాంతంలో దేవతలు, రాక్షసులు కలిసి వుండేవారు. కానీ కలియుగంలో ఒకే మనిషిలోనే దేవతలు, రాక్షసులు కలిసి నివసిస్తున్నారు. మనిషి సత్త్వగుణంలో వున్నప్పుడు మంచి పనులు చేస్తాడు. రజస్, తమో గుణాలతో కూడి వున్నప్పుడు రాక్షసుడిలాగ ప్రవర్తిస్తాడు. వివేకాన్ని కోల్పోతాడు. మరి మనిషి ఎల్లప్పుడూ సత్త్వగుణంలో వుండాలంటే ఏమి చేయాలి? సత్కర్మలు చేయాలి. భగవంతునికి భక్తియుక్త సేవచేయాలి. భగవద్ భక్తిని ఆచరించాలి. తాను చేసే ప్రతి కర్మను భగవంతునికి అర్పించాలి. భగవద్గీతలో (అ॥ 17.7,8,9శ్లోకాలలో) శ్రీకృష్ణుడు చెప్పినట్లు తాను భుజించే ఆహారం ఆయుః ప్రమాణం పెంచేది, బలమును, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, తృప్తిని కల్గించేదిగా వుండాలి. శాకాహారం మాత్రమే స్వీకరించాలి. మిక్కిలి చేదైనది, అతి పులుపైనది, కారంతో కూడుకున్నది, ఉప్పగా వున్నది, ఎండినది, భుజించుటకు మూడు గంటలు ముందు తయారుచేయబడిన ఆహారమును స్వీకరించినచో దుఃఖమును, క్లేశమును, రోగమును కలుగును. మహాభారతంలో భీష్ముడు ఈక్రింది విధంగా చెప్పాడు.

**ఆహారనిద్రాభయమైథునం చ, సామాన్య మేతద్ పశుభి ర్నరాణామ్ ।**
**ధర్మో హి తేషా మధికో విశేషో, ధర్మేణ హీనా పశుభి స్సమానాః ॥**

**భావం :** ఆహారము, నిద్ర, భయము, మైథునములు మానవులకు, పశువులకు సమానమే. ధర్మము అనేగుణం పైనాలుగులక్షణాలలో

మానవులను పశువులనుండి వేరుచేస్తున్నది. ఆ ధర్మమే లేకపోతే మానవులు పశువులు ఇద్దరూ సమానమే.

ముందు చెడ్డవాడ్ని మంచివాడుగా చేయాలి. మంచివాడ్ని మహాత్ముడిగా చేయాలి. ప్రతిమనిషి మహాత్ముడే. అందులో సందేహం లేదు. కానీ తాను అవలంబించే జీవన సరళిని, ఆలోచనాపద్ధతిని మార్చుకుంటే సరిపోతుంది.

కృష్ణుడు సంహరించిన రాక్షసులు మనలో వున్నటువంటి అవగుణాలను సూచిస్తారు. అది ఏవిధంగా అని మనం ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకుందాం.

| రాక్షసుడి పేరు | | అనర్థం |
|---|---|---|
| 1. పూతన | – | మిథ్యాగురువును సూచిస్తుంది. ఈ గురువు శిష్యులకు సరైన విద్యను బోధించడు. |
| 2. శకటాసురుడు | – | మనలో వున్న పాత, క్రొత్త చెడు అలవాట్లను మోస్తూ వుండే సోమరి మరియు అహంకారి. |
| 3. తృణావర్తుడు | – | ఉపయోగపడని ఇహలోకపు జ్ఞానంతో తత్త్వశాస్త్రాన్ని గురించి చెప్తూ తనంత మేధావి లేడని మిథ్యాగర్వం ప్రదర్శించడం. |
| 4. అర్జునవృక్షాలు | – | అధిక ధనంవల్ల అహంకారంతో విర్రవీగుతూ వివేకహీనంగా ప్రవర్తించడం. |

| రాక్షసుడి పేరు | | అనర్థం |
|---|---|---|
| 5. వత్సాసురుడు | – | పిల్లల మనస్తత్వంలాగ లోభం కల్గి తుంటరిపనులు చేయడం. |
| 6. బకాసురుడు | – | జిత్తులమారి, కపటం, మోసం చేయడం, చెడుగా ప్రవర్తించడం. |
| 7. అఘాసురుడు | – | హింస మరియు క్రూరత్వం. |
| 8. బ్రహ్మ భ్రమ | – | మనస్సుకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం, భౌతికమైన పనులు చేయడం. |
| 9. ధేనుకాసురుడు | – | ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మరచిపోయి, భౌతికమైన తెలివితేటలతో మోటుగా ప్రవర్తించడం. |
| 10. కాళియుడు | – | క్రూరుడు మరియు విశ్వాసఘాతకుడు. |
| 11. దావానలం | – | వైష్ణవుల మధ్య కలహాలు సృష్టించడం. |
| 12. ప్రలంబాసురుడు | – | స్వలాభం, పేరు, ప్రతిష్ఠ, కామ వాంఛలు కల్గి వుండడం. |
| 13. బ్రాహ్మణులు–యజ్ఞాచరణం | – | బ్రాహ్మణులు అనేగర్వంవల్ల కృష్ణుణ్ణి నిర్లక్ష్యంచేయడం. |
| 14. ఇంద్రుని గర్వం | – | నేనే గొప్పవాణ్ణి అని ఆలోచించడం, ఇతర దేవతల్ని ఆరాధించడం. |
| 15. అరిష్టాసురుడు | – | మోసగాళ్ళ చేత కనుగొనబడిన మతాలను ఇష్టానుసారం అనుసరించడంవల్ల వచ్చిన |

| రాక్షసుడి పేరు | | అనర్థం |
|---|---|---|
| | | గర్వంతో భక్తియుక్త సేవను నిర్లక్ష్యం చేయడం. |
| 16. కేశి | – | నేనే గొప్ప ఆధ్యాత్మిక గురువుని, నా అంత గొప్ప భక్తుడు లేడు అని ఊహించుకోవడం. |
| 17. వ్యోమాసురుడు | – | దొంగలతో, దుష్టులతో, మేము భగవంతునిఅవతారాలం అని చెప్పుకునే వారితో స్నేహం చేయడం. |

ప్రతి మనిషి తనలో వున్న చెడు గుణాలను పోగొట్టుకోవాలంటే కేవలం భగవంతుని నామాన్ని జపించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రతి నిత్యం హరేకృష్ణ మహామంత్రాన్ని నిర్దిష్టమైన సమయంలో జపిస్తే మన హృదయం పవిత్రమవుతుంది. అప్పుడు శ్రీకృష్ణభగవానుడు మన హృదయంలో ఎన్నో జన్మల నుంచి వస్తూ వున్నటువంటి రాక్షస గుణాలను సంహరిస్తాడు.

***పశుపాలక శ్రీ గోవిందా!***

## 9. ప్రలంబాసుర వధ

అది గ్రీష్మఋతువు. భారతదేశంలో గ్రీష్మఋతువులో సాధారణంగా ఎండలు ఎక్కువగా ఉంటాయి. కానీ బృందావనంలో అది వసంత ఋతువువలె ఉంది. ఎందుకో తెలుసా! అక్కడ సాక్షాత్తు జగత్తుకే నాథుడైన శ్రీకృష్ణుడు స్వయంగా లీలలు చేస్తున్నాడు కాబట్టి. మనోహరములగు సెలయేరు లున్నాయి. వాని చుట్టూ పచ్చిక బయళ్ళు. యమునా నదీతరంగాల జల్లులతో చల్లగా గాలులు వీస్తున్నాయి. బృందావనం సుందర ప్రదేశం. నెమళ్ల నాట్యములు, అరుపులు, కోకిల రాగాలు అన్నింటినీ మించి కృష్ణుడు పిల్లనగ్రోవి ఊదినప్పుడు ఆవులు, దూడలు, గోపవనితలు, గోపబాలురు, పశుపక్ష్యాదులు ఒక్కరేమిటి అందరూ కూడా దివ్యానందాన్ని అనుభవిస్తారు.

ఒకరోజు కన్నయ్య, బలరాముడు, గోపబాలురు, ఆవులను మేపుటకు తోటలోనికి ప్రవేశించారు. ఆ తోటలో నెమలికన్నులవంటి పూవులు పూస్తూ ఉన్నాయి. ఆ పూల దండలను వారు ధరించారు. ఆ తోటలో వారు ఎన్నో ఆటలు ఆడుకొంటారు. కృష్ణుడు నృత్యం చేయగా, కొందరు పాడుతూ, కొందరు వేణువును ఊదుతూ, మరికొందరు కొమ్ముబూరాను ఊదుతూ ఆనందిస్తారు. గోపబాలురు ఎవరో కాదు, వారు కృష్ణుని లీలలలో పాల్గొని ఆనందించడానికి అవతరించిన దేవతలు. భగవద్గీత ఆరవ అధ్యాయంలో (6.37,38) శ్లోకాలలో అర్జునుడు తన సందేహాలను తీర్చమని శ్రీకృష్ణుణ్ణి అడుగుతాడు. ఆ సందేహం ఏమంటే – భక్తిమార్గాన్ని అనుసరించేవారు మొట్టమొదట చాలా తీవ్రంగా ఆచరిస్తారు. కొద్దికాలం ఆచరించిన తర్వాత ఏదైనా భౌతిక ఆకర్షణకులోనై భక్తియోగం నుంచి పతనం చెందితే అతని పరిస్థితి ఏమిటి! అని అడుగుతాడు.

అందుకు శ్రీకృష్ణుడు భగవద్గీత ఆరవ అధ్యాయంలో (6.40,41,42) శుభకరకార్యాలు చేయువాడు ఈ లోకమున గాని, పరలోకమున గాని

నాశనం పొందదు. మంచి చేయువాడు చెడుచేత ఎప్పుడూ పరాజయం పొందదు. కొద్దికాలం భక్తిచేసి ఆపివేసినవాడు, స్వర్గలోకంలో సుఖాలు అనుభవించిన తర్వాత పవిత్ర కుటుంబంలో గాని లేదా శ్రీమంతుల కుటుంబంలో గాని జన్మిస్తాడు. దీర్ఘకాలం భక్తి చేసి పతనం చెందినవారు (ఎక్కువ స్వర్గలోకంలో సుఖాలను అనుభవించి) జ్ఞానవంతుల ఇండ్లలో జన్మిస్తారు.

ఇట్టి జన్మ అరుదుగా ఉండును. అటువంటి కుటుంబంలో జన్మించిన వారు ఖచ్చితంగా భక్తి చేసి తీరవలసిందే. ఇటువంటి తరగతికి చెందినవారు ఈగోపబాలురు. ఈగోపబాలురు కృష్ణునిలీలల్లో పాల్గొంటున్నా రంటే, వారు క్రితం జన్మలో దీర్ఘకాలం భక్తిచేసి అనేక సంవత్సరాలు స్వర్గసౌఖ్యాలను అనుభవించినవారు. వారు ఎంత అదృష్టం చేసుకున్నారో కదా! భగవంతుని ముఖారవిందాన్ని నిత్యం దర్శిస్తూ, ఆ శ్రీహరి లీలల్లో పాల్గొంటున్నారు. వారు కృష్ణునితోపాటు దాగుడుమూతలు ఆడుతారు. బిల్వఫలములతో, ఉసిరికాయలతో బంతి ఆటలు ఆడుతారు. చెట్లకొమ్మలు పట్టుకొని ఊగులాడుతారు.

ఈవిధంగా వారు దివ్యలీలలను ఆనందించేసమయంలో, "ప్రలంబు" డను గొప్ప రాక్షసుడు వచ్చాడు. అతడు గోపబాలుడుగా వేషం ధరించాడు. కృష్ణ, బలరాములను ఎత్తుకొని పోవాలనే ఉద్దేశ్యంతో ప్రవేశించాడు. కృష్ణుడు భావగ్రాహి కదా! అతని ఉద్దేశ్యం తెలిసినప్పటికీ, "మిత్రమా! నీవు మాతో కలిసి ఆడుకుందువురా!" అని స్వాగతించాడు. కన్నయ్య తాము ఆడబోయే ఆటను గూర్చి వివరించాడు. మిత్రులారా! ఇప్పుడు మనమందరం రెండు బృందాలుగా విడిపోదాం. నాజట్టులో కొంతమంది, బలరామునిజట్టులో కొంతమంది చేరాలి. ఓడిపోయిన వారు గెలిచినవారిని వీపుమీద ఎక్కించుకొని పోవాలి. వారట్లు ఆడుకుంటూ గోవుల్ని మేపుకుంటూ "భాండీర వనం" అడవి గుండా నడువసాగారు. ఆటలో బలరాముని జట్టు గెలిచింది.

కృష్ణుని జట్టు ఓడిపోయింది. పందెం ప్రకారం కన్నయ్య శ్రీదాముడ్ని, భద్రసేనుడు – వృషభుని, ప్రలంబాసురుడు (గోపబాలుడు రూపంలో ఉన్న రాక్షసుడు) బలరాముణ్ణి, తమ వీపులమీద ఎక్కించుకుని మోసుకొని పోవాలి.

ప్రలంబాసురుడు బలరాముణ్ణి చాలా దూరం మోసుకొని పోయాడు. బలరాముడు స్వయంగా ఆదిశేషుడు కదా. ఆ బరువును మోయలేక ఆ రాక్షసుడు నిజరూపం దాల్చినాడు. ఆ రాక్షసుడు చంద్రుని మోసుకునిపోతున్న నల్లని మేఘంవలె ఉన్నాడు. రాక్షసుడు తన దేహాన్ని పెంచాడు. అతని కన్నులు ఎర్రగా మండుతున్న నిప్పులవలె ఉన్నాయి. పదునైన కోరలతో నోరు భయంకరంగా ఉన్నది. బలరాముడు ఆశ్చర్యపడ్డాడు! ఇదేంటి గోపబాలుడు ఇలా రాక్షసుడుగా మారిపోయాడు. ఇది ఎట్లా సంభవం! తనను చంపడానికి ఇంతదూరం మోసుకుని వచ్చాడు అని బలరాముడు గ్రహించలేకపోయాడు. వెంటనే బలరాముడు తన బలమైన పిడికిలితో ఆ రాక్షసుని తలపై కొట్టాడు. బలరాముని పిడికిలి దెబ్బకు ఆ రాక్షసుడు తల చితికి, నోటి నుండి రక్తం కారుతుండగా మహాసర్పంవలె క్రిందపడి మరణించాడు.

రాక్షసుడు క్రిందపడినప్పుడు పెద్ద పర్వతం బ్రద్దలైన శబ్దం వచ్చింది. గోపబాలురందరు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చారు. ఆ భయంకర దృశ్యం చూసి వారు ఆశ్చర్యపడ్డారు. అమ్మో! ఎంత పెద్ద రాక్షసుడు. అంతపెద్ద రాక్షసుణ్ణి చంపినందుకు బలరాముణ్ణి అందరూ పొగిడారు. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

***బలరామానుజ గోవిందా!***

## 10. బ్రహ్మకు తొలగిన భ్రమ

అఘాసుర వధ తర్వాత శ్రీకృష్ణుడు తన గోపబాలురతో, దూడలతో యమునా తీరానికి వచ్చాడు. అప్పటికే అందరికీ బాగా ఆకలి వేసింది. వాతావరణం అంతా చక్కగా ఉంది. “అందరూ కలిసి ఇక్కడే భోజనాలు చేద్దాం” అన్నాడు కృష్ణుడు. “సరే” అని గోపబాలురందరూ దూడలకు యమునలో నీళ్ళు త్రాగించి, వాటిని ప్రక్కనే గడ్డిమేయడానికి వదిలారు. బాలురందరూ శ్రీకృష్ణుని మధ్యలో కూర్చోమని తాము చుట్టూరా కూర్చుని చల్దులు ఆరగించడానికి సిద్ధపడ్డారు. అందరూ తమ తమ ఇండ్లలో నుంచి తెచ్చిన రకరకాల ఆహారపదార్థాలు కృష్ణునికి సమర్పిస్తూ ఒకరికొకరు పంచుకుని తినసాగారు. కృష్ణుడు కూడా వారితో పరిహాసాలు ఆడుతూ, అందరినీ నవ్విస్తూ భోజనం చేస్తున్నాడు. కృష్ణుడు ఇప్పుడు సామాన్యబాలుని వలె మిత్రులతో కలిసి వనభోజనం చేయడం దేవతలకు ఆశ్చర్యాన్ని కల్గించింది.

ఇంతలో దూడలు పచ్చిగడ్డిని మేస్తూ అడవిలోకి వెళ్లాయి. తమ ప్రక్కనే వున్న దూడలు కనబడకపోయేసరికి అందరూ బిక్కముఖం వేశారు. ఆ దూడలను వెదకడానికి బయలుదేరారు. కన్నయ్య వారిని వారించి “నేను వెళ్లి వెదకి తీసుకుని వస్తాను” అని చెప్పి బయలుదేరాడు.

బ్రహ్మకు భగవంతుని మహిమను చూడాలనే కోరిక కల్గింది. అందుకని ఆ దూడలను దూరంగా తీసుకుని వెళ్లాడు. దూడలు ఎక్కడా కనిపించకపోయేసరికి కృష్ణుడు మళ్లీ యమునాతీరానికే వచ్చేశాడు. కానీ బ్రహ్మ అక్కడ వున్న గోపబాలురను కూడా ఎత్తుకునిపోయాడు. అంతా బ్రహ్మదేవుని పనే అని కన్నయ్యకు అర్థమైంది.

వెంటనే కృష్ణుడు తన శక్తి ద్వారా గోపబాలురుగా, దూడలుగా తానే అందరి రూపాలను ధరించి ఎవ్వరికి తెలియకుండ, చివరకు బలరాముడికి

కూడా తెలియకుండ తన కార్యం కొనసాగించాడు. ఇక్కడ "విలాస వైభవం" ద్వారా భగవంతుడు అన్ని రూపాలు ధరిస్తాడు. సాయంత్రం దూడలను తోలుకొని గోపబాలురు వారి వారి ఇండ్లకు వెళ్లారు. తల్లిదండ్రులకు వారి పిల్లలు, దూడలు ఎంతో అందంగా ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. ఎందుకంటే వారందరూ కూడా కృష్ణుని శక్తి స్వరూపాలే కదా. ఇది శ్రీకృష్ణుని అచింత్యమగు శక్తి. గోపికలకు తమ పుత్రులపట్ల రోజు రోజుకీ వాత్సల్య భావం పెరిగిపోతున్నది. బలరాముడు ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

శ్రీకృష్ణుడు యశోదాతనయుడని తెలిసినప్పటికి, గోపికలు "కృష్ణుడు నాపుత్రుడైనచో యశోదవలె నేను కూడ అతనిని లాలించెదను" అని ఆశపడేవారు. ఇది వారి మనస్సులోని చిరకాల – కోరిక. కాబట్టి ఆ కోరికను తీర్చేందుకు కృష్ణుడు తానే అన్ని గోపబాలుర రూపాలను ధరించవలసి వచ్చింది. ఈ విధంగా గోపికలు కృష్ణుని మీద ప్రేమను పెంచుకొన్నారు. కృష్ణుడు కూడ వారి చనుబాలు అమృతతుల్యంగా భావించి త్రాగాడు. దూడలు, వాటి తల్లుల నడుమ వ్యవహారములన్నింటిని స్వయంగా శ్రీకృష్ణుడే నడిపిస్తూ ఉన్నాడు.

మొదటినుండి గోపవనితలు కృష్ణునియెడ మాతృప్రేమను చూపుతున్నారు. నిజానికి కృష్ణునిపట్ల వారిఅనురాగం తమపుత్రులయెడ చూపే ప్రేమకన్నా అధికంగా ఉండేది. ఆవిధంగా వారు కృష్ణునకు, తమ పుత్రులకు బేధభావం చూపేవారు. కాని ఇపుడు ఆబేధభావం తొలగిపోయింది.

మన కాలగణనం ప్రకారం అప్పటికే ఒక్క సంవత్సరకాలం గడిచింది. బ్రహ్మదేవుడు తన కాలగణనం ననుసరించి త్రుటిలో వెళ్లి వచ్చాడు. వెనక్కి వచ్చి చూసిన బ్రహ్మ మళ్లీ కృష్ణుడు తన మిత్రులతో, దూడలతో ఆడుకోవడం

చూసి అబ్బురపడ్డాడు.. తాను క్షణకాలం క్రిందటే కదా వీరిని అపహరించినది. మరలా ఎక్కడనుంచి వచ్చారు. ఇక్కడ ఉన్న వారు నిజమా! లేక తాను తీసుకెళ్లిన వారు నిజమా! బ్రహ్మకు తల తిరిగింది. భగవంతుణ్ణి మోహానికి గురిచేద్దామని వచ్చి తానే మోహానికి గురయ్యాను అనుకున్నాడు. ఇంతలో బ్రహ్మ చూస్తుండగానే అక్కడ ఉన్న గోపబాలురు, దూడలు అందరూ విష్ణు రూపాలుగా మారిపోయారు. అందరూ శంఖ, చక్ర, గదా, పద్మాలను ధరించి దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నారు. బ్రహ్మదేవుడు మట్టి బొమ్మలాగా చూస్తూ మౌనం వహించాడు. "ఇదంతా" ఏమిటీ అని పదే పదే అనుకోసాగాడు. అప్పుడు కృష్ణుడు బ్రహ్మను పట్టిన భ్రమను తన యోగమాయతో తొలగించాడు. అంతే! మరుక్షణంలో అంతా మాయమైంది. బ్రహ్మకు బాహ్యస్మృతి వచ్చింది. శ్రీకృష్ణునికి సాష్టాంగదండ ప్రణామాలు అర్పించాడు. కృష్ణునికి పాదాభిషేకం చేశాడు.

బ్రహ్మకు కృష్ణుని దివ్యమంగళ స్వరూపాన్ని చూసి ఆనందాశ్రువులు. జారాయి తరువాత ఇలా ప్రార్థించాడు. "ఓ కృష్ణా! నీవు అనంతుడవు! సర్వజ్ఞుడవు, సర్వశక్తి స్వరూపుడవు. నిన్ను నేను నా మాయచే కప్పాలని యత్నించాను. నేనెంతటివాడను. మీ జ్యోతితో పోలిస్తే నేను నిప్పురవ్వ వంటివాడను. నందమహారాజు, నీ మిత్రులు, దూడలు ఎంతటి అదృష్టవంతులు." అని బ్రహ్మ స్వామికి ప్రదక్షిణం చేసి హంసవాహనంపై తన లోకానికి వెళ్ళిపోయాడు. బ్రహ్మ భగవంతుణ్ణి చేసిన స్తుతులు "బ్రహ్మ సంహిత"లో ఉన్నాయి. అక్కడ తాను దాచి ఉంచిన గోపబాలురను, దూడలను, తిరిగి యథాస్థానంలో ఉంచేశాడు బ్రహ్మ. గోపబాలురకు జరిగినది ఏమీ తెలియదు. దూడలను వెదకడానికి వెళ్లిన కృష్ణుడు ఇంత త్వరగా వచ్చేశాడే అనుకున్నారు. మరలా కృష్ణునితో కలిసి భోజనం కొనసాగించారు.

## శ్రీకృష్ణుడు వైభవ ప్రదర్శన

శ్రీకృష్ణుడు ద్వారకలో ఉన్నప్పుడు ఒకసారి బ్రహ్మదేవుడు ఆతని దర్శనార్థం వెళ్ళాడు. అపుడు ద్వారపాలకుడు వెళ్ళి బ్రహ్మదేవుని ఆగమన వార్తను కృష్ణునికి తెలిపాడు. ఆ మాటను వింటూనే శ్రీకృష్ణుడు "ఏ బ్రహ్మ? అతని పేరేమిటి?" అని ప్రశ్నించాడు. ఆ విషయాలను అడుగుదామని ద్వారపాలకుడు బ్రహ్మదేవుని దగ్గరకు తిరిగి వచ్చాడు. "మీరు ఏ బ్రహ్మ అని మా స్వామి అడుగుతున్నాడు" అని ద్వారపాలకుడు అన్నాడు. "నేను చతుర్ముఖ బ్రహ్మను. కుమారగణానికి తండ్రిని" అన్నాడు బ్రహ్మదేవుడు. ఆమాట విని శ్రీకృష్ణుడు అతనికి లోపల ప్రవేశించడానికి అనుమతి ఇచ్చాడు. శ్రీకృష్ణదర్శనంతో పులకించిన బ్రహ్మ ఆదేవదేవునికి సాష్టాంగ దండప్రణామం చేశాడు. స్వామి అతని రాకకు కారణాన్ని అడిగాడు. "నేనెందుకు వచ్చానో తరువాత చెబుతాను. కాని ముందు నా మనస్సులోని సందేహాన్ని తీర్చండి స్వామి అన్నాడు. అదేమిటంటే నేను లోపలికి రావడానికి అనుమతిని అడిగినపుడు ఏ బ్రహ్మ అని మీరు అడిగారట. నేను గాక వేరే బ్రహ్మ ఈ విశ్వంలో ఉన్నాడా?" అని బ్రహ్మదేవుడు ఆత్రుతతో అడిగాడు. బ్రహ్మదేవుని ప్రశ్నను వినగానే శ్రీకృష్ణుడు క్షణకాలం ధ్యానమగ్నుడయ్యాడు. వెంటనే అసంఖ్యాక బ్రహ్మలు సభాస్థలిలో ప్రత్యక్షమయ్యారు. వారిలో కొందరికి పది తలలు, కొందరికి ఇరవై తలలు, కొందరికి వేయి తలలు, కొందరికి పదివేల తలలు, కొందరికి కోటి తలలు, కొందరికి వందకోట్ల తలలు ఉన్నాయి. బ్రహ్మలతో పాటు అక్కడ అసంఖ్యాక సంఖ్యలో శివుళ్లు, ఇంద్రులు కూడ ప్రత్యక్షమయ్యారు. శివుళ్ళు అందరు వంద మొదలుకొని కోటి శిరస్సులతో కనిపించారు. ఇంద్రుళ్ళు ఒళ్ళంతా కళ్ళతో కనిపించారు. అది చూసి చతుర్ముఖబ్రహ్మ ఆశ్చర్యపోయాడు. అందరి కంటే తక్కువ శిరస్సులు ఉన్న బ్రహ్మ తానే కావడంతో అందరి ముందు అతడు ఏనుగుల మధ్య కుందేలులాగా అయిపోయాడు. ఇంతలో బ్రహ్మలందరు శ్రీకృష్ణునికి

పాదాభివందనం చేయడానికి పోటీపడ్డారు. వారి కిరీటాలు ఢీకొనడంతో ఆ ప్రాంతమంతా చప్పుళ్ళతో నిండిపోయింది. బ్రహ్మలు, శివుళ్ళు అందరు తరువాత చేతులు జోడించి వందనం చేసి స్తుతించారు. "ఓ దేవదేవా! నీవు మా మీద మహాకరుణ చూపించావు. అందుకే నీ పాదపద్మాలను మేము దర్శించగలిగాం" అని అన్నారు.

"మిమ్మల్ని అందరినీ ఒకే సమయంలో చూడాలని నాకు అనిపించింది. అందుకే మిమ్మల్ని ఒక్కమారుగా పిలిచాను. అందరు కులాసాగానే ఉన్నారుగా? రాక్షసుల భయం ఏమీ లేదుగా?" అని శ్రీకృష్ణుడు వారందరినీ ఉద్దేశించి అడిగాడు. "స్వామీ! నీ కరుణ వలన మాకు సర్వత్ర విజయమే లభిస్తోంది. భూభారాన్ని నీవిపుడు తొలగించావు" అని అందరూ అన్నారు. కృష్ణమాయ కారణంగా బ్రహ్మలందరు ద్వారక తమ పరిధిలోనే ఉన్నదని అనుకున్నారు. తరువాత శ్రీకృష్ణుడు వారందరికీ వీడ్కోలు చెప్పాడు. అందరు తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు. శ్రీకృష్ణుని దివ్యవైభవ ప్రదర్శనం చూసి చతుర్ముఖ బ్రహ్మ ఆశ్చర్యానికి అవధులు లేవు. పదేపదే స్వామికి నమస్కారం చేశాడు. అపుడు శ్రీకృష్ణుడు నవ్వుతూ "నీవు పాలించే బ్రహ్మాండం అన్ని బ్రహ్మాండాల కంటే చాలా చిన్నది. దాని నడిమి కొలత నాలుగు కోట్ల యోజనాలు. అందుకే నీకు నాలుగు ముఖాలు ఉన్నాయి. ఆయా బ్రహ్మాండాల నడిమి కొలతను బట్టి ఆయా బ్రహ్మలకు వివిధ సంఖ్యలలో శిరస్సులు ఉన్నాయి. ఈ విషయం అర్థం చేసికోవలసింది" అని పలికి తన దివ్యభూతిని ప్రదర్శించాడు.

*బ్రహ్మాండరూపా గోవిందా!*

## 11. కాళియ మదహారి

ఒకసారి కృష్ణుడు గోవులను తీసుకుని గోపబాలురతో అడవికి వెళ్లాడు. వారి వెంట బలరాముడు లేడు. ఎండ ఎక్కువగా ఉండడం వల్ల గోవులు, గోపబాలురు యమునా నదికి వెళ్లి నీరు త్రాగారు. నీరు త్రాగిన వెంటనే పిల్లలు, గోవులు నిర్జీవంగా పడిపోయారు. ఆశ్చర్యం! ఎందుకు అలా జరిగింది!

ఎందుకంటే! కాళియ సర్పం యమునా నదిలో నివసించడంవల్ల ఆ ప్రాంతంలో నీరు విషపూరితమైంది. దానినుండి వచ్చే గాలులు కూడా విషపూరితమయ్యాయి. ఆ నది మీదుగా ఎగిరే పక్షులు కూడా మరణించేవి. అయ్యేవి. దానికి కారణం కాళియుడే అని తెలుసుకుని, దానిని అక్కడ నుండి పంపించాలనుకున్నాడు. తననే ఆశ్రయించి ఉన్నట్టి గోగోపాలురు నిర్జీవంగా పడి ఉండటం చూశాడు. వెంటనే యోగీశ్వరుడగు శ్రీకృష్ణుడు వారిపై కరుణ జూపించాడు. అమృతవర్షం వంటి తన వీక్షణంచే వెంటనే వారిని మరల బ్రతికించాడు.

తరువాత కన్నయ్య యమునా నదిఒడ్డున ఉన్న కదంబ వృక్షాన్ని ఎక్కి నీళ్లలోకి దుమికాడు. ఆ కల్లోలానికి నదిలో వున్న సర్పాలు మరింత కోపంతో విషాన్ని క్రక్కసాగాయి. శ్రీకృష్ణుడు కాళియునిమడుగులో గజరాజులాగా విహరించసాగాడు. ఆ శబ్దానికి కాళియుడు అప్రమత్తుడయ్యాడు. ఎవరో తనసరస్సులో ప్రవేశించారని అర్థం చేసుకున్నాడు. దానిని అతను సహించలేక అక్కడకు వచ్చాడు. శ్రీకృష్ణుని చూసి రోషంతో తన పడగలతో చుట్టివేశాడు. ఆ దృశ్యం చూసి గోవులు, గోపబాలురు కళ్ళు తిరిగి నేలపై పడిపోయారు. అప్పుడు బృందావనంలో అందరికీ అపశకునాలు గోచరించాయి. అసలే ఆ రోజు బలరాముడు వెంటలేడు. కృష్ణునికేమైనా ఆపద వాటిల్లిందేమో అని అందరూ కలవరపడ్డారు.

కృష్ణుడే తమ ప్రాణంగా భావించిన యశోదమ్మ, బృందావనవాసులు అతని వైభవాన్ని, శక్తిని గుర్తించలేక చింతాగ్రస్తులు అయ్యారు. కృష్ణుని గురించి తెలిసికోవడానికి ఆతుర పడ్డారు. కాని బలరామునికి తన సోదరుడి అసాధారణశక్తి తెలుసును కనుక ఏమి పలుకకుండ ఉండిపోయాడు. వ్రజవాసులందరూ శ్రీకృష్ణుని పాదముద్రలను అనుసరిస్తూ చివరకు కాళింది మడుగు దగ్గరకు చేరుకున్నారు. మడుగులో కృష్ణుణ్ణి కాళియుడు చుట్టివేయడం చూసి ఆశ్చర్యపోయారు. పెద్దగా ఏడ్వసాగారు. కొందరు మడుగులో ప్రవేశించి కృష్ణుణ్ణి కాపాడాలనుకున్నారు. కానీ బలరాముడు వారిని వారించాడు.

కన్నయ్య సాధారణ మానవుడిలాగా, కొంతసేపు నిస్సహాయుడిగా ఉండిపోయాడు. కాని తనను చూసి అందరూ దుఃఖిస్తున్నారని మరుక్షణమే దాని బంధం నుండి బయటపడ్డాడు. తన శరీరాన్ని తీవ్రంగా పెంచాడు. కాళియుడు శ్రీకృష్ణుని కాటువేయడానికి చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు. గరుడుడు సర్పం చుట్టూ తిరిగినట్టు శ్రీకృష్ణుడు కాళియ నాగు చుట్టూ తిరుగసాగాడు. కన్నయ్యను కాటువేసే అవకాశంకోసం కాళియుడు కూడా ఆ భగవంతుని చుట్టూ తిరిగాడు. కాటు వేసే అవకాశం కాళియుడికి ఇవ్వకుండా కన్నయ్య తప్పించుకుంటున్నాడు. అది చూసేవారికి ఒక ఆటలాగ ఉంది. కృష్ణుడు కాళియసర్పాన్ని వంచి దాని పడగలపైకి ఎగిరి దుమికాడు. అప్పుడు ఆ ఆదిదేవుడు ఆ పడగలపై నృత్యం చేయడం మొదలుపెట్టాడు.

ఆ నృత్యానికి అనుగుణంగా గంధర్వులు, సిద్ధులు, మునులు, చారణులు, దేవతాస్త్రీలు మృదంగాల వంటి సంగీత వాద్యాలను మ్రోగిస్తూ నాట్యమాడారు. కాళియనాగు పడగలపై ఆనందంతో నృత్యం చేస్తున్న శ్రీకృష్ణునిపై దేవతలు స్వర్గంనుండి పుష్ప వర్షం కురిపించారు.

కాళియునికి నూటొక్క ప్రధాన శిరస్సులు కలవు. ఏ శిరస్సు పైకి లేచినా కన్నయ్య దానిపై కాలు మోపి నొక్కుతూ నృత్యం చేశాడు. కాళియుడు పడగలను ఎత్తుతుంటే కృష్ణుడు మళ్ళీ మళ్ళీ వాటిని మర్దించి కాళియ మదహారి అయ్యాడు. కాళియుని శిరస్సుపైగల అనేక మణుల స్పర్శచే శ్రీకృష్ణుని పాదపద్మములు తామ్రం వలె ఎఱ్ఱబడ్డాయి. కాళియుడు మృత్యు సమీపానికి వెళ్లిపోయాడు. నోటినుండి రక్తం కారుతూ ఉంది. తమ భర్త దీనావస్థను చూసి నాగపత్నులు నానారకాల కానుకలను తీసికొని, తమ సంతానాన్ని ముందు నిలుపుకుని కృష్ణుని వద్దకు వెళ్ళారు. శ్రీకృష్ణుని స్తుతించసాగారు. నాగపత్నులు నిజానికి కృష్ణభక్తురాండ్రు. వారు తమ భర్తకు పలుమార్లు నచ్చజెప్పారు. కానీ అతను వినలేదు. ఈ సందర్భంలోనే నాగపత్నులు కౌస్తుభమణిని స్వామి వారికి బహుమతిగా సమర్పించారు. నాగపత్నులచే స్తుతించబడిన తర్వాత కృష్ణుడు కాళియుణ్ణి విడిచిపెట్టాడు. కాళియుడు దీనావస్థలో శ్రీకృష్ణుని ప్రార్థించాడు.

కృష్ణుడు కాళియుడి ప్రార్థనలతో సంతృప్తి చెంది ఈ విధంగా పలికాడు. "కాళియా ఇక ఇక్కడ నీవు ఏ మాత్రం ఉండకూడదు. నీ పత్నులతో, సంతానంతో, బంధుమిత్రులతో కూడి సముద్రానికి వెళ్ళిపో." నీ పడగలపై నా పాదపద్మ చిహ్నాలు ఉన్నాయి గనుక గరుడుడు నిన్ను బాధించడు, భక్షించడు" అన్నాడు.

అప్పుడు కాళియుడు పరమానందంతో తన పరివారంతో ఆ మడుగును వదలి వెళ్లిపోయాడు. కాళియుడు వెళ్ళిపోగానే ఆ మడుగు విషంనుండి బయటపడి నిర్మలజల కుండంగా మారింది. నందయశోదలు, గోపగోపికలు తమ బహిఃప్రాణమైన శ్రీకృష్ణుడు సురక్షితంగా బయటకురావడం చూసి ప్రాణం తిరిగివచ్చినట్లుగా భావించారు.

కాళియుడి నివాసం రమణక ద్వీపం. ఆ ద్వీపంలో పాములన్నిటినీ గరుత్మంతుడు తినేసేవాడు. గరుడుడు ఆ విధంగా తినకుండా ఒక ఒప్పందం

కుదుర్చుకున్నాయి. ప్రతినెలా గరుడునికి బలులు సమర్పించాలి అని, ఇతర సర్పాలన్నీ నియమానుసారం గరుడునికి బలులను ఇస్తున్నాయి. కానీ గర్వితుడైన కాళియుడు మాత్రం గరుడునికి ఆ బలులు చేరకుండా తానే భుజింపసాగాడు. ఆ విధంగా కాళియుడు విష్ణువాహనాన్ని ధిక్కరించాడు. ఈ విషయం తెలిసి గరుడుడు మిక్కిలి కోపంతో కాళియుని చంపడానికి వెంటాడాడు. కాళియుడు గరుడునికి భయపడి యమునానదిలో ప్రవేశించాడు. సౌభరిముని శాపకారణంగా గరుడుడు అక్కడ ప్రవేశించడని తెలుసుకొని నిశ్చింతగా నివసించసాగాడు.

గరుడుడు బృందావనంలోని యమునానదిలోనికి ప్రవేశించక పోవడానికి గల కారణాన్ని శ్రీమద్భాగవతం ఈ విధంగా చెప్పింది.

గరుడుడు యమునానదికి వెళ్లి చేపలను తింటున్నాడు. సౌభరి అను పేరుగల ఋషి ఆ నదిలో తపస్సు చేసుకొంటున్నాడు. గరుడుడు చేపలను తినుటవలన తన తపస్సుకు భంగం కల్గుతున్నదని తలచాడు. నీవు ఈ యమునా నదిలో ప్రవేశిస్తే మరణిస్తావని గరుత్మంతుడిని శపించాడు. ఆ విధంగా గరుడుడు యమునానది ప్రవేశానికి అనర్హుడయ్యాడు.

ఈ కాళియమర్దన లీలను ఉదయసంధ్యలలో శ్రద్ధతో వినేవాడు, కీర్తించేవాడు కాళియుడివలన ఎట్టి భయాన్ని పొందడు అని శ్రీకృష్ణుడు స్వయంగా కాళియుడితో అన్నాడు. ఈ లీలను అన్నమయ్య తన కీర్తనలో ఈ విధంగా వర్ణించాడు.

### ముద్దుగారే యశోద

**ప. ముద్దుగారే యశోద ముంగిట ముత్తెము వీడు**
**తిద్దరాని మహిమల దేవకీ సుతుడు ॥**

**చ. కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము**
**ఏలేటి శ్రీవేంకటాద్రి ఇంద్రనీలము**

**పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము**
**బాలుని వలె తిరిగీ పద్మనాభుడు ॥**

**భావం :** వీడు యశోదాదేవి ఇంటి ముందు ముద్దులొలికే ముత్యము. ఏమాత్రం సంతరింప వీలుగాని మహిమలుగల దేవకీ పుత్రుడు.

వీడు కాళియుని శిరస్సులపై ఉంచిన పుష్యరాగం (ఒక రకమైన రత్నం) అట్లే శ్రీవేంకటాచలం మీద ప్రకాశించే ఇంద్ర నీలమణి. క్షీరసాగరంలో సదా ఉండే దివ్యమైన రత్నం. ఈ కృష్ణుడు వ్రేపల్లెలో చిన్న పిల్లవానివలె ఇటూ అటూ తిరుగుతున్నాడు.

*కాళియమర్దన గోవిందా!*

## 12. కేశి, వ్యోమాసురుల సంహారం

కంసుని ఆజ్ఞపై కేశి అను పేరుగల రాక్షసుడు బృందావనానికి వెళ్ళాడు. ఆ దానవుడు ఘోరమైన అశ్వరూపంలో ఉన్నాడు. ఆ గుఱ్ఱం జూలు గాలిలో ఎగురుతోంది. దాని గిట్టలు నేలను తవ్వుతున్నాయి, దాని భయంకరమైన సకిలింపుకు అందరు దూరంగా పారిపోయారు.

అపుడు కృష్ణుడు కేశిరాక్షసుణ్ణి తీక్ష్ణంగా చూశాడు. దాని తోక గాలిలో గిరగిర తిరగసాగింది. కృష్ణుడు దాని ఎదుటనే నిలబడి యుద్ధానికి ఆహ్వానించాడు. అపుడు ఆ గుఱ్ఱం సింహగర్జన లాంటి శబ్దం చేస్తూ కృష్ణుని వైపునకు పరుగుదీసి కాళ్ళతో తన్నడానికి ప్రయత్నించింది. కాని కృష్ణుడు ఆఅశ్వంకంటే వేగంగా అటు నిటు తిరిగి, దాని కాళ్ళను పట్టుకొని వందగజాల దూరం పడేటట్లు విసిరివేసాడు. క్రిందపడిన ఆ గుఱ్ఱం కోపంతో తిరిగి లేచి కృష్ణుని వైపునకు వచ్చింది. భీకరంగా నోరు తెరచుకొని కృష్ణుణ్ణి నమిలి వేద్దామని కేశి తలచాడు. అపుడు కృష్ణుడు తన చేతిని ఆ రక్కసి నోట్లోపెట్టి పెద్దగా పెంచేశాడు. ఆ చేయి అతివేడిగా కూడా ఉంది. దానితో కేశి బాధతో మెలికలు తిరిగాడు, వాడి దంతాలు ఊడిపోయాయి. ఒళ్ళంతా చెమట పట్టింది. గొంతు పూడుకుపోయి శ్వాస స్తంభించింది. ఆ రాక్షసి నాలుగు కాళ్ళు నాలుగు దిక్కులను చూశాయి, నేత్రాలు బయటకు వచ్చేశాయి. దానితో మలమూత్రాలు విడుస్తూ ఆ రాక్షసుడు తుదిశ్వాస వదిలాడు. మరణించగానే ఆ అశ్వం నోరు వదులు అయింది. కృష్ణుడు తన చేతిని బయటకు తీసుకున్నాడు.

ఆ అద్భుతమైన యుద్ధాన్ని పరికిస్తున్న దేవతలు దివినుండి పుష్పవృష్టి కురిపించారు. కృష్ణుడు కేశి దానవుణ్ణి చంపడం అనేది ఎంతో అద్భుతమైన లీల.

ఇంకొకరోజు ప్రొద్దున కృష్ణుడు మిత్రులతో కలిసి ఆడుకోవడానికి గోవర్ధన పర్వతం పైకి వెళ్ళాడు. అపుడు కొందరు రక్షకభటులుగా, కొందరు

దొంగలుగా, కొందరు గొఱ్ఱెలుగా మారి ఆడుకోవడం మొదలుపెట్టారు. ఆ సమయంలో వ్యోముడు అను పేరుగల రాక్షసుడు అచటకు వచ్చాడు. గాలిలో ఎగిరే ఆ రాక్షసుడికి ఎల్లప్పుడూ ఇతరులకు కష్టం కలిగించడమే పని. వాడు మయదానవుని పుత్రుడు. రాక్షసులకు అనేకమైన మాయావిద్యలు తెలుసు. వ్యోమాసురుడు దొంగల వేషం వేసిన గోపబాలుని రూపం దాల్చి గొఱ్ఱెల వేషం వేసిన గోపబాలురను అపహరించడం మొదలుపెట్టాడు. ఒకరి తరువాత ఒకరిని దొంగిలించి, అందరిని కొండగుహలో బంధించి పెద్ద రాళ్ళు అడ్డంగా పెట్టాడు.

వ్యోమాసురుడు చేసిన మాయ కృష్ణునికి తెలుసు. అపుడు సింహం గొఱ్ఱెపిల్లను పట్టుకున్నట్లుగా కృష్ణుడు ఆ రాక్షసుడిని పట్టుకున్నాడు. ఆ రాక్షసుడు పెద్దగా పెరిగి కొండంత అయ్యాడు. కాని కృష్ణుడు వాణ్ణి పైకెత్తి నేలపై బలంగా విసిరికొట్టాడు. దానితో వాడు నేలపై పడి మరణించాడు. తరువాత కృష్ణుడు గోపబాలురు బంధింపబడిన గుహకు వెళ్ళి, అడ్డంగా ఉన్న రాళ్ళను తొలగించాడు. అపుడు గోపాలురంతా బయటకు వచ్చారు. అద్భుతాల కృష్ణుడు తమను ఏ విధంగా రక్షించాడో తెలిసి గోపబాలురు ఆనందించారు. అది చూసి దేవతలు కూడా సంతోషించారు. తన మిత్రులను మళ్ళీ చూడగలిగినందుకు కృష్ణుడు కూడా ఆనందించాడు. ఆ విధంగా ఆ రోజుకు ఆటలు ముగించి కృష్ణుడు స్నేహితులు, గోవులతో కలిసి ఇంటికి చేరాడు. కృష్ణుడు చేసిన లీలలను బృందావనవాసులు రోజూ కీర్తించేవారు.

***కేశిసంహార గోవిందా!***

## 13. అరిష్టాసుర సంహారం

దేవదేవుడైన శ్రీకృష్ణుడు అన్నిచోట్ల ఉంటాడు. కాని తనను ప్రేమించే భక్తులతోపాటు బృందావనంలో ఉండడమంటే కృష్ణునికి చాలా ఇష్టం. ఎందుకంటే బృందావనంలో భక్తులు కృష్ణుని అద్భుతమైన లీలలను నిరంతరం కీర్తిస్తుంటారు.

అసురులు తరచూ బృందావనానికి వచ్చి భక్తులకు కలత కలిగించేవారు. పూర్వం అరిష్టాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. అతడు కొండంత ఎత్తుగా దృఢంగా వుండేవాడు. ఆ రాక్షసుడు నల్లని మేఘం ప్రయాణిస్తున్నట్లు ఉండేవాడు. రెండు పెద్ద కొమ్ములను కలిగిన అరిష్టాసురుడు ఎంతో కోపంగా ఉండేవాడు. వాడు బృందావనంలో ప్రవేశించినపుడు అతని అడుగులకు నేల కంపించేది.

అరిష్టుని చూడగానే జంతువులు, ఆవులు భయంతో దూరంగా పారిపోయాయి. బృందావనవాసులందరు "కృష్ణా! కృష్ణా! ఈ ఘోరమైన రాక్షసి నుండి మమ్ము కాపాడు" అంటూ అరిచారు.

అపుడు కృష్ణుడు వారితో నవ్వుతూ "భయపడకండి, భయపడకండి" అని ధైర్యం చెప్పాడు.

మిత్రునిభుజంమీద చేయి వేసి నిలుచున్న శ్రీకృష్ణుడు నవ్వుతూ నన్ను చూడడానికే వచ్చినట్లైతే నాతో యుద్ధం చేయి అన్నాడు.

అరిష్టుడు కృష్ణునే తీక్షణంగా చూస్తూ అతని వైపునకు పరుగు తీశాడు. గిట్టలతో నేలను తవ్వుతున్న ఆ రాక్షసుడి తోక నిటూరుగా నింగిని తాకుతున్నట్లుంది. నల్లని మేఘాలు దాని తోకనుచుట్టి ఉన్నట్లు అనిపించింది. కోపంతో ఎఱ్ఱబడిన వాడికళ్ళు ముందుకు, వెనక్కు తిరగసాగాయి. కొమ్ములను కృష్ణుని వైపునకే నిలిపినాడు. ఇంద్రుని వజ్రాయుధంలాగా పరుగెత్తాడు. కాని కృష్ణుడు నేర్పుతో ఆ రాక్షసుడి కొమ్ములను పట్టుకొని

దూరంగా తోసేశాడు. అరిష్టాసురుడు అలసిపోయి చెమటతో తడిసినప్పటికిని తిరిగి లేచి నిలబడి కృష్ణుని వైపు వేగంగా పరుగెత్తాడు. తీవ్రంగా శ్వాస తీస్తున్న అరిష్టుణ్ణి కృష్ణుడు మళ్ళీ కొమ్ములతో పట్టుకొని బలంగా నేలకేసి కొట్టాడు. ఆ వేగానికి వాడి కొమ్ములు విరిగిపోయాయి. అపుడు కృష్ణుడు అరిష్టుని దేహంపై ఎగురుతూ తడిబట్టను పిండినట్లు పిండాడు. దానితో ఆ రాక్షసుడు నేలపై పొర్లుతూ విలవిల కొట్టుకున్నాడు. రక్తం కారుతుండగా మలమూత్రాలు విడుస్తూ అరిష్టుడు ప్రాణం వదిలాడు. ఆ దానవుడి నేత్రాలు బయటికి వచ్చేసాయి.

అపుడు దేవతలు ఆకాశం నుండి కృష్ణునిపై పూలవాన కురిపించారు. ఆ రాక్షసుడు మరణించడం చూసి వారు చాలా సంతోషించారు. బృందావనవాసులకు కృష్ణుడంటే ఎంతో ఇష్టం. తమ ప్రియతమ కృష్ణుడు అరిష్టాసురుణ్ణి చంపడం చూసి వారు కూడా ఆనందించారు. ఈ విధంగా శ్రీకృష్ణుడు బృందావనంలో అనేకమైన దివ్యలీలలను చేశాడు.

***అరిష్టాసురాంతకా గోవిందా!***

## 14. ముక్తిపొందిన ముదితలు

ఒకరోజు గోపబాలురు భోజనం చేయలేదు. వారు చాలా ఆకలిగా ఉన్నారు. కృష్ణబలరాముల దగ్గరికి వెళ్లి ఇలా ప్రార్థించారు. "ఓ కృష్ణా! బలరామా! మీరిద్దరు చాలా శక్తిమంతులు. అనేక మంది రాక్షసులను సంహరించారు. ఇప్పుడు మాకు చాలా ఆకలిగా వుంది. మా ఆకలి తీర్చే ఉపాయం ఆలోచించండి.

కృష్ణ బలరాములు వెంటనే ఒక ఉపాయం చెప్పారు. "ప్రియ మిత్రులారా! మీరు ఇచ్చటకు దగ్గరలో ఉన్న బ్రాహ్మణుల ఇండ్లకు వెళ్లండి. వారు ఇప్పుడు స్వర్గలోకాలకు వెళ్లేందుకు యజ్ఞం చేస్తున్నారు. వారిని అర్థించండి" అని చెప్పి పంపారు.

గోపబాలురు బ్రాహ్మణులను సమీపించి సాష్టాంగ ప్రణామాలర్పించి "ఓ బ్రాహ్మణులారా! ఇచ్చటికి దగ్గరలో కృష్ణ బలరాములు గోవులను కాస్తున్నారు. వారికి చాలా ఆకలిగా ఉంది. దయచేసి ఏదైనా తినేందుకు ఆహారపదార్థాలు ఇవ్వండి" అని ప్రార్థించారు.

బ్రాహ్మణులు యజ్ఞాలు ఆచరిస్తున్నను యజ్ఞఫలం ఎవ్వరికి అర్పించాలనే జ్ఞానం కల్గిలేరు. వారు అజ్ఞానులు. మూఢులు. భగవద్గీతలో వివరింపబడినట్లు వేద పరమార్థం కృష్ణుని ఎరుగుటయే అను విషయం వారు మరచారు.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్!**
**యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్!! (భగవద్గీత 9.27)**

ఓ కౌంతేయ! నీవు ఏది చేసినా, ఏది భుజించినా, ఏది హోమం చేసినా, ఏది దానం చేసినా, ఏ తపస్సు ఆచరించినా వాటన్నింటిని నాకు అర్పణ చేయి. అని శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు.

ఆ బ్రాహ్మణులు గోపబాలురను లక్ష్యపెట్టలేదు. కనీసం వారి మాటలను వినేందుకు వారు నిరాకరించారు. యజ్ఞం యొక్క ప్రయోజనం విష్ణువును సంతృప్తి పరచుటయే అన్న జ్ఞానం కూడా వారికి లేదు. సాక్షాత్తు మహావిష్ణువే స్వయంగా ఆహారం తెమ్మని పంపాడు. కానీ వారు లేదు పొమ్మన్నారు.

గోపబాలురు నిరాశ చెందారు. తిరిగి వెళ్లి కృష్ణునికి జరిగినదంతా చెప్పారు. వారి కథను విన్న కృష్ణుడు చిరునవ్వు నవ్వి దిగులు పడవద్దండి. ఈసారి మరలా వెళ్లండి. కానీ బ్రాహ్మణుల వద్దకు కాదు. బ్రాహ్మణ భార్యల దగ్గరకు. వారు మహాభక్తులు. నిరంతరం మనలను గూర్చి ఆలోచిస్తుంటారు. వారి వద్దకు వెళ్లి కృష్ణ బలరాములు ఆకలిగా ఉన్నారు అని చెప్పండి చాలు. మీరు కోరినంత ప్రసాదం ఇస్తారు అని చెప్పాడు.

గోపబాలురు మరలా వెళ్లారు. ఈసారి బ్రాహ్మణుల ఇండ్లకు వెళ్లారు. అక్కడ బ్రాహ్మణ పత్నులను చూసి నమస్కారం చేశారు. వారితో ఇట్లన్నారు. “తల్లులారా! కృష్ణ బలరాములు మాతోపాటు గోవులను మేపుటకు వచ్చినారు. వారు దగ్గరలోనే వున్నారు. మేమందరం చాలా ఆకలిగా ఉన్నాం. కనుక ఏదైనా తినుటకు ఆహారపదార్థాలు ఇవ్వండి.”

ఈ మాటలు విన్నవెంటనే బ్రాహ్మణపత్నులు కలవరపడ్డారు. అయ్యో కృష్ణ బలరాములు ఆకలిగా వున్నారా! ఇచ్చటికి దగ్గరలోనే వున్నారా! ఉండండి. ఉండండి. అని చెప్పి యజ్ఞానికి తయారుచేసిన రకరకాల ఆహారపదార్థాలు అన్నీ గంపలలో పెట్టుకొన్నారు. వారు ఇల్లు వదిలి పోవుటకు సిద్ధపడ్డారు. కాని భర్తలు, తండ్రులు వారిని పోవద్దని అడ్డుకున్నారు. బ్రాహ్మణ పత్నులు వారి మాటలను పెడచెవిన పెట్టారు. కృష్ణదర్శనం కోసం వారు వెయ్యికళ్లతో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఆలస్యం చేయకుండా వెంటనే పరుగులు తీశారు. ఆ అడవిలో ఆవులను మేపుచున్న కృష్ణబలరాములను చూశారు.

కృష్ణుడు బంగారంవలె మెరుస్తున్న వస్త్రాలు ధరించాడు. మెడలో అడవి పూలతో అల్లిన మాలను ధరించాడు. శిరస్సుమీద నెమలిపింఛం ఉంది.

నొసట కస్తూరి తిలకం ఉంది. పెదవులపై చిరుమందహాసం నాట్యమాడుతున్నది. ఆ దివ్య సౌందర్యమూర్తిని వారు కనులారా దర్శించారు.

శ్రీకృష్ణుడు భగవద్గీత 18.66లో...

**సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ!**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః !!**

అన్నాడు. సర్వవిధములైన ధర్మములను త్యజించి కేవలం నన్నే శరణుపొందండి. నిన్ను సర్వపాపఫలముల నుండి నేను ముక్తిని గావింతును. భయపడవద్దు.

బ్రాహ్మణపత్నులు భగవద్గీత ఉపదేశాలను అనుసరించారు. కనుకనే శ్రీకృష్ణభగవానుడు అత్యంతాదరంతో మందహాసం చేస్తూ వారితో సంభాషించాడు.

కృష్ణుడు వారికి ఇలా స్వాగతం పలికాడు. "ప్రియమైన బ్రాహ్మణ పత్నులారా! మీరు చాల భాగ్యశాలినులు, మీకు స్వాగతం! మీకు నేనేమి చేయవలెనో దయచేసి తెలపండి. మీరు మీ భర్తలను, తండ్రులను, సోదరులను లక్ష్యపెట్టక నన్ను చూచుటకు వచ్చినారు. మీరు ఎంతో అదృష్టవంతులు. ఇప్పుడు మీరు మీ ఇండ్లకు తిరిగి వెళ్లండి. మీ భర్తలు చేసే యజ్ఞకర్మలలో, మీ భర్తల సేవలో, మీ గృహకృత్యములలో పాల్గొనండి."

బ్రాహ్మణపత్నులు శ్రీకృష్ణునికి ఈ విధంగా సమాధానం చెప్పారు. "ఓ స్వామీ! మీరిట్లు ఆదేశించడం తగదు. నీవు మమ్మల్ని రక్షిస్తావని, మా భర్తలను, తండ్రులను, సోదరులను ఎదిరించి వచ్చాం. ఇప్పుడు మేము తిరిగి వారి వద్దకు పోయినచో, వారు మమ్మల్ని తిరస్కరిస్తారు. మేము నీ రక్షణలోనే ఉంటాం. మేము ఇండ్లకు తిరిగి వెళ్లం" అని చెప్పారు.

కృష్ణుడు వారికి తిరిగి ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు. "ప్రియమైన బ్రాహ్మణ పత్నులారా! మీరు ఇండ్లకు వెళ్లిన పిదప మీ భర్తలు మిమ్ములను ఉపేక్షించరు.

స్వీకరిస్తారు. మీరు నా యెడశుద్ధ భక్తులు. గనుక మీ భర్తలు, మీ బంధువులే కాదు, దేవతలు కూడా మీపట్ల సంతృప్తి చెందుతారు. మీరు నా పట్ల చూపిన ప్రేమ దివ్యమైనది. మీరు ఈ జన్మ తర్వాత నా శాశ్వత ధామమైన గోలోక బృందావనం చేరుకుంటారు” అని ఆశీర్వదించాడు.

శ్రీకృష్ణభగవానుడు బ్రాహ్మణ పత్నులు అర్పించిన ఆహారం సంతోషంగా, సంతృప్తిగా స్వీకరించాడు.

**న సాధయతి మాం యోగో న సాంఖ్యం ధర్మ ఉద్ధవ ।**
**న స్వాధ్యాయ స్తప స్త్యాగో యథా భక్తి ర్మ మోర్జితా ॥**
**శ్రీమద్భాగవతము (శ్లో.11-14-20)**

ప్రియమైన ఉద్ధవా! యోగంలో, సాంఖ్యతత్త్వంలో, పుణ్యకార్యాల్లో, వేదాధ్యయనంలో, తపస్సు లేదా త్యాగంలో నెలకొనినవారికి నేను అధీనుడను కాను. నాభక్తులు చేసేఅనన్యభక్తి మాత్రమే నన్ను వారికి అధీనుడిని చేస్తుంది.

భగవంతుడు ఆదేశించిన పిమ్మట వారు ఇండ్లకు తిరిగి వెళ్లారు. తమ భార్యలు ఇండ్లకు తిరిగి రావడం చూసి వారి భర్తలు ఎంతో సంతోషించారు. భార్యాభర్తలు ఇరువురూ యజ్ఞయాగాది క్రతువులను పూర్తిచేశారు. బ్రాహ్మణులు తాము గోవిందునికి ఆహారం ఇవ్వడానికి నిరాకరించి, పాపం చేసినందుకు పశ్చాత్తాపపడ్డారు. చివరకు తమ తప్పిదం తెలిసికొన్నారు. వారి భార్యల భక్తి, భగవంతుని మీద వారికి గల విశ్వాసం చూసిన తరువాత తమను తాము నిందించుకొన్నారు. వారిట్లు సంభాషించుకొన్నారు.

“ఛీ! మనం బ్రాహ్మణులుగా జన్మించి ప్రయోజనమేమి! మనం చదివిన వేదాధ్యయనం లక్ష్యం ఏమిటి! గోపబాలురు వచ్చి కృష్ణబలరాముల మహిమలను గూర్చి మనకు చెప్పినప్పుడు వారిని అగౌరవపరిచాం. కృష్ణుడు మనలను అనుగ్రహించుటకే ఆహారంకోసం వారిని పంపాడు. మన

అజ్ఞానంవల్ల ఆ విషయం గ్రహించలేకపోయాం. స్వామి అనుకుంటే తన సంకల్ప మాత్రంచేతనే వారి ఆకలిని క్షణంలో పోగొట్టగలడు. మనం మూర్ఖులం. కృష్ణుడు యదువంశంలో శిశువుగా జన్మించటంవల్ల సాక్షాత్తు భగవంతుడని మనం గుర్తించలేకపోయాం. మన భార్యలు మనల్ని ఎదిరించి భగవత్సేవ చేసినందుకు మనం గర్వపడాల్సి ఉంది."

శ్రీకృష్ణుని చూచుటకు పోరాదని కఠినంగా నిర్బంధితురాలైన ఒక బ్రాహ్మణపత్ని మాత్రం చాలా దుఃఖించింది. ఆమె అచటకు వెళ్లిన వారి ద్వారా కృష్ణుని గూర్చి వినినది. ఆయనను గూర్చిన ధ్యానంలో పూర్తిగా నిమగ్నురాలై తన భౌతిక శరీరాన్ని త్యజించింది.

బ్రాహ్మణులు స్వయంగా కృష్ణునివద్దకు వెళ్ళి అంజలి ఘటించి క్షమాపణ కోరాలి అనుకున్నారు. కానీ కంసుడికి భయపడి అలా చేయలేకపోయారు. వారి పత్నులు భగవంతునికి పూర్తిగా శరణాగతి పొందారు కాబట్టి భర్తలను ఎదిరించగలిగారు. అదే శుద్ధమైన భక్తికి తార్కాణం. కృష్ణునికి పూర్తిగా శరణాగతుడైన భక్తుడు అతనికి సేవ చేసేందుకు ఎటువంటి అవరోధాలను లెక్కపెట్టడు.

*శరణాగతవత్సల గోవిందా!*

## 15. గోవిందుని వేలిపై గోవర్ధనం!

శ్రీకృష్ణుడు బృందావనంలో ఉన్న కాలంలో బృందావనవాసులు వర్షానికి అధిపతియైన ఇంద్రుని సంతోషంకోసం యాగం తలపెట్టారు. ఇది తెలుసుకొన్న కృష్ణుడు యాగం ఎవరికోసం చేస్తున్నారో, యాగ విధానమేమిటో తెలుసుకోవాలని తన తండ్రిని ప్రశ్నించాడు. కాని తండ్రి నందమహారాజు యాగం గురించిన గూఢ విషయాలు బాలుడు అర్థం చేసుకోలేడని జవాబివ్వలేదు. మరల కృష్ణుడు పట్టు బట్టి "యజ్ఞాచరణం వైదికాదేశం మేరకా? లేకా ఒక పండుగ మాత్రమేనా?" అని ప్రశ్నించి వివరాలను తెలపాలని తండ్రిని నిలదీశాడు.

శ్రీకృష్ణుని ప్రశ్నలకు నందమహారాజు ఇలా సమాధానమిచ్చాడు. "నాయనా! ఈ యాగం వర్షానికి అధిపతి అగు ఇంద్రుని కోసం చేస్తున్నాం. నీరు మానవజీవితానికి ఆధారం. ఈ యాగం మన పూర్వికులచే సంప్రదాయ బద్ధంగా ఆచరింపబడుతూ వస్తున్నది. కావున మనం కూడ తప్పక ఆచరించాలి."

తరువాత కృష్ణుడు ఇంద్రునికోసం యాగం చేయనవసరం లేదు. ఎందుకంటే దేవతలు ప్రసాదించే ఫలాలు తాత్కాలికాలనీ ఆ ఫలం ఇచ్చేవాడు పరోక్షంగా భగవంతుడే అని తెలిపాడు. ఆయాగానికి చేసిన ఏర్పాట్లను గోవర్ధన పర్వతాన్ని పూజించడానికి ఉపయోగించమని తెలిపాడు.

స్వర్గాది ఊర్ధ్వలోకాలకు అధిపతినని మిడిసిపడుతున్న ఇంద్రుని శిక్షించుటకే కృష్ణుడు ఆ విధంగా పలికాడు. కృష్ణుడు చెప్పిన విధంగా బృందావనవాసులు గోవర్ధన పూజాకార్యక్రమాలు చక్కగా నిర్వహించారు. పిదప గోవర్ధన పర్వతానికి, తనకు మధ్య భేదంలేదని వారికి తెలిపి శ్రీకృష్ణుడు అందమైన రూపం దాల్చి గోవర్ధన పర్వతానికి నైవేద్యం చేసిన ఆహారాన్ని ఆరగించాడు.

బాలుడైన కృష్ణుడి ఉపదేశం మేరకు బృందావనవాసులు యాగాన్ని ఆపివేశారు, కావున వారిని శిక్షించాలని ఇంద్రుడు భావించాడు. కుంభవృష్టిని కురిపించగల సంవర్తక మేఘాన్ని పిలిచి బృందావనాన్ని కుంభ వృష్టితో ముంచి వేయమని ఆజ్ఞాపించాడు. ఇంద్రుడు శ్రీకృష్ణుడిని సామాన్య మానవుడని తలచాడు.

ఇంద్రుని ఆజ్ఞమేరకు సంవర్తక మేఘాలు కుంభ వృష్టిని కురిపించి బృందావనాన్ని జలమయం చేయసాగాయి. ఆభయంకరమైన పెనుగాలులకు, వర్షధారలకు బాధితులైన బృందావన వాసులు తమ తమ ఆవులూ దూడలతో గోవిందుని చేరి ఇంద్రుని కోపం నుంచి రక్షించమని ప్రార్థనలు చేశారు. వారి ప్రార్థనలు విన్న శ్రీకృష్ణుడు తన భౌతిక శక్తికి ఉబ్బిపోయి, ఉన్మత్తుడై, తన స్థానం మరచి దురహంకారాన్ని ప్రదర్శిస్తూ బుద్ధి పూర్వకంగానే ఇంద్రుడు ఈ పని చేస్తున్నాడని గ్రహించాడు.

ఇట్టి పరిస్థితులలో శుద్ధ భక్తులైన బృందావన వాసులకు రక్షణ కల్పించడం తన బాధ్యతగా భావించాడు. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పైకి ఎత్తాడు. తన ఎడమచేతి చిటికెన వ్రేలుపై గొడుగులాగా పట్టి ఉంచాడు. బృందావనవాసులందరిని దానిక్రిందకు ఆహ్వానించి వారికి ధైర్యం చెప్పాడు. ఆ విధంగా శ్రీకృష్ణుడు వరుసగా ఏడు రోజులపాటు కురిసిన కుండపోత వర్షంనుంచి వారికి రక్షణ కల్పించాడు. ఆ పర్వతం క్రింద ఉన్నన్ని రోజులు ప్రజలకు కృష్ణుని యోగమాయ చేత ఆకలి దప్పులు కలుగలేదు. ఇది గమనించిన ఇంద్రుడు కృష్ణుడు సామాన్య బాలుడు కాడని తలచి సంవర్తక మేఘాలను వెనుకకు పిలిపించాడు.

తరువాత గోపాలురందరు తమతమపరివారాలతో ఇల్లు చేరుకున్నారు. కృష్ణుడు నెమ్మదిగా గోవర్ధన పర్వతాన్ని క్రిందకు దించి యథాస్థానంలో ఉంచాడు. పిదప బృందావన వాసులందరు శ్రీకృష్ణుని

సమీపించి అమితానందంతో తమ కృతజ్ఞతను పలురకాలుగా తెలిపారు. బృందావనంలో మునుపటి వలె ప్రశాంతవాతావరణం నెలకొంది.

ఇంద్రుడికి గర్వభంగం కలుగగానే, నేరుగా సృష్టికర్త దగ్గరకు వెళ్లాడు. బ్రహ్మ గోపబాలురను తస్కరించినందులకు, తనకు భ్రమ తొలగడం గురించి వివరించాడు. బ్రహ్మ "సురభి" గోవును తీసుకుని వెళ్లమని చెప్పాడు. గోలోకం నుంచి 'సురభి' అనే గోవును తీసుకుని ఇంద్రుడు కృష్ణుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

స్వర్గాధిపతి ఇంద్రుడు కృష్ణునిపట్ల తాను చేసినఅపరాధం ఎరిగినవాడు గనుక ఎవరూ చూడకుండా దొంగచాటుగా వచ్చాడు. అతడు వచ్చిన వెంటనే సూర్యకాంతివలె ప్రకాశిస్తున్న తన కిరీటంతో అతడు కృష్ణుని పాదపద్మాలపై వ్రాలాడు. కృష్ణుడు ఇంద్రునికి యజమాని గనుక అతనికి కృష్ణుని మహోన్నత స్థితి తెలుసు. కాని కృష్ణుడు బృందావనానికి దిగివచ్చి సామాన్య గోపాలురతో పాటు ప్రస్తుతం లీలలు చేస్తున్నాడని అతడు నమ్మలేకపోయాడు. ఈ విశ్వానికి తానే సర్వశక్తిమంతుడనని, తనవంటి శక్తిమంతుడు మరొకడు లేడనియు ఇంద్రుడు భావించాడు. కాని, ఈ సంఘటన జరిగినపిదప అతనిమిథ్యాహంకారం పూర్తిగా అణగిపోయింది.

తన దీనావస్థను గుర్తించిన తర్వాత ఇంద్రుడు చేతులు కట్టుకొని కృష్ణుని ఎదుటికి వచ్చి ఈ విధంగా ప్రార్థించాడు. "ప్రభూ! నేను దురహంకారంతో విర్రవీగుతున్నందున, నీవు గోపాలురను ఇంద్ర యజ్ఞం చేయనీయకుండ అడ్డుపడటం నాయెడ అపరాధం చేయడమే అని నేను భావించాను. ఇంద్రయాగంకోసం సేకరించిన సంబరాలను నీవే అనుభవింపదలచావు అని భావించాను. గోవర్ధనయాగం పేరుతో నా యజ్ఞ ఫలితములన్నీ నీవే పొందుతున్నావని అపోహపడ్డాను. ఇప్పుడు నీ అనుగ్రహం వల్ల నీవే దేవాదిదేవుడవని, సకల భౌతిక గుణాలకు అతీతుడవని గ్రహింపగలిగాను.

సకల సృష్టికిని నీవే మూలం, నీవే సకల జీవులయందుండు పరమాత్మవు. నేను నా అజ్ఞానం వల్ల కుంభవృష్టిని, వడగండ్ల వానను బృందావనం పై కురిపించి గొప్ప కల్లోలం సృష్టించాను. నన్ను సంతృప్తి పరచేందుకు జరుగవలసిన యాగాన్ని నీవు ఆపివేశావు అన్న కోపంతోనే నేనట్లు ప్రవర్తించాను. కాని ప్రభూ! నీవు దయాసాగరుడవు, నా దురహంకారాన్ని తొలగించి నన్ను అనుగ్రహించు."

ఈ విధంగా ఇంద్రునిచే స్తుతింపబడిన దేవాదిదేవుడగు శ్రీకృష్ణ భగవానుడు మనోహరమైన మందహాసంతో ఇట్లన్నాడు : ప్రియమైన ఇంద్రా! అకారణకృప చూపుటకును, నేను నీ శాశ్వత ప్రభువునని గుర్తు చేయుటకును నీ యాగాన్ని ఆపాను. నేను నీకు మాత్రమే గాక తక్కిన సకల దేవతలకును ప్రభువును. నీసకలసౌభాగ్యాలూ నాఅనుగ్రహంవల్లనే కలిగాయని నీవు నిరంతరం గుర్తుంచుకోవాలి. నేను దేవాదిదేవుడనని ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ స్మరించాలి. నా కన్న అధికుడెవడు లేడు గనుక నేను ఎవరినైనను అనుగ్రహింపగలను, ఎవరినైనను శిక్షింపగలను. దురహంకారంతో ఎవరైనా నన్ను ధిక్కరించినట్లు కనిపిస్తే అతని పట్ల నా ప్రత్యేకమైన కరుణను ప్రదర్శించుటకే అతని సంపదను హరిస్తాను."

కృష్ణభగవానుడు ఇంద్రునికిట్లు ఉపదేశించిన పిదప స్వర్గలోకానికి తిరిగి వెళ్లుమనియు, అతడు ఎన్నడును పరమ నియామకుడు కాడనియు నిరంతరం దేవదేవుని అధీనుడే అని గుర్తుంచుకోమనియు ఆదేశించాడు. నీ స్వర్గలోకాన్ని నీ వేలుకో, దురహంకారం పొందక జాగరూకుడవై మెలగు. అని ఇంద్రునికి స్వామి హితవు చెప్పాడు.

పిదప ఇంద్రుడు సురభిగోవుతో గూడి ఆకాశగంగాజలంతోను, సురభి యొక్క క్షీరంతోను అభిషేకం కావించాడు. ఇంద్రుడు అపుడు కృష్ణునికి "గోవిందుడు" అని పేరు పెట్టాడు. దేవతలు పుష్పవృష్టి కురిపించి పలురీతుల కీర్తించిరి.

## గిరి భువిపై అవతరించుట

గోకుల బృందావనంలోని గోవర్ధన పర్వతం యొక్క పరిమితులు మానవుని ఊహకందనివి. గోవర్ధనగిరికి "శతశృంగ" అను పేరుకూడా ఉంది. అనగా నూరు శిఖరాలు కలది.

గర్గసంహిత ప్రకారం, శ్రీకృష్ణ భగవానుడు భూలోకంపై అవతరించే ప్రయత్నంలో ఉన్నప్పుడు శ్రీమతి రాధారాణిని కూడా అవతరించమని కోరాడు. కాని రాధారాణి, బృందావనం, యమునానది, గోవర్ధన పర్వతం లేనిచోట తను సంతోషంగా ఉండలేనని బదులిచ్చింది. కాబట్టి శ్రీకృష్ణభగవానుడు, గోలోక బృందావనంలోని కొంతభాగాన్ని భూలోకంలో సృష్టించాడు. కాని, నంద గ్రామంలో గోవర్ధనగిరి వెంటనే అవతరించలేదు. భరతవర్ష పశ్చిమభాగంలో శాల్మలి ద్వీపంలో ద్రోణ పర్వత కుమారుడిగా జన్మించాడు. బృందావనానికి ఎలా వచ్చాడు అని ఇప్పుడు తెలిసికొందాం.

ఒకరోజు పులస్త్య ఋషి, శాల్మలి ద్వీపంగుండా ప్రయాణిస్తున్నప్పుడు గోవర్ధనగిరి అందం చూసి ఆశ్చర్యపడ్డాడు. శివారాధన జరిగే కాశీక్షేత్రానికి గోవర్ధనగిరిని తరలించాలని సంకల్పించాడు. గోవర్ధనాన్ని అచటికి తరలించే సంకల్పంతో, తండ్రి ద్రోణుని వద్దకు వెళ్ళి, గోవర్ధనాన్ని తనకు దానమివ్వమని ప్రార్థించాడు. తండ్రి, కుమారులిద్దరికీ ఒకరినొకరు విడిచి ఉండేందుకు దుఃఖం కలిగింది. కానీ, ఋషియొక్క కోర్కెను తీర్చకపోతే తమను శపిస్తాడేమోనని భయపడ్డాడు. గోవర్ధనుడు కూడ తన కాశీ ప్రయాణానికి సమ్మతించి, గమ్యం చేర్చేవరకు ఎక్కడ కూడా క్రింద దించకూడదు అని షరతు విధించాడు. పులస్త్య ఋషి గోవర్ధనుని తన కుడిచేతితో ఎత్తుకొని కాశీక్షేత్రానికి పయనమయ్యాడు.

ఈ ప్రయాణంలో వ్రజ సమీపమునకు వచ్చేసరికి గోవర్ధనునకు తన పూర్వజన్మ గుర్తుకు వచ్చి, తను అక్కడనే ఉండుట సమంజసమని తలంపు

కలిగింది. అక్కడ తాను ఉంటే శ్రీకృష్ణభగవానుడు భవిష్యత్తులో అవతరించి తన శిఖరాలపై గోవులతోను, గోపబాలకులతోను క్రీడిస్తాడని ఆశపడ్డాడు. అందుకోసం గోవర్ధనుడు తన బరువును పెంచి పెంచి ఋషికి అలసట కలిగించాడు. ఋషి తన పూర్వ సంకల్పాన్ని మరచి, గోవర్ధనుని క్రిందకు దించి వేశాడు. కొంత సమయం ఋషి విశ్రాంతి పొంది, స్నానమాచరించి తన పూర్వ సంకల్పం గుర్తుతెచ్చుకుని తిరిగివచ్చి గోవర్ధనుని ఎత్తుకుని కాశీప్రయాణం కొనసాగించేందుకు ప్రయత్నించాడు. కానీ గోవర్ధనుడు కొంచెం కూడ కదలలేదు. తను పూర్వం నిర్దేశించిన షరతును ఋషికి గుర్తుచేశాడు. ఋషి, తనకోరిక నెరవేరలేదని, నీవు ప్రతిరోజూ ఆవగింజంత ప్రదేశం భూమిలోనికి క్రుంగిపోతావు అని గోవర్ధనుని శపించాడు. అప్పటికే గోవర్ధనుడు రెండు యోజనాల ఎత్తు (పదునారుమైళ్ళు) కలిగి వున్నాడు. కానీ, ప్రస్తుతం తన ఎత్తైన శృంగమే ఎనభై అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడు.

ఆదివరాహ పురాణంలో గోవర్ధన ఆవిర్భావం గురించి మరియొక కథకూడా ఉంది. శ్రీరామచంద్రమూర్తి, లంకకు చేరేందుకు సేతువును నిర్మించాలని ఆదేశించినపుడు, హనుమంతుడు తన అపూర్వబలంతో పర్వతాలను పెకలించి రామేశ్వరానికి తరలిస్తున్నాడు. హిమాలయంలో సానువులలో ఉన్న గోవర్ధనమును ఎత్తుకుని దక్షిణపు దిక్కుకు ఎగిరి వెళ్తున్న సమయంలో ఆకాశవాణి 'సేతు నిర్మాణం పూర్తి అయింది కావున ఇక ఎంతమాత్రం శిలల అవసరంలే' దని చెప్పింది. ఆ సమయంలో హనుమంతుడు వ్రజమండలంపై ఎగురుతూ, గోవర్ధనాన్ని ఆ ప్రదేశంలోనే ఉంచాడని పురాణగాథ ఉంది. శ్రీరామచంద్రుని పాదస్పర్శ తనకు కలగలేదని నిరాశపడిన గోవర్ధనుడు, అందులకు కారణం హనుమంతుడే కాబట్టి శాపం ఇవ్వాలని అనుకున్నాడు. ద్వాపరయుగంలో భగవంతుడు గోవర్ధనుని కోర్కెతీర్చేందుకు, నందమహారాజుకు పుత్రుడిగా అవతరిస్తాడని హనుమంతుడు చెప్పాడు. శ్రీకృష్ణభగవానుని పాదపద్మ స్పర్శ

లభించటమేగాక, గోవులతోనూ, గోపబాలకులతోను గోవర్ధనునిపై క్రీడించి, తన చిటికెన వ్రేలితో ఏడు రోజులు పైకెత్తిపెట్టి, నంద గ్రామాన్ని ఇంద్రుడు నాశనం చేయకుండ కాపాడుతాడని కూడా హనుమంతుడు చెప్పాడు. గోవర్ధనుడు సంతోషపడ్డాడు.

***గోవర్ధనోద్ధార గోవిందా!***

## 16. బక - అఘాసురాంతకుడు

ఇంకొకరోజు కృష్ణబలరాములు దూడలకు నీళ్ళను తాగించడానికి యమునాతీరానికి వచ్చారు. దూడలచేత నీళ్ళు త్రాగించారు, తాము కూడ తాగారు. ఉన్నట్టుండి అక్కడ వారికొక పెద్ద కొంగ కనిపించింది. అది ఒక పర్వత శిఖరంలాగా ఉంది. ఇంద్రుని వజ్రాయుధంచే నేలకూలిన పర్వతశిఖరంలాగా ఉన్న దానిని చూడగానే గోపబాలురు భయపడ్డారు. అంత పెద్ద కొంగను వారెప్పుడూ చూడలేదు. కనీవినీ ఎరుగని ఆ భయంకర ప్రాణిని చూడడానికి కూడా వారు సంకోచించారు. ఆ కొంగ ముందుకు వచ్చి శ్రీకృష్ణుని మింగి వేసింది. హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనతో బలరాముడు, గోపబాలురు నిశ్చేష్టులయ్యారు. దాదాపు వారందరు స్పృహ కోల్పోయి నేలమీద పడిపోయారు. కాని కొంగ నోటిలోకి వెళ్ళిన శ్రీకృష్ణుడు అగ్నిలాగా మండసాగాడు. కొంగ ఆ వేడిని భరించలేక వెంటనే కృష్ణుని మళ్ళీ బయటకు కక్కింది. కృష్ణుడు ఆ కొంగ నోటినుండి బయటపడ్డాడు. అప్పుడు అది తన పదునైన ముక్కుతో కృష్ణుని పొడిచి చంపుదామని ప్రయత్నించింది. కాని శ్రీకృష్ణుడు చాకచక్యంగా తప్పించుకుంటూ, రెండు చేతులతో దాని ముక్కు రెండు భాగాలను పట్టుకొని గడ్డిపోచను చీల్చినట్లు చీల్చివేశాడు. దానితో బకాసురుడు చచ్చి నేలపై పడ్డాడు. బకాసురుడు కొంగ రూపంలో వచ్చి కృష్ణుణ్ణి చంపాలనుకున్నాడు. కానీ తానే నేలకూలాడు. అదంతా చూసి గోపబాలురు ఆశ్చర్యపడ్డారు. వారికి పోయిన ప్రాణాలు తిరిగివచ్చినట్లు అనిపించింది. నెమ్మదిగా నేలమీద నుండి లేచి, కృష్ణుని దగ్గరకు వచ్చి ఆలింగనం చేసికొని, వారంతా సంతృప్తి చెందారు. అంతేకాదు, ఇండ్లకు తిరిగి రాగానే అందరూ కలిసి కృష్ణలీలలను అద్భుతంగా గానం చేశారు. అరణ్యంలో జరిగిన బకాసురవధను విని గోపగోపికలు ఆశ్చర్యపోయారు. ఆత్రుతతో వారందరు శ్రీకృష్ణుని దగ్గరకు తీసికొన్నారు. కృష్ణబలరాములు, గోపబాలురు క్షేమంగా తిరిగి వచ్చినందుకు సంతృప్తులై వారినే మళ్ళీ మళ్ళీ చూడడం మొదలుపెట్టారు.

**అఘాసురుడు**

పూతన, బకాసురుల సోదరుడు అఘాసురుడు. తనవారిని తుదముట్టించిన శ్రీకృష్ణునిపై ప్రతీకారం తీర్చుకోవాలని వాడు తీవ్రసంకల్పం చేశాడు. కృష్ణునికి, కృష్ణమిత్రులకు తిలోదకాలు ఇస్తే వ్రజవాసులందరు నశించిపోతారని ఊహించాడు. కృష్ణుని, కృష్ణబృందాన్ని ఒకేసారి తుదముట్టించాలని పెద్ద కొండచిలువ రూపాన్ని ధరించాడు. గోపబాలురు అడవికి వెళ్ళే మార్గంలో నోరు తెరచి పడుకున్నాడు. వాడి పై పెదవి ఆకాశాన్ని తాకుతోంది, క్రింద పెదవి భూమిపై ఉంది. నోటిలోని భాగం చీకటిగా ఉంది, నాలుక రహదారిలాగా ఉంది. ఆ వింత దృశ్యాన్ని చూసి గోపబాలురంతా మంచి ఆటస్థలమని అనుకున్నారు. తమ క్రీడార్థం ఏర్పాటు చేయబడిన ఒక విగ్రహమని భావించారు. అయినా వారికి కొంత అనుమానం వచ్చింది. “ఇది చచ్చిందా! లేక మనలను మ్రింగడానికి వచ్చిందా! దీని నోటిలోపల కటిక చీకటిగా ఉంది. దీని నోటి నుండి చెడువాసన వస్తున్నది. ఇది నిజంగా మనలను చంపడానికి వస్తే శ్రీకృష్ణుడు ఉండనే ఉన్నాడు. ఇది కూడ బకాసురుని లాగానే చస్తుంది” అనుకున్నారు. ఆ విధంగా మనస్సులో అనుకుని శ్రీకృష్ణుని అందమైన ముఖారవిందాన్ని చూసి నవ్వుతూ అందరు కొండచిలువ నోట్లోకి ప్రవేశించారు. శ్రీకృష్ణుడు వారిని వారించబోయాడు. అయినా వారు వినలేదు. అందరూ చప్పట్లు చరుస్తూ లోపల ప్రవేశించారు. కాని ఇంకా శ్రీకృష్ణుడు లోపల ప్రవేశించలేదని అఘాసురుడు వారిని మింగలేదు. గోపబాలురను విడిచి ఉండలేక అపుడు శ్రీకృష్ణుడు తాను కూడ కొండచిలువ నోటిలో ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు లోపలకు రాగానే అఘాసురుడు అందరినీ మింగివేశాడు. ఆకాశం నుండి అంతా చూస్తున్న దేవతలు హాహాకారాలు చేశారు. కాని అంతలోనే శ్రీకృష్ణుడు తన శరీరాన్ని పెంచాడు, గొంతుకు అడ్డుపడి ఇంకా పెరగసాగాడు. దానితో అఘాసురునికి ఊపిరాడలేదు. కొన్ని క్షణాలలోనే వాడి నేత్రాలు గిరగిర

తిరగసాగాయి. ఉబ్బి అవి బయటపడ్డాయి. ప్రాణం పోవడానికి మార్గమే దొరకలేదు. అందువల్ల అది బ్రహ్మరంధ్రాన్ని చీల్చుకొని బయటపడింది. అఘాసురుడు అంతమొందాడు. అపుడు శ్రీకృష్ణుడు తన కృపాదృష్టితో గోపబాలురను, గోవత్సాలను తిరిగి బతికించాడు. అందరూ కలిసి పాము నోటినుండి బయటకు వచ్చారు. శ్రీకృష్ణుడు తన గోపబాల గోవత్సాలతో బయటకు వచ్చేంతవరకు అఘాసురుని శరీరంనుండి బయటకు వచ్చిన ఆత్మజ్యోతి ఆకాశంలోనే నిలిచి, చివరకు వచ్చి శ్రీకృష్ణునిలో లీనమైంది. ఆ విధంగా అఘాసురునికి ముక్తి లభించింది. దేవతల ఆనందానికి హద్దు లేకుండపోయింది. వారంతా నృత్య గానాలు చేశారు, పుష్పవృష్టి కురిపించారు. ఎంతో పెద్ద ఉత్సవమే చేశారు. దేవలోకమంతా కోలాహలంతో నిండిపోయింది. ఆ కోలాహలాన్ని విని బ్రహ్మదేవుడు స్వయంగా చూడడానికి వచ్చాడు. దేవతలంతా చేస్తున్న కృష్ణమహిమాకీర్తనను విని బ్రహ్మ ఆశ్చర్యపోయాడు.

కృష్ణరూపాన్ని బలవంతంగానైనా తనలో నిలుపుకున్నందుకు అఘాసురుడు పరమగతిని పొందాడు. అటువంటప్పుడు ఆ దేవదేవుని పాదపద్మాలను నిరంతరం హృదయంలో నిలుపుకునే వారు పొందే దివ్యఫలాన్ని గురించి వేరుగా చెప్పేదేముంది!

***బకాసురాంతక గోవిందా!***
***అఘాసురోద్ధారక గోవిందా!***

## 17. ధేనుకాసుర దమనం

### గోపాష్టమి

శ్రీకృష్ణుని దివ్యదేహం వయస్సులోను, బలంలోను కొద్దిగా పెరిగినట్లు నందమహారాజు భావించాడు. కృష్ణుడు ఇన్ని రోజులు చిన్న పిల్లవాడు కాబట్టి దూడలను మేపుతున్నాడు. ఇప్పుడు పెరిగి పెద్దవాడైనాడు. కనుక దూడలకు బదులు ఆవులను మేపడానికి పంపాలని అనుకున్నారు పెద్దలు. కార్తిక శుక్లపక్ష అష్టమిరోజు నుండి శ్రీకృష్ణుడు గోవులను మేపడానికి అడవికి వెళ్లాడు. పద్మపురాణంలోని కార్తిక మాహాత్మ్యంలో ఇలా తెలుపబడింది.

**శుక్లాష్టమీ కార్తికే తు స్మృతా గోపాష్టమీ బుధైః,**
**తద్దినా ద్వాసుదేవో ఉభూ ద్గోపః పూర్వం తు వత్సపః.**

"కార్తిక శుక్లపక్ష అష్టమిని గోపాష్టమి అని పండితులంటారు. పూర్వం గోవత్సపాలనం కావించిన వాసుదేవుడు ఆ రోజు నుండి గోవులను పాలించే గోపాలుడయ్యాడు."

శ్రీకృష్ణుడు తన పాదపద్మాలతో ధరణిపై తిరిగి భూదేవిని అనుగ్రహించాడు. ఆ దేవదేవుడు పాదరక్షలు లేకుండగానే వనంలో చరిస్తూ బృందావన గోపికలకు కలతను కలిగించాడు. అతని కోమలమగు పాదాలు గాయపడతాయని వారు భయపడ్డారు. అపుడు యశోదమ్మ కృష్ణా! రేపటి నుంచి నీవు అడవికి వెళ్లాలి. నీ పాదాలు చాలా సున్నితమైనవి. కాబట్టి నీకు నేను చెప్పులు కొనిపెడతాను. వేసుకుని వెళ్లు అంది. అందుకు కన్నయ్య, అమ్మా! అమ్మా! మరి ఆవులన్నింటికి కూడా కొనిపెడతావా! అన్నాడు. నందమహారాజుకు (9,00,000) తొమ్మిది లక్షల ఆవులున్నాయని మనం ఇదివరకే చెప్పుకున్నాం. ఆవుకు ఎన్ని కాళ్లుంటాయి. ఒక ఆవుకు నాల్గు కాళ్లు ఐతే, తొమ్మిది లక్షల ఆవులకు యశోదమ్మ ఎన్ని జతల చెప్పులు కొనాలి?

ఈ విషయం వినిన గోవులు చూడు కన్నయ్య మనకోసం చెప్పులు వేసుకోవడం లేదు. చెప్పులు వేసుకోకపోతే తామర పూవులాగ మెత్తగా

ఉండే స్వామి పాదాలు కందిపోతాయి కదా! అందుకని అన్ని గోవులు కలిసి రాత్రికి రాత్రే బృందావనం అంతా తిరిగి తమ గిట్టలతో రాళ్లను కొట్టి కొట్టి మెత్తగా చేశాయి. బృందావనంలో అక్కడ ఇప్పుడు కూడా అలాగే ఉంది. గోవులు కన్నయ్యకు చేసిన సేవ అది.

కృష్ణుడికి గోవులంటే ఎంతో ఇష్టం.

**నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ,**
**జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః.**
**(విష్ణుపురాణం-1.19.65)**

**భావం :** "ఓ దేవా! నీవే గోవులకు, బ్రాహ్మణులకు హితము కలిగించేవాడివి. సమస్త మానవసంఘానికి, ప్రపంచానికి నీవే శ్రేయోభిలాషివి" (విష్ణుపురాణము 1.19.65). సారాంశమేమిటంటే గోవులు, బ్రాహ్మణుల రక్షణ ఈ స్తోత్రములో ప్రత్యేకంగా పేర్కొనబడింది. బ్రాహ్మణులు ఆధ్యాత్మిక విద్యకు చిహ్నము కాగా గోవులు అత్యంత విలువైన ఆహారానికి చిహ్నము. ఈ ఇద్దరు జీవులకు అంటే బ్రాహ్మణులకు, గోవులకు పూర్తి రక్షణను ఇవ్వాలి. అదే నిజమైన నాగరిక పురోగతి. నవీన మానవసమాజంలో ఆధ్యాత్మిక జ్ఞానము ఉపేక్షించబడుతున్నది, గోవధ ప్రోత్సహించబడుతున్నది. అంటే మానవసమాజము తప్పుదిశలో పురోగమిస్తున్నదని, తన వినాశనానికి మార్గము సుగమము చేసికొంటున్నదని తెలిసికోవాలి. తరువాత జన్మలలో పశువులుగా కమ్మని పౌరులకు సలహా ఇచ్చే నాగరికత అసలు మానవ నాగరికతే కాదు. అయినా ప్రస్తుత మానవనాగరికత రజస్తమోగుణాలచేతనే నడుపబడుతోంది. ఇది చాలా ప్రమాదకర మైనయుగము. మానవాళిని పెనుప్రమాదమునుండి కాపాడడానికి అన్ని దేశాలు అత్యంత సులభమైన పద్ధతిని, అంటే కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనను ప్రవేశ పెట్టాలి

**హరే ర్నామ హరే ర్నామ హరే ర్నా మైవ కేవలమ్ !**
**కలౌ నా స్త్యేవ న్యాస్త్యేవ నా స్త్యేవ గతి రన్యథా !!**

**హరినామమే హరినామమే హరినామమే తప్ప కలియుగములో తరించడానికి మరోమార్గం లేదు. మరో మార్గం లేదు మరో మార్గం లేదు.**
**– కలిసంతరణోపనిషత్తు**

కాబట్టి అతిదుర్లభమైన మానవజన్మ వచ్చినందుకు ఈ కలియుగ ధర్మమైన హరినామము "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే! హరే రామ హరే రామ రామ రామ హరే హరే !!" అను మహామంత్రం కనీసం రోజుకు 108 సార్లైనా జపించి జన్మ, మృత్యు, జరా, వ్యాధుల నుండి బయటపడండి.

**కలికాలే నామరూపే కృష్ణావతార!**
**నామ హైతే హయ జగత్ విస్తార !!**

"కలియుగములో భగవన్నామము (హరే కృష్ణ మంత్రము) శ్రీకృష్ణుని అవతారము. అందుకే కేవలము నామసంకీర్తనచే మనిషి భగవంతునితో ప్రత్యక్ష సంబంధాన్ని పొందుతాడు. దీనిని చేసిన ఎవ్వడైనా తరిస్తాడు."

**ధేనుకాసురుడు**

ఒకసారి కృష్ణుని మిత్రులైన గోపబాలురకు తాటిపండ్లు తినాలని కోరిక కలిగింది. కన్నయ్య మిత్రులలో ఒకడైన శ్రీధాముడికి జిహ్వాచాపల్యం ఎక్కువ. అందుకే మిత్రులందరూ ఏమన్నా తినాలని అనిపిస్తే కృష్ణుణ్ణి అడగడానికి శ్రీధాముణ్ణి ఉసిగొల్పుతారు.

ఒకసారి బలరామకృష్ణులు తమ మిత్రులతోపాటు అరణ్యంలో గోవులను మేపుతున్నాడు. అప్పుడు శ్రీధాముడు, సుబల ఇద్దరూ కృష్ణ బలరాముల వద్దకు వెళ్లి ఇలా అన్నారు. "ఓ కృష్ణా! ఇక్కడికి కొద్దిదూరంలో తాళవనం ఉంది. ఆ చెట్లకు పండ్లు నిండుగా ఉన్నాయి. వాటి సువాసనకు మా నోళ్లూరుతున్నాయి. ఆ చెట్లపండ్లు తినాలని మాకు చాలా కోరికగా ఉంది. ఇంతవరకు ఎప్పుడూ రుచి చూడలేదు. ఇప్పటికే చాలా పండ్లు నేలరాలి ఉన్నాయి. ధేనుకాసురుడు గాడిదరూపం ధరించి తన బంధువులతో

ఆ వనాన్ని కాపలా కాస్తున్నాడు. ధేనుకాసురుడు మనుషులను సజీవంగా భక్షిస్తాడు. అందువల్ల జనులు, పశువులు తాళవనానికి పోయేందుకు భయపడతారు. ఆ వనంపై పక్షులు కూడా ఎగురడానికి భయపడుతాయి."

మిత్రుల మాటలను వినిన కృష్ణబలరాములు నేరుగా తాళవనానికి వెళ్లారు. బలరాముడు ఒక తాటి చెట్టును రెండు చేతులతో పట్టుకుని గట్టిగా ఊపాడు. ఆ ఊపుకు పండ్లన్నీ నేలరాలాయి. గోపబాలురు వాటిని తీసుకునే లోపలే ధేనుకాసురుడు గాడిద రూపంలో ఓండ్ర పెడుతూ అక్కడకు వచ్చాడు. వాడి పరుగులకు భూమి కంపించసాగింది. కోపంతో నాలుగు వైపులా పరిగెడుతూ వెనుకటి కాళ్లతో బలదేవుని తన్నాడు. కాని బలదేవుడు వాడి కాళ్లను ఒక్క చేతితోనే పట్టుకుని గాలిలో గిరగిర త్రిప్పి తాటిచెట్టుపైకి విసిరివేశాడు. ధేనుకుని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వాడి బరువుకు ఆ చెట్టు కూలి ప్రక్క చెట్టుమీద పడింది. ఆ చెట్టు పక్క చెట్టుమీద, అలా తాళవనంలో చెట్లన్నీ తుఫాను వచ్చినట్లుగా వరుసగా కూలిపోయాయి.

ధేనుకాసురుని మరణవార్త విని అతని బంధుమిత్రులు గట్టిగా ఓండ్ర పెడుతూ కృష్ణ బలరాములపై దాడిచేసేందుకు పరుగులతో అక్కడకు వచ్చారు. అపుడు కృష్ణబలరాములు ఇద్దరూ కలిసి ఈ గాడిద రాక్షసుల వెనుకటి కాళ్ళను పట్టుకొని వేరే తాటిచెట్లపైకి విసిరేశారు. ఒక్కొక్క చెట్టుపై ఒక్కొక్క గాడిద వేలాడుతూ వుంటే ఆ దృశ్యం చూడడానికి రమణీయంగా కనిపించింది.

కృష్ణ బలరాములు చేసిన ఆ అద్భుతమైన కార్యానికి దేవతలు పుష్పవృష్టి కురిపించారు. ధేనుకాసుర వధ జరిగిన తర్వాత జనులు ఆ వనంలో యథేచ్ఛగా ప్రవేశించి తాటిపండ్లను తృప్తిగా తిన్నారు. గోవులు కూడా స్వేచ్ఛగా గడ్డి మేశాయి.

*ధేనుకాసురాంతకా గోవిందా!*

## 18. కంసుని చంపిన కన్నయ్య

"సంసారంలో ఏమున్నది సారం, కంసారిని సేవించి చేరండి తీరం" అని శాస్త్రాలు చెబుతాయి. శ్రీకృష్ణలీలలలో కంసవధకు ఎంతో ప్రాముఖ్యం ఉంది, అందుకే శ్రీకృష్ణుడు కంసారిగా, అంటే కంసవిరోధిగా ప్రసిద్ధి చెందాడు. కంసవధ గురించి భవిష్యద్వాణి చెప్పినపుడే కంసునికి కృష్ణునిపై విరోధం కల్గింది. ఆ తరువాత ఎంతో కథ, ఎన్నో లీలలు జరిగాయి. అటువంటి అద్భుతమైనలీలల ఉద్దేశ్యం సజ్జనులకు సంతోషం కల్గించి, వారిని రక్షించడం, సత్త్వగుణప్రధానులను భగవంతునివైపుకు మళ్లించడం ఒకటైతే, దుష్టదానవులను దండించడం ఇంకొకటి. శ్రీకృష్ణుడు జన్మించింది మథురలోనే అయినా లీలలన్నింటినీ గోకులంలో, బృందావనంలో చేశాడు. తరువాత కంసవధ చేయడానికి ఆ దేవాదిదేవుడు తిరిగి మథురకు చేరాడు. ఆ విధంగా కంసవధ అనే లీల బృందావనలీలల పరిసమాప్తిని, మథురలీలల ఆరంభాన్ని సూచిస్తుంది. శ్రీకృష్ణలీలలలో బృందావనలీలలు, మథురలీలలు, ద్వారకలీలలు అనేవి మూడు ఉంటాయి. ప్రస్తుత కథతో బృందావనలీలలు ముగిసి మథురలీలలు ఆరంభమౌతాయి.

బలరామకృష్ణులను మథురకు రప్పించి, వారిని మల్లురచే చంపించాలని పన్నాగం పన్నిన కంసుడు వారిని రప్పించే భారాన్ని అక్రూరునికి అప్పగించాడు. అక్రూరుడు బృందావనానికి వెళ్ళి సోదరులిద్దరితో కలిసి మథురకు బయలుదేరాడు. వారి వెంట నందాదిగోపులు కూడ వెళ్ళారు. దారిలో ఒకచోట అక్రూరుడు యమునలో దిగి ధ్యానం చేస్తుండగా హఠాత్తుగా నీటిలో కృష్ణబలరాములను చూశాడు. నదిఒడ్డున రథంలో ఉన్న కృష్ణబలరాములు నీటిలోకి ఎలా వచ్చారా అని అక్రూరుడు ఆశ్చర్యపడి, నీటినుండి బయటకు వచ్చి చూసేసరికి రథంలో వారు అలానే కనిపించారు. తాను నీటిలో చూసింది భ్రమ అనుకుని అక్రూరుడు మళ్ళీ జలంలోకి ప్రవేశించాడు. ఈసారి అతనికి అత్యంత అద్భుతమైన సన్నివేశం కనిపించింది. అనంతశేషుడు, ఆతడు శయ్యగాగా

వానిపై పవళించిన భగవంతుడు, ఆ దేవదేవుని స్తుతించే ప్రహ్లాద నారదాది భాగవతులు, భగవంతుని సేవిస్తున్న శక్తిగణం కనిపించాయి. అక్రూరుడు ఆ దేవదేవుని నానారకాలుగా స్తుతించి నీటినుండి బయటకు వచ్చాడు. బయటకు రాగానే మళ్ళీ తీరంలోని రథంలో కూర్చొని ఉన్న కృష్ణబలరాములు కనిపించారు. "నదిలో అనుష్ఠానానికి వెళ్ళి ఇంత ఆలస్యం చేశావేమిటి? ఏమైనా వింతలు కనిపించాయా?" అని శ్రీకృష్ణుడు ఏదీ తెలియనట్లుగా అక్రూరుని అడిగాడు. "కృష్ణా! ఈ జగత్తులో ఉన్నట్టి సమస్త అద్భుతాలు నీలోనే ఉన్నాయి. నిన్ను చూస్తే అన్ని అద్భుతాలు చూసినట్లే కదా!" అని నవ్వుతూ అక్రూరుడు సమాధానమిచ్చాడు. ఆ విధంగా చివరకు అక్రూరుడు కృష్ణబలరాములను గూడి సాయంత్రవేళకు మథురకు చేరుకున్నాడు. అయితే నందాది గోపబాలకులు వారికంటే ముందుగానే నగరానికి చేరుకొని కృష్ణబలరాముల కొరకు ఎదురు చూడసాగారు. మొత్తానికి అందరూ మథురలో కలిసికోగానే సోదరులిద్దరు అక్రూరుని పంపివేశారు. తన ఇంటికి రమ్మని అక్రూరుడు ఎంతగానో ప్రాధేయపడ్డాడు. తమ కార్యాలు పూర్తి కాగానే తప్పకుండ వస్తానని చెప్పి శ్రీకృష్ణుడు అతనిని పంపివేశాడు. కృష్ణబలరాములను మథురకు తీసికొని వచ్చానని కంసునికి వర్తమానం అందించి, అక్రూరుడు ఇంటికి చేరుకున్నాడు. తరువాత బలరామకృష్ణులు మిత్రులతో కలిసి మథురాపురాన్ని చూడడానికి బయలుదేరారు. ఆ విషయం తెలియగానే మథురవాసులు ఉత్సాహంతో ఇండ్ల నుండి బయటకు వచ్చారు. మథురాపుర స్త్రీల విషయం వేరుగా చెప్పనక్కరలేదు. వారంతా అన్ని పనులను ఎక్కడికక్కడే విడిచి ఇండ్ల ముందు మూగారు. వారు కృష్ణనామమే ఉచ్చరిస్తున్నారు. వారంతా బృందావనభామల గొప్పదనాన్ని, సౌభాగ్యాన్ని వేనోళ్ళ కొనియాడారు. వారంతా ఇండ్లపైన, కప్పుల పైన నిలిచి సోదరులిద్దరిపై పుష్పవృష్టి కురిపించారు. వారందరిని ప్రేమతో చూస్తూ కృష్ణబలరాములు ముందుకు సాగారు.

వారు వెళ్ళే దారిలో ఒక చాకలివాడు కనిపించాడు. అపుడు శ్రీకృష్ణుడు వాడిని తమకు మంచి వస్త్రాలను ఇమ్మని అడిగాడు. కాని ఆ చాకలివాడు

అతిగర్వంతో ఆ కోరికను త్రోసిపుచ్చి, పైగా నోటికి వచ్చినట్లు తిట్టాడు. అపుడు శ్రీకృష్ణుడు కేవలం కొనగోటితో వాడి శిరస్సును ఖండించాడు. తమ నాయకునికి పట్టిన గతిని చూసి మిగిలిన చాకలివాండ్రు వస్త్రం మూటలను వదలి పరుగులు తీశారు. కృష్ణబలరాములు అపుడు తమకు నచ్చిన వస్త్రాలను తీసికొని, కొన్నింటిని గోపాలురకు ఇచ్చి, మిగిలినవి అక్కడే పడవేశారు.

**సాలెవానికి సారూప్యముక్తి**

మథురాపుర విహారంలో సాగుతుండగా ఒక సాలెవాడు కనిపించాడు. అతడు ఎంతో భక్తితో, ప్రేమతో రంగు రంగుల వస్త్రనిర్మిత ఆభూషణాలను కృష్ణబలరాములకు సమర్పించాడు. రంగురంగుల తలపాగాలతో వారు ఎంతో ప్రకాశంగా కనిపించారు. సాలెవాని భక్తికి మెచ్చిన శ్రీకృష్ణుడు అతనికి సారూప్యముక్తిని, ఈ లోకంలో ఐశ్వర్యాన్ని, బలాన్ని, ప్రభావాన్ని, స్మృతిని, ఇంద్రియపటుత్వాన్ని ఇచ్చాడు.

**మాలాకారుడు**

ఆ విధంగా సాలెవానిని అనుగ్రహించిన తరువాత సోదరులిద్దరు సుదాముడనే మాలాకారుని ఇంటికి వెళ్ళారు. సుదాముడు బలరామకృష్ణులను ఇంటిలోనికి ఆహ్వానించి, పాదపూజ చేశాడు. చందనపుష్పాదులతో పూజించాడు. నానారకాల స్తుతులతో అర్చించాడు. తరువాత మంచి సువాసనగల పూమాలలను కృష్ణబలరాములకు సమర్పించాడు. అతని భక్తికి పరవశించిన శ్రీకృష్ణుడు ఏదేని వరం కోరుకొమ్మని అడిగాడు. "కృష్ణా! నీ యందు అచంచలమైన భక్తిని, నీ భక్తులతో చెలిమిని, సకలజీవుల పట్ల దయను నాకు ఇవ్వవలసింది", అని సుదాముడు వినమ్రంగా కోరుకున్నాడు. శ్రీకృష్ణుడు అతనికి ఆ వరములనే గాక బలం, దీర్ఘాయువు, యశస్సు, సౌందర్యం, నిరంతర వంశాభివృద్ధి ఇచ్చాడు.

## సుందరిగా మారిన గూనివనిత

ఆ విధంగా సుదాముని అనుగ్రహించిన తర్వాత మాధవుడు రాజమార్గంలో నడుస్తున్నాడు. అదేదారిలో ఒకగూనివనిత వస్తోంది. ఆమె చందనాది లేపనాలను బంగారు పాత్రలలో కంసుని దగ్గరకు తీసికొని వెళుతోంది. శ్రీకృష్ణుడు ప్రేమానంద ప్రదాత. వెంటనే ఆ దేవదేవుడు ఆమెను చూసి నవ్వుతూ ఇలా అన్నాడు.

''ఓ సుందరీ! నీవు ఎవరు? ఈ చందనం ఎవరి కొరకు తీసికొనిపోతున్నావు? ఈ లేపనాలను మాకిస్తే నీకు కోరిన వరాలను ఇస్తాం."

కృష్ణుని మాటలకు మురిసిపోయిన ఆ గూనివనిత "ఓ సుందరా! నేను కంసదాసిని. నేను చక్కని అంగరాగాలను తయారు చేస్తాను, కాబట్టి కంసునికి నేనంటే ఎంతో ఇష్టం. నా పేరు త్రివక్ర. అయినా నేను తయారు చేసిన ఈ చందనాది లేపనాలు పూసుకోవడానికి మీకు మించిన యోగ్యులు ఇంకెవరు ఉంటారు?" అని పలికి కృష్ణబలరాములకు చందనాన్ని సమర్పించింది. నానావర్ణయుత లేపనాలతో కృష్ణబలరాములు సుందరంగా కనిపించారు. అపుడు కృష్ణుడు ఆ గూనివనిత పాదాలను తన రెండు పాదాలతో నొక్కిపట్టి, ఆమె గడ్డాన్ని తన రెండు చూపుడు వ్రేళ్ళతో పైకెత్తి శరీరాన్ని నిటారుగా చేశాడు. దానితో గూనివనిత అతిసుందరంగా తయారైంది. అపుడు కుబ్జ తన ఇంటికి రమ్మని కృష్ణుని ప్రార్థించింది. తరువాత వస్తానని చెప్పి శ్రీకృష్ణుడు ఆమెను పంపేశాడు.

## గూనివనిత ఎవరు!

గర్గసంహిత ప్రకారం కుబ్జ పూర్వజన్మలో రావణాసురుడి చెల్లెలు శూర్పణఖ. శూర్పణఖ రామచంద్రుణ్ణి భర్తగా పొందాలనుకుంది. కానీ రాముడు ఏకపత్నీవ్రతుడు అని చెప్పగానే వెంటనే ఆమె కోపంతో సీతాదేవిని మ్రింగడానికి వెళ్లింది. లక్ష్మణుడు ఆమెను అడ్డగించి ముక్కు, చెవులు నరికేశాడు. ఆ తరువాత ఆమె సోదరుడు రావణాసురుడు సీతను

అపహరించాడు. రావణాసురుడితోపాటు, మిగతా సోదరులందరూ రాముడి చేతిలో మరణించారు. శూర్పణఖ ఆ బాధను తట్టుకోలేక పుష్కర తీరానికి వెళ్లి 10,000 సం॥లు నీటిలోపల శివుడి గురించి తపస్సు చేసింది. ఆమె తపస్సుకు మెచ్చిన శివుడు "నీవు ద్వాపర యుగంలో భగవంతుని సాన్నిధ్యం పొందుతావు" అని వరం ఇచ్చాడు. ఆ శూర్పణఖే కుబ్జగా జన్మించింది.

తరువాత శ్రీకృష్ణుడు ధనుర్యాగం జరిగే ప్రదేశం గురించి అడుగుతూ చివరకు అక్కడకు చేరుకొన్నాడు. దివ్యమైన ఆ ధనుస్సును ఎంతోమంది సైనికులు రక్షిస్తున్నారు. వారంతా వారిస్తున్నా శ్రీకృష్ణుడు ముందుకు వెళ్ళి ఆ విల్లును ఎత్తి, అల్లెత్రాడు ఎక్కుపెట్టి లాగి చెరుకుగడలాగా విరిచేశాడు. ధనుస్సు విరిగిన శబ్దం నలుదిక్కులా వ్యాపించింది. ఆ శబ్దం కంసుని వరకు చేరింది. దానితో అతనికి తీవ్రమైన భయం కలిగింది. అది చూసిన రాజభటులకు ఎంతో కోపం వచ్చింది. వారంతా ఆయుధాలను చేపట్టి కృష్ణుని మీదకు వచ్చారు. కాని బలరామకృష్ణులు విరిగిన ధనుస్సు ముక్కలనే పట్టుకొని, వాటితో రాజభటులను కొట్టి చంపారు. ఆ విధంగా ధనుస్సును రక్షించే సేనాకూటమి పూర్తిగా నశించింది. కృష్ణబలరాముల బలాన్ని, ధైర్యసాహసాలను చూసి మథురాపురజనులు విస్మయం చెందారు. వారు తప్పకుండ దేవతలే అనుకున్నారు. ఇంతలోపల సంధ్యాసమయం అయింది. కృష్ణబలరాములు తమ విడిదికి చేరుకొని పాలు కలిపిన అన్నాన్ని తిని హాయిగా నిద్రపోయారు.

కాని రాజప్రాసాదంలో కంసునికి నిద్రపట్టలేదు. మథురలో కృష్ణబలరాములు చేసిన వీరవిహారం గురించి విని అతడు భయభీతుడయ్యాడు. అతనికి ఎన్నో దుశ్శకునాలు కనిపించాయి. అద్దంలో తన ప్రతిబింబం చూసుకొంటే తల కనిపించలేదు; చంద్రతారకలు రెండురెండుగా కనిపించసాగాయి; దయ్యాలు తనను ఆలింగనం చేసికొంటున్నట్లు, అనిపించింది. పడుకోగానే తాను గాడిదపై ఎక్కినట్లు కల వచ్చింది, తాను దిగంబరుడై ఎక్కడికో పోతున్నట్లు అనిపించింది. ఈ దుశ్శకునాలతో

కంసునికి మృత్యుదర్శనమే కలిగింది. మొత్తానికి ఏదోవిధంగా రాత్రి గడిచిపోయింది. తెల్లవారగానే అతడు మల్లక్రీడోత్సవాన్ని ఆరంభించడానికి సన్నద్ధుడయ్యాడు. మల్లక్రీడోత్సవానికి అన్ని ఏర్పాట్లు అయ్యాయి. రంగస్థలాన్ని చక్కగా అలకరించారు. పతాకలు, తోరణాలు చక్కగా అమర్చారు. వర్ణానుసారం జనులు తమకు కేటాయించిన స్థానాలలో ఆసీనులయ్యారు. కంసుడు కూడ వచ్చి రాచమంచెపై కూర్చున్నాడు. తన సామంతరాజుల మధ్యన కూర్చున్న అతని హృదయం కంపించసాగింది. మల్లక్రీడకు అనుగుణమైన తాళంతో వాద్యాలు మ్రోగుతుండగా మల్లురు తమశిక్షకులతోపాటు రంగస్థలంలో ప్రవేశించారు. చాణూరుడు, ముష్టికుడు, కూటుడు, శలుడు, తోశలుడు వంటి వారందరు వచ్చి రంగస్థలంలో ఆసీనులయ్యారు. అపుడు నందాదిగోవులు తాము తెచ్చిన కానుకలను కంసునికి సమర్పించి ఒక మంచెపై ఆసీనులయ్యారు.

ఇంతలో కృష్ణబలరాములు చక్కగా అలంకృతులై రంగస్థల ముఖద్వారం చెంతకు చేరుకున్నారు. కాని వారు లోపలికి ప్రవేశించే లోపల ఒక మావటివాడు పెద్ద ఏనుగును వారిదారికి అడ్డంగా నిలిపాడు. తమకు అడ్డం తొలగి దారి ఇవ్వమని, లేకపోతే నేరుగా ఏనుగును, వాడిని యమపురికి పంపిస్తానని శ్రీకృష్ణుడు హెచ్చరిక చేశాడు. ఆ గజం పేరే కువలయాపీడం. కృష్ణుని మాటలు మావటివానిని రెచ్చగొట్టాయి. వాడు అంకుశంతో ఏనుగును పొడిచాడు. ఏనుగు తొండంతో కృష్ణుని పట్టుకోబోయింది. కాని దేవదేవుడు తప్పించుకొని దాని కాళ్ళ మధ్యగా వెళ్ళి కనబడకుండ దాగుకొన్నాడు. ఏనుగు ఆతని కొరకు అటు ఇటు వెదికింది. ఇంతలో శ్రీకృష్ణుడు దాని తోకను పట్టుకొని ఇరవైయైదు ధనువుల దూరంగా లాక్కుపోయాడు. ఏనుగు ఎంతగా ప్రయత్నించినా దానిని వారించ లేకపోయింది. తరువాత శ్రీకృష్ణుడు దాని కాళ్ళ మధ్యగా అటు ఇటు చరిస్తూ అది తికమకతో నేలపై పడిపోయేటట్లు చేశాడు. అపుడు శ్రీకృష్ణుడు దానిపై దుమికి, దంతాన్ని ఊడబెరికి దానితోనే మావటివానిని, ఏనుగును

సంహరించాడు. అపుడు కృష్ణబలరాములు చెరొక దంతాన్ని భుజములపై పెట్టుకొని రంగస్థలంలో ప్రవేశించారు. వారి శరీరాలపై చెమట బిందువులు, రక్తబిందువులు కనిపించాయి. వారెంతో సుందరంగా గోచరించారు. కృష్ణబలరాములను చూడగానే అందరిలోను నానారకాలైన రసభావాలు పెల్లుబికాయి. పురుషులకు అద్భుతరసం, స్త్రీలకు శృంగారరసం, గోవులకు హాస్యరసం, రాజులకు వీరరసం, తల్లిదండ్రులకు దయారసం, కంసునికి భయరసం, అల్పజ్ఞులకు భీభత్సరసం, యోగులకు శాంతరసం, వృష్ణివంశీయులకు ప్రేమభక్తి హృదయంలో కలిగాయి.

తరువాత కృష్ణబలరాములకు చాణూరముష్టికులతో మల్లయుద్ధం ఏర్పాటు అయింది. శ్రీకృష్ణుడు చాణూరునితో తలపడ్డాడు, బలరాముడు ముష్టికునితో తలపడ్డాడు. పెద్దలకు, పిన్నలకు మధ్య జరుగుతున్న ఆ యుద్ధాన్ని ఒక కంసుడు తప్ప ఎవ్వరూ మెచ్చలేదు. స్త్రీల హృదయాలు బాధతో ఆక్రందించాయి. సందర్శకులు ఆ మల్లయుద్ధాన్ని తిలకించలేక పోయారు. అదెంతో ఘోరంగా సాగుతోంది. ఇక చాణూరుని వధించడమే తత్క్షణ కర్తవ్యమని శ్రీకృష్ణుడు భావించి వాడి శరీరాన్ని పూర్తిగా భగ్నం చేశాడు. తరువాత వాడి చేతులను పట్టుకొని గాలిలో గిరగిర త్రిప్పి నేలపై కొట్టాడు. దానితో చాణూరుడు జెండా కూలినట్టు కూలి మరణించాడు. ఈ లోపల బలదేవుడు కూడ ముష్టికుని మర్దించాడు. తన అరచేతితో బలదేవుడు కొట్టగానే ఆ దెబ్బకు ముష్టికుడు నోటినుండి రక్తం క్రక్కుతూ మరణించాడు. చాణూరముష్టికులు అంతమొందగానే కూటుడు, మల్లుడు రంగప్రవేశం చేశారు. వారికి కూడ చాణూర ముష్టికుల గతే పట్టింది. ఆ తరువాత శలుడు, తోశలుడు కూడా మరణించారు. అపుడు కృష్ణబలరాముల వీరవిహారం చూసి మిగిలిన మల్లురు ప్రాణభీతితో పారిపోయారు. ఆ విధంగా మల్లురను సంహరించిన కృష్ణబలరాములు గోపస్నేహితులను చెంతకు పిలిచి నృత్యం చేస్తూ క్రీడించారు. అపుడు వారి నృత్యానికి అనుగుణంగా తూర్యనాదాలు వినిపించాయి. ఆ దివ్యసోదరుల అద్భుతమైన కార్యాన్ని

కంసుడు తప్ప అందరూ అభినందించారు. విప్రులు, సాధువులు బాగుబాగని పలికారు. కాని అది కంసునికి నచ్చలేదు; వెంటనే వాద్యనాదాలను ఆపించాడు, నందాదులను బంధించమని అరిచాడు, వసుదేవుని వధించమన్నాడు, తన తండ్రి ఉగ్రసేనుని కూడ చంపివేయండని భటులకు ఆజ్ఞాపించాడు. వాడు ఆ విధంగా పిచ్చెక్కినట్లు అరుస్తున్న సమయంలో శ్రీకృష్ణుడు కొదమసింహంలాగా రాచమంచె పైకి దుమికి కంసుని ఎదుట నిలబడ్డాడు. మూర్తీభవించిన మృత్యువులాగా శ్రీకృష్ణుడు ఎదుట నిలువగానే కంసుడు ఖడ్గం, డాలు పట్టుకున్నాడు. అయినా శ్రీకృష్ణుడు వాడిని బలవంతంగా పట్టుకొని నేలమీద ఈడ్చి పడవేశాడు. తరువాత వాడి రొమ్ముపై కూర్చొని పిడికిళ్ళతో కొట్టగా అతని ప్రాణం గాలిలో కలిసిపోయింది. కంసుడు మరణించాడని అందరికీ తెలిసేలాగున కృష్ణుడు వాని మృతకళేబరాన్ని నేలపై ఈడ్చుకుని పోయాడు. అది చూసి జనులలో హాహాకారాలు చెలరేగాయి. వెంటనే కంససోదరులు కృష్ణబలరాములపై దాడి చేశారు. కాని వారికి కూడ అన్నగారి గతే పట్టింది. అపుడు ఆకాశంలో దేవదుందుభులు మ్రోగాయి. బ్రహ్మరుద్రాది దేవతలు దివినుండి కృష్ణబలరాములపై పుష్పవృష్టి కురిపించారు. ఇంతలో కంసుని పత్నులు వచ్చి తలలు బాదుకుంటూ ఏడ్వసాగారు. అపుడు వారిని శ్రీకృష్ణుడే ఓదార్చాడు, అంతేకాకుండ మరణించినవారికి అంత్యక్రియలు ఏర్పాటు చేయించాడు. కంసవధ పూర్తి కాగానే కృష్ణబలరాములు చెరసాలకు వెళ్ళి తమ తల్లిదండ్రులను బంధవిముక్తులను చేసి, వారికి నమస్కరించారు. వారిద్దరు జగదీశ్వరులని తలుస్తూ దేవకీవసుదేవులు ఏమి చేయాలో తోచక కేవలం చేతులు జోడించి నిలబడ్డారు, వారిని ఆలింగనం చేసుకోలేదు. ఆ విధంగా కంసవధతో దేవదేవుడైన శ్రీకృష్ణుడు కంసారిగా ప్రసిద్ధి చెందాడు.

*కంససంహార గోవిందా! ధర్మసంస్థాపక గోవిందా!*
*కృష్ణం వందే జగద్గురుమ్*